

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


దేశవ్యాప్తంగా జిల్లాకో బాలికల హాస్టల్
ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు

విబి–జి–రామ్ జి పథకానికి రూ.95,000 కోట్లకు పైగా కేటాయింపు

03


సంపుటి 09, సంచిక: 65 | సోమవారం | 02-02-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# సామాన్యులకు దక్కని ఊరట

హైదరాబాద్ సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్‌లు

మొత్తం బడ్జెట్ రూ.53,47,315

రెవెన్యూ వసూళ్లు రూ.35,33,150

ద్రవ్య లోటు రూ.16,95,768

మూలధన వ్యయం రూ.17,14,523

वित्त मंत्रालय MINISTRY OF FINANCE | pib | UNION BUDGET 2026-27

### కీలక గణాంకాలు

| రూ.కోట్లు | 2024-25 (ప్రస్తుతం) | 2025-26 (బడ్జెట్ అంచనాలు) | 2025-26 (సవరించిన అంచనాలు) | 2026-27 (బడ్జెట్ అంచనాలు) |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 3,03,6619 | 34,20,409 | 33,42,323 | 35,33,150 |
| మూలధన వసూళ్లు | 16,16,249 | 16,44,936 | 16,22,519 | 18,14,165 |
| మొత్తం వసూళ్లు | 46,52,867 | 50,65,345 | 49,64,842 | 53,47,315 |
| మొత్తం వ్యయం | 46,52,867 | 50,65,345 | 49,64,842 | 53,47,315 |
| మూలధన వ్యయం | 13,24,609 | 15,48,282 | 14,03,906 | 17,14,523 |
| రెవెన్యూ లోటు | 5,64,296 | 5,23,846 | 5,26,764 | 5,92,344 |
| ప్రభావం చూపే రెవెన్యూ లోటు | 2,91,640 | 96,654 | 21,8,613 | 99,642 |
| ద్రవ్య లోటు | 15,74,431 | 15,68,936 | 15,58,492 | 16,95,768 |
| ప్రాథమిక లోటు | 4,58,856 | 2,92,598 | 28,4154 | 2,91,796 |

## కీలక అంశాలు లేకుండా లెక్కల గారడీ కేంద్ర బడ్జెట్‌లో కానరాని ప్రజా సంక్షేమం

ఒకవైపు పెరిగిపోతున్న నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, ఆదాయ అంతరాలు ... మరోవైపు అమెరికా విధించిన భారీ టారిఫ్‌లతో కుదేలైన తయారీరంగం, తగ్గిన పారిశ్రామికాభివృద్ధి... ఇటు సామాన్య, మధ్యతరగతి జీవులు, అటు ఎంఎస్ఎంఇలు, రైతులు.. బడ్జెట్ నుంచి ఎంతో ఆశించారు.. ఇవేవి పట్టించుకోకుండా కొత్త పదాల విన్యాసాలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026—27 బడ్జెట్ అందరి ఆశలపై నీళ్ళు చల్లింది. కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పట్టును మరింత బిగించింది. జిఎస్‌టి, ఎఫ్ఆర్‌బిఎం కట్టడితో ఉక్కిరిబిక్కిరవుతున్న రాష్ట్రాలకు ఏమాత్రం ఊరటనివ్వకుండా పాత మార్గంలోనే 16వ ఆర్థిక సంఘం సూచించిన 41 శాతం పన్నుల పంపిణీకే కేంద్రం ఓకే చెప్పింది. సమాఖ్యవాదంపై మరింత దాడి చేసింది .. ఆహారం, ఎల్‌పిజి గ్యాస్, ఎరువుల సబ్సిడీలను తగ్గించింది... చివరకు బిజెపికి దన్నుగా నిలిచే పరిశ్రమ, పట్టణ మధ్యతరగతి వర్గాలు కూడా బడ్జెట్‌తో నిరాశకు గురైందనేందుకు కుప్పకూలిన షేర్ మార్కెటే నిరూపించింది...సర్వరోగ నివారిణిగా వికసిత్ భారత్ – 2047ను చూపిస్తూ.. కళ్ళకు కనిపిస్తున్న సమస్యలను వాయిదా వేస్తూ, ఎలాంటి దిశలేని బడ్జెట్‌గా నిలిచింది.

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర భారత చరిత్రలో తొలిసారి ఆదివారం కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టారు. మొత్తం రూ.53,47,315 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. అయితే ఎప్పటి మాదిరిగానే అంకెల గారడీ పత్రంగా మారింది. ఆదాయ పన్ను స్లాబ్ నుంచి ద్రవ్యోల్బణ పరిస్థితుల నుంచి విముక్తి వరకూ సామాన్యులు కోరుకున్న కీలక అంశాలులేవీ ఈ బడ్జెట్‌లో ప్రతిబింబించ లేదు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు చేసిన ప్రకటనలకు, వాస్తవ కేటాయింపులకూ ఎక్కడా పొంతన లేదు. గత ఆర్థిక సంవత్సరంలో అనేక సంక్షేమ పథకాలు, కీలక రంగాలకు చేసిన కేటాయింపులు వాస్తవానికి దక్కలేదు. ఈసారి కూడా అలాంటి మాయాజాలాన్నే ప్రయోగించే ప్రయత్నం చేశారు నిర్మలా సీతారామన్. నిరుద్యోగం నుంచి రైతు సమస్యల వరకూ... ధరల పెరుగుదల నుంచి ఆదాయ పన్ను రాయితీ వరకూ ఏ ఒక్క విషయాన్నీ స్పష్టం చేయని పలాయనవాదం ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో, అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నం జరిగిందన్న పలువురు ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఏదిఏమైనా నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూపాయి రాకడ, పోకడ తీరుతెన్నులు ఇలావున్నాయి.. రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను తరువాయి 2లో

## మన అప్పులు రూ.214.82 లక్షల కోట్లు!

### అందులో ఎన్‌డిఎ ప్రభుత్వం రుణాలే రూ.150 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ :** భారత ప్రభుత్వ రుణభారం వచ్చే ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి రూ.214.82 లక్షల కోట్లకు చేరనుంది. ఇందులో అంతర్గత రుణాలు రూ.207.71 లక్షల కోట్లు కాగా, విదేశీ రుణాలు రూ.7,11,182 కోట్లు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పులు రూ.56 లక్షల కోట్ల మేరకు ఉండేవి. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్న పన్నెండేళ్లలో రూ.150 లక్షల కోట్లు అప్పులు పెరిగాయి. ప్రస్తుత బడ్జెట్ కాలం పూర్తయ్యే 2025 మార్చి 31వ తేదీ నాటికి మొత్తం రుణాలు రూ.197.18 లక్షల కోట్లకు చేరుకుంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో దీనికి మరో రూ.10 లక్షల కోట్లు అదనంగా చేరి భారతదేశ రుణభారం రూ.217.82 లక్షల కోట్లకు పెరగనుంది.

## పెట్టుబడులు ఉపసంహరణ లక్ష్యం రూ.80వేల కోట్లు



**న్యూఢిల్లీ :** వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి జాబితాను గతంలోనే క్యాబినెట్ ఆమోదించిందని, దానికి ప్రకారం పెట్టుబడుల ఉపసంహరణను కొనసాగిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో తొలుత రూ.47 వేల కోట్లు పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా కూడగట్టాలని భావించినప్పటికీ, దానిని రూ.33,837 కోట్లకు సవరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.17,201.61 కోట్లు పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం సమీకరించింది.

140 కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం

## వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్ భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. 2047 మిషన్ లక్ష్యాల మేరకు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందని అన్నారు. సంస్కరణలను బలోపేతం చేయటంతోపాటు వికసిత్ భారత్ నిర్మాణానికి రోడ్‌మ్యాప్‌గా పనిచేస్తుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని, చరిత్రాత్మక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. 'చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టాం. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశాం. కేంద్ర బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుంది. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో మరింత ఊతమిచ్చాం. లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి భారత్ ఎదిగింది. యువ శక్తిని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉంది. యువతకు గేమింగ్, టూరిజం, క్రీడా సౌకర్యాలు కల్పించాం. వికసిత్ భారత్ ప్రయాణం వేగవంతానికి బడ్జెట్ తోడ్పాటును అందిస్తుంది. సంస్కరణలకు బడ్జెట్ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. భారత్‌ను డేటా సెంటర్‌గా మార్చేందుకు ట్యాక్స్ హాలిడే ఉపయోగపడుతుంది. ఇది భారత్‌ను డేటా సెంటర్ హబ్‌గా మారుస్తుంది. ఉద్యోగాల కల్పనకు కేంద్ర బడ్జెట్ మరింత దోహదం చేస్తుంది' అని అన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కొనియాడారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ, ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని తరువాయి 2లో

దేశ సమస్యలు పట్టని మోదీ సర్కార్

## ఇదొక గుడ్డి బడ్జెట్

### కేంద్ర బడ్జెట్‌పై రాహుల్ గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఇదొక గుడ్డి బడ్జెట్. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ సంక్షోభాలు దీనికి కనిపించడం లేదు' అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి ఆలోచనలు అడుగంటాయని, దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సవాళ్లకు ఇందులో ఒక్కటంటే ఒక్క పరిష్కారం కూడా లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా బడ్జెట్‌పై స్పందించారు. దేశంలోని దయనీయ పరిస్థితులను వివరిస్తూ ఆరు కీలక అంశాలను ప్రస్తావించారు. 'దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవు, తయారీ రంగం కుప్పకూలుతోంది. పెట్టుబడిదారులు భయపడి తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. సామాన్యుడి ఇంట్లో పొదుపు ఆవిరైపోతోంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆవేదనలో ఉన్నాడు. ప్రపంచవ్యాప్తంగా రాబోయే ఆర్థిక ముప్పులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. దేశం తప్పుడు మార్గంలో వెళ్తున్నప్పుడు, బడ్జెట్ ద్వారా దాన్ని సరిదిద్దాలి. కానీ ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. వాస్తవాలను చూడటానికి ఇష్టపడటం లేదు. సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు ఇందులో శూన్యం' అని రాహుల్ విమర్శించారు.


**ఐడియాలు అయిపోయాయి: ఖర్గే**

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా మోదీ ప్రభుత్వంపై సెటైర్లు వేస్తూనే, లోతైన విశ్లేషణ చేశారు. 'మోదీ ప్రభుత్వానికి కొత్త ఆలోచనలు రావడం లేదు. 'మిషన్ మోడ్' అని గొప్పలు చెప్పుకునే వారు ఇప్పుడు 'ఛాలెంజ్ రూట్' లోకి వెళ్లిపోయారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఎక్కడా ఆగడం లేదు. రాజకీయ చిత్తశుద్ధి లేదు. కనీసం విధానపరమైన లోపాలను దాచుకోవడానికి కొత్త స్లోగన్లు కూడా ఈ బడ్జెట్‌లో తరువాయి 2లో

ఆర్థిక సంక్షోభంపై పోరుకు ప్రభుత్వ తిరస్కారం

## ప్రజావిరుద్ధంగా ప్రాధాన్యతలు

### కేంద్ర పద్దుపై సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం పెదవివిరుపు



**న్యూఢిల్లీ:** బడ్జెట్ (2026–27) ప్రాధాన్యతలు జనబాహుళ్య ఆందోళనకు విరుద్ధంగా ఉన్నాయని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) విమర్శించింది. దేశం ఎదుర్కొంటున్న నిజమైన ఆర్థిక సంక్షోభంతో పోరాడేందుకు ప్రభుత్వం తిరస్కరించిందన్న విషయాన్ని కేంద్ర బడ్జెట్ మరోసారి ప్రతిబింబించిందని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించింది. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు, అస్థిరత, వాణిజ్య వివాదాలు ఉద్ధృతమవుతున్న సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ వాటి బారిన పడకుండా, ప్రజల జీవనోపాధిని రక్షించేందుకు ఒక బృహత్తర ప్రణాళికను కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించలేకపోయారని పార్టీ విమర్శించింది. ''ఒక స్పష్టత ఇవ్వడానికి బదులుగా, ఈ బడ్జెట్ ఉద్దేశపూర్వక అస్పష్టతకు చిహ్నంగా మారింది. సంక్షేమరాజ్యంలో దేశ గమనానికి కీలకమైన కార్యక్రమాలకు పథకాల వారీగా కేటాయింపులను ఇవ్వకుండా దాపరికపు సంకేతాలిచ్చారు, ఆడంబరపు ప్రకటన వెనుక ఉన్న నిధుల కోతలను రహస్యంగా దాచిపెట్టి, దేశ ప్రజలు–పార్లమెంటు కూడా గుడ్లప్పగించి ఉండిపోయేలా చేసేందుకు ప్రయత్నం చేశారు. దేశ వృద్ధి ప్రధానంగా దేశీయ వినియోగంపైనే ఆధారపడి ఉందని ఆర్థిక సర్వే నివేదిక చాలా స్పష్టంగా చెప్పింది. కానీ మరిన్ని వస్తుసేవలను కొనుగోలుచేసేవిధంగా వినియోగదారులను, వ్యాపారులను ప్రోత్సహించేవిధంగా చర్యలు తీసుకోవడంలో బడ్జెట్ విఫలమైంది. గ్రామీణ భారతదేశంలో కొనసాగుతున్న నిర్లక్ష్యం,ఒక పద్ధతి ప్రకారం కొనసాగుతున్న సామాజికరంగ విధ్వంసానికి ఈ వైఫల్యం ఒక ప్రత్యక్ష తార్కాణం. కార్మిక హక్కులను, వికేంద్రీకరణను, వేతన ఉపాధిని కాలరాసేవిధంగా గ్రామీణ భారతదేశానికి వెన్నెముకలాంటి జీవన భద్రతను కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్ళే విబి–గ్రామ్–జి చట్టంతో భర్తీచేసి మహాత్మాగాంధీ జాతీయ తరువాయి 2లో

### కేంద్రం చెయ్యిచ్చింది



తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడే ప్రయత్నం చేస్తుంటే సహకారం అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యానికీ అనుగుణంగా 2047 నాటికి త్రీ మిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రోత్సాహం అందించాల్సిన కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం తగదు.

– డిప్యూటీ సిఎం భట్టి

### హామీలకు కేటాయింపులేవీ?



కేంద్ర బడ్జెట్ తెలంగాణను వంచించింది రాష్ట్రం ఏర్పడి 12ఏళ్లు అవుతున్నా ఏ ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా లేదు

– కూనంనేని సాంబశివరావు

### సమాఖ్య స్ఫూర్తికి దెబ్బ



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక డొల్ల. ఏ ఒక్క వర్గాన్నీ సంతృప్తిపరచలేదు.

– పల్లా వెంకట్‌రెడ్డి

### వివక్షపూరిత వైఖరి



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయీ, ఒక్క ప్రాజెక్టును కూడా కేటాయించలేదు. తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీల అమలు విషయంలో కేంద్రం వివక్షపూరిత వైఖరిని కొనసాగిస్తోంది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం పక్షాన కనీసం వారు గొంతెత్తి అడుగలేదు.

– కె.టి.రామారావు

### మార్పు తీసుకొచ్చేలా



ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్. ఆర్థిక బలం నుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణయాత్రకు ఈ బడ్జెట్ పునాది వేస్తోంది. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా కీలక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, ప్రజల కొనుగోలు శక్తి వృద్ధికి బలమైన పునాది.

– ఎన్.రాంచందర్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసు

## కెసిఆర్ వాంగ్మూలం రికార్డు

ఐదు గంటలపాటు విచారించిన సిట్ అధికారులు

నందినగర్‌లోని మాజీ సిఎం ఇంటివద్ద నాలుగంచెల భద్రత



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును నందినగర్‌లోని తన ఇంట్లో సిట్ అధికారులు విచారించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 8 గంటలకు వరకు కొనసాగింది. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ పోలీసు కమిషనర్ విజయ్ కుమార్, అదనపు డిసిపి కె ఎస్ రావ్, గ్రేహౌండ్స్ ఎస్‌పి రవీందర్ రెడ్డి, మహేశ్వరం డిసిపి నారాయణ రెడ్డి, ఎసిపిలు వెంకటగిరి, శ్రీధర్‌లతో కూడిన సిట్ దర్యాప్తు బృందం కెసిఆర్‌ను తరువాయి 2లో

## ప్రపంచ వ్యాప్తంగా 'యువాన్' వాడకాన్ని విస్తరిద్దాం: జిన్‌పింగ్



**బీజింగ్:** అమెరికా డాలరును సవాలు చేసి చైనా యువాన్‌ను అన్ని దేశాలలో ఒక రిజర్వ్‌గా ఉంచుకునేస్థాయికి తీసుకువెళ్ళేవిధంగా కరెన్సీని బలోపేతం చేయాలని ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ సైద్ధాంతిక పత్రిక 'క్విషి'లో ఈ మేరకు జిన్‌పింగ్ ఒక వ్యాసం రాశారు. ఐతే ఈ వ్యాసంలో ఆయన 'డాలరు' అనే పదాన్ని ప్రత్యక్షంగా ఉపయోగించలేదు. అంతర్జాతీయ వాణిజ్యంలో యువాన్‌ను విస్తారంగా వాడుకలోకి తీసుకువచ్చేవిధంగా చైనా కరెన్సీని బలోపేతం చేయాలన్నారు. యువాన్‌ను ప్రపంచ వ్యాప్త కరెన్సీగా విస్తృతం చేయాలని ఆయన గట్టిగా ఆకాంక్షించారు. బ్యాంకింగ్ ఆస్తుల్లో, విదేశీ మారక నిల్వల్లో, పెట్టుబడి మార్కెట్ పరిమాణంలో యువాన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చలామణీలో ఉంది. 'యువాన్ ప్రపంచంలోనే చాలా పెద్దగా ఉంది కానీ, ఇంకా చాలా బలంగా ఉండాల్సిన అవసరం ఉంది, ఆ స్థాయిలో యువాన్‌ను పటిష్ఠం చేద్దాం' అని జిన్‌పింగ్ రాశారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా ప్రస్తుతం నెలకున్న అంతర్జాతీయ గందరగోళ పరిస్థితుల్లో ఆర్థిక స్థిరీకరణ కేంద్రంగా కాంతులీనుతూ ఉండటంతో అనేక దేశాలు ఇప్పుడు చైనాతో వాణిజ్యం చేసేందుకు, సంబంధాలు అభివృద్ధి చేసుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో జిన్‌పింగ్ ఈ వ్యాసం రాశారు. అమెరికా తర్వాత చైనా యువాన్‌నే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అమెరికా డాలరుకు ఇటీవల ప్రాధాన్యత తగ్గింది. నివేదికలు ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి. గత ఏడాది 6.2 ట్రిలియన్ డాలర్ల విదేశీ వాణిజ్యంలో మూడోవంతు స్థానిక కరెన్సీలో వ్యాపారం చేసింది. అందువల్ల బలమైన కరెన్సీని నిర్మించుకోవాల్సిన అవసరం చైనాకు ఉందని ఈ వ్యాసంలో జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.

### ఉరుగ్వే అధ్యక్షుడు చైనా పర్యటన

బీజింగ్: చైనాలో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడంకోసం ఉరుగ్వే అధ్యక్షుడు యమండు ఓర్సి ఏడు రోజులు పర్యటన నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం బీజింగ్‌కు చేరుకున్నారు. ఇటీవలికాలంలో ప్రపంచ నాయకులు చైనాతో వాణిజ్య సంబంధాలను పటిష్ఠం చేసుకోవడానికి ఉవ్విళ్ళూరుతూ ఆ దేశంలో పర్యటనకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ఫ్రాన్స్,ఫిన్లాండ్,బ్రిటన్, కెనడా దేశాల నాయకులు చైనాలో ఇటీవల పర్యటనలు ముగించారు. తాజాగా ఓరియంటల్ రిపబ్లిక్ ఆఫ్ ఉరుగ్వే అధ్యక్షుడి పర్యటనతో రెండు దేశాలమధ్యా సమగ్రసహకారానికి వీలు కలుగుతుందని నిపుణులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఉరుగ్వే అధ్యక్షుడు యమండు చైనా పర్యటన ఇదే మొదటిసారి.

## ఇరాన్‌పై దాడి చేస్తే ప్రాంతీయ యుద్ధమే

అమెరికాకు ఖమేనీ ప్రత్యక్ష హెచ్చరిక

హోర్ముజ్ జలసంధి వద్ద ఐఆర్‌జిసి విన్యాసాలు



**టెహ్రాన్:** అమెరికా గనుక ఇరాన్‌పై దాడి చేస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని ఆ దేశ సర్వోన్నత నాయకుడు అయెతొల్లా అలీ ఖమేనీ హెచ్చరిక చేశారు. ఇరాన్‌లో 18 రోజులపాటు జరిగిన ప్రజాందోళనను ఒక కుట్రగా పేర్కొన్నారు. అణు చర్చలకు రావాలని ఇరాన్‌ను తొందరపెడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరేబియా సముద్రంలో ఇప్పటికే అబ్రహాం లింకన్‌సహా విమానవాహక యుద్ధనౌకలను మోహరించడంతో ప్రాంతీయంగా ఉన్న పలుదేశాలు ఇరాన్‌కు మద్దతు తెలియజేశాయి. తమ భూభాగాలను, గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని కూడా ప్రకటించాయి. ఇరాన్‌లో అనేక వారాలపాటు అంతర్గత సంక్షోభం తర్వాత దేశంలో స్థిరత్వం ఏర్పడిందనే సంకేతాలు పంపించేందుకు చాలా రోజుల తర్వాత ఖమేనీ మొదటిసారి బాహ్య ప్రపంచానికి కనిపించారు. ఆ దృశ్యాలను ఇరాన్ పత్రికలు ప్రచురించాయి. ఇస్లామిక్ విప్లవం సాధించి 47 సంవత్సరాలైన సందర్భంగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ వ్యవస్థాపకుడు రుహొల్లా ఖమేనీ సమాధి వద్ద ఖమేనీ ప్రార్థనలు చేసిన దృశ్యాలను మీడియా ప్రచురించింది. 'ఇరాన్‌పై దాడి చేయమని పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే తాము ముందుగా ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం, పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా సైనిక ఆస్తులు, స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడతాం' అని ఖమేనీ పేర్కొన్నారు.
'అమెరికా తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఈసారి అమెరికా యుద్ధం ప్రారంభిస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని అమెరికన్లకు బాగా తెలుసు' అన్నారు. 86 ఏళ్ళ వయసుగల వృద్ధనేత ఖమేనీ ఇలా చాలా అరుదైన హెచ్చరిక చేశారు. ఈ పరిస్థితులమధ్య ఇరాన్ కూడా 'హోర్ముజ్ జలసంధి' వద్ద ఆది, సోమవారాలలో ఐఆర్‌జిసి (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్) ప్రత్యక్ష సైనిక, కాల్పుల విన్యాసాలు చేస్తాయని ప్రకటించింది. అమెరికా కూడా హెచ్చరిక చేస్తూ తమ దళాలకు సమీపంలో ఎలాంటి అరక్షిత చర్యలకు పాల్పడవద్దని, ఒక వేళ ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా వాణిజ్య నౌకలు సమస్యలకు గురవుతాయని పేర్కొంది. తమ సైనిక విన్యాసాలవల్ల సాధారణ నౌకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని కూడా తెలియజేసింది. ప్రదర్శకులను ఇకపై చంపినా, అరెస్టుచేసినవారిని ఉరితీసినా దాడులు తప్పవని ట్రంప్ ఇరాన్‌కు స్పష్టం చేశారు. ఇరాన్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారని అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానం చెప్పడానికి నిరాకరించారు.
ఈ హోర్ముజ్ జలసంధి 33 కి.మీ వెడల్పు మాత్రమే ఉంటుంది. పర్షియన్ గల్ఫ్ నుండి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకూ ఇది విస్తరించి ఉంటుంది. వందల సంవత్సరాలుగా చారిత్రకంగా ఈ హోర్ముజ్ జలసంధికివాణిజ్య కార్యకలాపాలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎన్నో ముఖ్యమైన సరుకులను నౌకలు ఈ జలసంధి ద్వారా మోసుకుని వెళుతూ ఉంటాయి. ఇది తప్ప ఈ ప్రాంతంలో నౌకల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. ఈ జలసంధిని మూసివేస్తే వాణిజ్య కార్యకలాపాలలో కల్లోలం రేగుతుంది. దీంతో ఈ ప్రాంతంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ విన్యాసాలపై అమెరికా ఆదివారం ఉదయం ఒక హెచ్చరిక చేసింది. బహ్రైన్ కేంద్రంగా పనిచేస్తున్న 'అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్' ప్రకటన చేస్తూ, ఈ ప్రాంతంలో ఎలాంటి అరక్షిత కార్యకలాపాలను సహించేది లేదని స్పష్టం చేసింది.

### చర్చలపై చిత్తశుద్ధి చూపించిన ఇరాన్

అరేబియా సముద్రంలో తమ సైన్యాన్ని మోహరించిన తర్వాత ఇరాన్ చర్చలపై చిత్తశుద్ధితో స్పందిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఇరాన్ చిత్తశుద్ధితో తమ దేశంలో మాట్లాడుతోందని, చర్చలకు అంగీకరించిందన్నారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి క్రిందటిరోజు ఒక ప్రకటన చేస్తూ, 'న్యాయబద్ధమైన చర్చలకు' తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇరాన్ అగ్రశ్రేణి భద్రతాధికారి అలీ లారిజాని ఎక్స్‌వేదికగా శనివారం రాత్రి స్పందిస్తూ, అమెరికా–ఇరాన్ మధ్య సంప్రదింపులకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌ను ఉగ్రవాదసంస్థగా యూరప్ ప్రకటించడంతో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ కూడా దీటుగా స్పందించారు. యూరోపియన్ యూనియన్‌లోని సైన్యాలను కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఇకమీదట ఉగ్రవాద గ్రూపులుగానే పరిగణిస్తుందని ప్రకటించారు.

## ప్రకంపనలు సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్

స్లొవేకియాలో అత్యున్నతాధికారి రాజీనామా



**వాషింగ్టన్:** అమెరికా న్యాయవిభాగం కొత్తగా విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. స్లొవేకియాలో ప్రధానమంత్రికి జాతీయ భద్రతా సలహాదారుడైన మిరోస్లావ్ లాజ్‌కాక్ రాజీనామా చేశారు. ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో రాజీనామాను ఆమోదించి ఈ విషయాన్ని ధృవీకరించారు. లాజ్‌కాక్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి ఏడాదిపాటు అధ్యక్షుడుగా కూడా పనిచేశారు. అదేవిధంగా ఈ ఫైల్స్‌లో భాగస్వామిగా ఉన్న, దీర్ఘకాలంగా జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు స్నేహితుడుగా ఉన్న ఆండ్రూ మౌంట్ బాటన్–విండ్సార్ (ప్రిన్స్ ఆండ్రూ)కు బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ కూడా ఒక విజ్ఞప్తి చేశారు. ఈ పత్రాల గురించి, తెరవెనుక రహస్యాలు ఏమైనా ఉంటే బహిర్గతం చేసి దర్యాప్తు అధికారులకు సహకరించాలని కీర్ స్టార్‌మర్ కోరారు. మౌంట్‌బాటన్–విండ్సార్ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దాదాపు 700 సార్లు కనిపించింది. 'మీకోసం నా దగ్గర ఒక స్నేహితురాలు సిద్ధంగా ఉంది, ఆమె విశ్వాసపాత్రురాలు, అందమైనది,తెలివైనది' అని ఎప్‌స్టీన్ ఆయనకు ఈమెయిల్ పంపాడు. అందుకు ఆయన స్పదించాడు కూడా. రెండు దశాబ్దాలుగా ఎప్‌స్టీన్ కేసులో దర్యాప్తు జరుగుతోంది. 2006లో ఎఫ్‌బిఐ ఈ కేసు విచారణ ప్రారంభించింది. ఈ దర్యాప్తులో భాగంగా అమెరికా ప్రభుత్వం లక్షల రహస్య పత్రాలు, వీడియోలు, ఫొటోలను స్వాధీనం చేసుకుంది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయని ఆరోపణలకు గురవుతున్న డోనాల్డ్ ట్రంప్ దీనిపై స్పందిస్తూ ఈ పత్రాల విడుదల తన దోష నివారణకు, నిర్దోషిత్వానికి చిహ్నమని అన్నారు. ఈ పత్రాలను విడుదల చేయాలని ట్రంప్ గతంలోనే ఆదేశాలు ఇచ్చారు. ఆయన విధించిన ఆరు వారాల గడువు దాటిన తర్వాత జనవరి 31వ తేదీన ఈ రహస్యపత్రాలను అమెరికా జస్టిస్ విభాగం బహిర్గతం చేసింది.
అనేకమంది ప్రముఖుల జాతకాలను తన గుప్పెట్లో పెట్టుకుని ఆడించి చివరకు జైలులో మరణించిన ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్యంగా దాచిపెట్టిన 30,00,000 పత్రాలు, 1,80,000 ఫొటోలు, 2,000 వీడియోలు శనివారం బాహాటంగా న్యాయవిభాగం వెబ్‌సైటులో పోస్టు చేసింది. ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ రష్యా భామలతో లైంగిక కార్యకలాపాలు నిర్వహించాడని, ఈ కారణంగా ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ తన పత్రాలలో ఆరోపించాడు. ఆరోపణలను బిల్‌గేట్స్ కొట్టిపారేశారు. డోనాల్డ్ ట్రంప్ పేరు అనేక వందలసార్లు ప్రస్తావనకు వచ్చింది. ఇందులో చాలా ఈ–మెయిల్స్, పత్రాలన్నీ పది సంవత్సరాల క్రితం నాటివి. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఎంతకాలం జైలులో ఉన్నాడు? అతడి మానసిక పరిస్థితి ఏమిటి? అతడి మరణం, అందుకు దారితీసిన పరిస్థితులు వంటి నివేదికలను కూడా వీటితోపాటు కలిపే విడుదల చేశారు. 14 ఏళ్ళ మైనరు బాలికతో లైంగిక అనుభవాన్ని కోరుకున్నాడన్న ఆరోపణపై అరెస్టుకు గురయ్యాడు. తర్వాత అతడి జాతకం మొత్తం బయటకు వచ్చింది. అనేక మంది పెద్దలతో సంబంధాలు పెట్టుకుని వారి అవసరాలకోసం మహిళలను సరఫరా చేసి ఆ చర్యలను వీడియోలు, ఫొటోలు తీసి ఎప్‌స్టీన్ ఆ జాతకాలను తనవద్ద సాక్ష్యాలుగా దాచిపెట్టుకున్నాడు. ఒబామా అధ్యక్షుడుగా ఉండగా 2018 మార్చిలో వైట్‌హౌస్ జనరల కౌన్సిల్ కథీ రుయెమ్మెర్‌కు కూడా ఎప్‌స్టీన్ నుండి ఆహ్వానం అందింది.

## రాజకీయ ఖైదీలకు వెనిజులా క్షమాభిక్ష

పార్లమెంటులో తక్షణ బిల్లు

**కారకస్:** వెనిజులా జైళ్ళలో ఉన్న రాజకీయ ఖైదీలకు తాత్కాలిక ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించేందుకు రంగం సిద్ధం చేసింది. దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్యూజ్ ఒక ప్రకటన చేస్తూ, రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష నిమిత్తం తక్షణ ప్రాతిపదికపై ఒక బిల్లును దేశ పార్లమెంటులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. దాదాపు 711 మంది జైళ్ళలో ఉన్నట్లు ఫోరో ప్యానల్ హక్కుల గ్రూపు అంచనావేసింది. హత్యలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినవారు మాత్రం విడుదలకు అర్హులు కాదని డెల్సీ ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికే జనవరి 8వ తేదీన 302 మందిని విడుదల చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందితే అనేకమంది ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, మానవహక్కుల సంఘాల కార్యకర్తలు జైళ్ళ నుండి విముక్తులవుతారు. ఈ బిల్లును ఆమోదించడంవల్ల రాజకీయపరమైన వివాదాలను, సంబంధిత గాయాలను మాన్పేందుకు అవకాశం కలుగుతుందని డెల్సీ అన్నారు. ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ బహుమతి గ్రహీత మరియా కొరినా మచాడో ఒక ప్రకటన చేస్తూ, అమెరికా ప్రభుత్వం చేసిన ఒత్తిడి కారణంగానే అధ్యక్షురాలు డెల్సీ ఈ నిర్ణయం తీసుకున్నారుతప్ప, ఆమె స్వచ్ఛంధంగా ఈ నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు.

## ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ పదవికి కెవిన్ వార్ష్

**వాషింగ్టన్:** అమెరికా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా కెవిన్ వార్ష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఆయన బోర్డు సభ్యుడుగా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయన ఎంపికను ఖరారు చేశారు. తర్వాత కెవిన్ వార్ష్ మాట్లాడుతూ ఇప్పటివరకూ ఫెడరల్ రిజర్వు అనుసరించిన విధానాలను దుయ్యబట్టారు. ట్రంప్ కోరుకున్న విధంగా గణనీయంగావడ్డీరేట్లను తగ్గిస్తామన్నారు. ప్రస్తుతం ఫెడరల్ రిజర్వ్ గవర్నర్‌గా ఉన్న జెరోమ్ పావెల్‌తో ట్రంప్‌కు విభేదాలు వచ్చాయి. వడ్డీరేట్లు గణనీయంగా తగ్గించేందుకు పావెల్ తిరస్కరించడంతో ఆయన ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. ఆయనను తొలగించేందుకు ట్రంప్ చేసిన యత్నాలు విఫలమయ్యాయి. రిజర్వు బ్యాంకు గవర్నర్‌ను తొలగించే అధికారి ట్రంప్‌కు లేకపోవడంతో ఆయన నిస్సహాయంగా ఉండిపోయారు. అప్పటినుండీ మరో గవర్నర్ కోసం ట్రంప్ తీవ్ర అన్వేషణ ప్రారంభించారు. ఐతే రిజర్వుబ్యాంకు స్వతంత్ర పని విధానంలో జోక్యం చేసుకోవడం అసంబద్ధమైన చర్య అంటూ జెరోమ్ పావెల్ అసాధారణ రీతిలో ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. అమెరికాలో ఎంతో ప్రజాదరణ పొందిన ఉన్నతాధికారిగా పావెల్ పేరు పొందారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన ఓటింగ్‌లో 70శాతం ప్రజలు జెరోమ్ పావెల్‌ను పదవి నుండి తొలగించే అధికారం లేదని ప్రజలు పేర్కొంటూ ట్రంప్‌తో విభేదించారు.

## వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ ప్రశంసించారు. వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ముఖ్యంగా డెయిరీ రంగం, ఫిషరీస్‌కు అధిక ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. వీటితో పాటు కొబ్బరి, ఎర్రచందనం రైతుల కోసం అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇంకా ఈ బడ్జెట్‌లో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాల పర్యాటకంపై దృష్టి పెట్టామని అన్నారు.

## గుడ్డి బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడం విడ్డూరం' అని అన్నారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలపై ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'దేశంలో అసమానతలు బ్రిటిష్ పరిపాలన కాలం నాటి కంటే దారుణంగా పెరిగిపోయాయి. అయినా సరే ఈ బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీ వర్గాలకు, పేదలకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. వారి గురించి కనీసం ప్రస్తావన కూడా లేదు' అని అన్నారు. ఆర్థిక వ్యవస్థ ఇంజిన్‌గా భావించే తయారీ రంగంపై ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు. 'తయారీ రంగం పునరుద్ధరణకు ఎలాంటి వ్యూహం లేదు. అది ఇంకా 13 శాతానికే పరిమితమైపోయింది. అసలు మీ 'మేక్ ఇన్ ఇండియా' ఏమైంది? ఎక్కడ దాక్కుంది?' అని నిలదీశారు. 'యువతకు ఉపాధి కల్పించేందుకు సీరియస్ ప్లాన్ లేదు. మహిళల భాగస్వామ్యం పెంచే చర్యలు లేవు. పాత స్కిల్ డెవలప్‌మెంట్ పథకాల ఫలితాలేంటో చెప్పలేదు. ఎగుమతులు మందగించాయి. వాణిజ్య లోటు పెరిగింది. రూపాయి విలువ పతనమవుతోంది. వీటిని అడ్డుకోవడానికి మీ దగ్గర ప్లాన్ ఉందా?' అని ప్రశ్నించారు.

## కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశకలిగించింది

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్2026పై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాజా బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నిరాశ కలిగించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో అభివృద్ధి, ఇతర ప్రాజెక్టులకు ఊతమివ్వాల్సిన బడ్జెట్‌లో అలాంటి స్పష్టమైన దిశ కనిపించలేదని జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. రాష్ట్రాల అవసరాలను పట్టించుకోకుండా రూపొందించిన ఈ బడ్జెట్ ప్రజల ఆశలకు విరుద్ధంగా ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీపై మౌనం, యువతకు ఉపాధి కల్పనపై స్పష్టత లేకపోవడం, పేదలకు సంక్షేమ పథకాలపై నిధుల కోత ఈ బడ్జెట్ ప్రధాన లోపాలని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ కట్టడాలు అద్భుత పర్యాటక సంపద ఉంది. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చాలన్న మా సంకల్పానికి కేంద్రం నుంచి మద్దతు లభించలేదని పెదవి విరిచారు. ఈ బడ్జెట్‌లో ఎలాంటి సారం లేదనడానికి బడ్జెట్ అనంతరం మార్కెట్లలో కనిపించిన పతనమే నిదర్శనమని మంత్రి తెలిపారు.

## సామాన్యులకు దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి)

రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు. కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం ఇచ్చిన నిర్మలమ్మ, గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు. అలాగే, వ్యవహాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు చేశారు. వ్యయానికి సంబంధించి, రెవెన్యూ వ్యయం రూ.41,25,494 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో వడ్డీ చెల్లింపులకే రూ.14,03,972 కోట్లు వెళ్లనున్నట్లు వివరించారు. మూల ధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా ప్రతిపాదించారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.4 శాతంగా అంచనా వేసిన ఆర్థికమంత్రి వచ్చే ఏడాది 0.1 శాతం తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇక రాబడులకు సంబంధించి ప్రతి రూపాయిలో రుణాలు ద్వారానే అత్యధికంగా 24 పైసలు సేకరించనున్నట్లు తెలిపారు. ఆదాయ పన్ను ద్వారా 21 పైసలు, కార్పొరేట్ పన్నుల ద్వారా 18 పైసలు, జీఎస్టీ, ఇతర పన్నుల ద్వారా 15 పైసలు, పన్నేతర ఆదాయం 10 పైసలు, కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా 6 పైసలు, కస్టమ్స్ సుంకాల ద్వారా 4 పైసలు, రుణేతర మూల ధన రాబడుల ద్వారా 2 పైసలు వస్తాయని అంచనా వేశారు.

## సౌమ్యకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

గంజాయి స్మగ్లర్లు కారుతో గుద్దడంతో తీవ్ర గాయాలు

ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచిన సౌమ్య

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిజామాబాద్ జిల్లాలో విధినిర్వహణలో ఉన్న ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్య గంజాయి స్మగ్లర్లను అడ్డుకునే ప్రయత్నంలో కారుతో గుద్దడంతో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాదకర సంఘటన ఇది. డ్యూటీ నిర్వాహనలో విరోచితంగా వ్యవహరించిన సౌమ్య మృతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాజుల సౌమ్య (23) భౌతిక కాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ధైర్యసాహసాలను కొనియాడిన సిఎం, ఈ మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. నిజామాబాద్ జిల్లా మోస్రా మండలానికి చెందిన సౌమ్య, జనవరి 23న మాధవనగర్ వద్ద గంజాయి తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నంలో స్మగ్లర్ల కారు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఎనిమిది రోజుల పాటు హైదరాబాద్లోని నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె శనివారం రాత్రి 9:41 గంటలకు తుదిశ్వాస విడిచారు. కేవలం 2024 బ్యాచ్కు చెందిన యువ కానిస్టేబుల్ అయిన సౌమ్య మృతితో ఎక్సైజ్ శాఖలో విషాదం నెలకొంది. స్మగ్లర్ల దౌర్జన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులను వదిలిపెట్టవద్దని పోలీసు ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

### నివాళులర్పించిన మంత్రి జూపల్లి

విధి నిర్వహణలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఘన నివాళులర్పించారు. సికింద్రాబాద్లోని గాంధీ ఆసుపత్రిలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన మంత్రి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్య లేని లోటు భర్తీ చేయలేనిదని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సౌమ్య కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అలాగే, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, సౌమ్య సర్వీస్ కాలం అంటే ఆమె రిటైర్మెంట్ వయసు వరకు వేతనం చెల్లిస్తామని వెల్లడించారు. విధి నిర్వహణలో సౌమ్య చూపిన నిబద్ధత, తెగువ స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. తమ సహచరిని కోల్పోయిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది ఒక్క రోజు వేతనాన్ని ఆమె కుటుంబానికి అందజేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఎక్సైజ్ శాఖ సిబ్బంది భద్రత ప్రభుత్వ కర్తవ్యమని పేర్కొంటూ, భవిష్యత్తో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. శాఖ అధికారుల జోలికి వచ్చే దుండగుల పై వెన్ను వణికించేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆయుధాల కేటాయింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గంజాయి సహా మాదకద్రవ్యాల ముఠాలపై మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని చెప్పారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి రెండు నిమిషాల మౌనం పాటించి సౌమ్యకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషీ, శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.సౌమ్య మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె ధైర్య సాహసాలను ఆయన కొనియాడారు.

## కెసిఆర్ వాంగ్మూలం రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

విచారించింది. సిట్ అధికారులు తమ వద్ద ఉన్న టెక్నికల్ ఎవిడెన్స్, నిందితులు, సాక్షులు, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారాలను కెసిఆర్ ముందు పెట్టి ప్రశ్నించినట్టు సమాచారం.2023 ఎన్నికల్లో ప్రభుత్వం మారిన వెంటనే ఎస్ఐబి కార్యాలయంలో ఉన్న ఫోన్ రికార్డులను ధ్వంసం చేయమని ఎవరు ఆదేశించారు అని కెసిఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఎస్ఐబి చీఫ్ గా ప్రభాకర్ రావును నియమించడంలో ఉద్దేశం ఏంటని ప్రశ్నించినట్టు తెలుస్తుంది. 2023 ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్ల టాపింగ్ గురైన విషయంపై కూడా ఆయన్ని ప్రశ్నించినట్టు తెలుస్తుంది. ప్రభాకర్‌రావు, రాధాకిషన్ రావు వాంగ్మూలాల ఆధారంగా కెసిఆర్‌పై పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం.ఈ కేసులో మొదటి నిందితుడైన మాజీ ఎస్ఐబి చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఐజి స్థాయిలో 2020 జూన్‌లో రిటైర్మెంట్ అయ్యాడు. అయితే అతనికి మళ్లీ విధుల్లో తీసుకోవడానికి కారణాలు, తిరిగి ఎస్ఐబిలో పోస్టింగ్ ఇవ్వడంపై దురుద్దేశాలను తెలుసుకునే క్రమంలో కెసిఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది.ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావుకు ఎగ్జిలరీ ప్రమోషన్ ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది అనే విషయంపై కూడా సిట్ విచారణ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.ఎస్ఐబి రికార్డు చేసిన ఫోన్ రికార్డులను మీకు ఎవరైనా చేరవేశారా, ఏ ఫోన్‌తో ఏ ఫోన్‌కు పంపించేవారు అని వివరాలపై కూడా సిట్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.న్యాయవాదులకు అనుమతి లేదని సిట్ అధికారులు స్పష్టం చేశారు.ఐదు గంటల పాటు సాగిన కెసిఆర్ వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. విచారణ మొత్తం వీడియోగ్రఫీ చేశారు. విచారణతో సంతృప్తి చెందకపోతే మరోసారి నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉంది.ముందు జాగ్రత్త చర్యలగా విచారణ సందర్భంగా నందినగర్‌లో పోలీసులు నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎస్ఐబి అదనపు ఎస్‌పి డి.రమేష్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసులు మార్చి 10, 2024న 243/2024 నెంబర్‌తో ఎఫ్ఐఆర్ చేశారు.ఈ కేసులో ఎస్ఐబి డిఎస్‌పి డి.ప్రణీత్‌రావు, అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకృష్ణరావులను అరెస్టు చేయగా వారు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. ఇక ఈ కేసులో మొదటి ముద్దాయి అయిన ప్రభాకర్‌రావు పంజగుట్టలో కేసు నమోదైన విషయం తెలిసిన వారం రోజుల్లోనే అమెరికాకు వెళ్లిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు ఏడాది తరువాత తిరిగి వచ్చారు. ప్రస్తుతం అతని అరెస్టుకు సంబంధించిన విషయం సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. నకిరేకల్ మాజీ ఎంఎల్‌ఎ చిరుమర్తి లింగయ్య, కల్వకుర్తి మాజీ ఎంఎల్‌ఎ గుర్కా జైపాల్ యాదవ్, మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్, ఎంపి సంతోష్‌రావులను విచారించిన విషయం తెలిసిందే.


## ప్రజావిరుద్ధంగా ప్రాధాన్యతలు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ ఉపాధ హామీ పథకాన్ని విచ్ఛిన్నం చేయడాన్ని గడచిన ఆర్థిక సంవత్సరంలో చూశాం, పట్టణ భారతదేశంలో డిమాండ్ ఉన్నప్పటికీ అర్థవంతమైన పన్నుల ఉపశమనాలను కార్మికులకు, మధ్యతరగతికి ఇవ్వకుండా కాలరాసింద. వ్యవసాయరంగంలో సంక్షోభం మరింత లోతుగా పెరిగింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత ఇవ్వలేదు, వ్యవసాయ ఆదాయాలను స్థిరీకరించే ఏకైక ముఖ్యమైన విధానం ఇదే. పదే పదే హామీలు ఇచ్చినప్పటికీ కనీస మద్దతు ధరలను పట్టించుకోలేదు. నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా వివిధ రంగాలకు చెందిన కార్మికులు వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ లేబర్‌కోడ్స్ వల్ల కార్మికులు యాజమాన్యాలతో న్యాబద్ధమైన వేతనాలకోసం ఉమ్మడిగా బేరసారాలు చేయడానికి అవకాశం లేకుండా చేశబూరు. సామాజిక భద్రత, ఉద్యోగ రక్షణ గురించి అడగడానికివీల్లేకుండా చేశారు. అదేసమయంలో విద్య,వైద్య రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది, ఈ రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు స్తంభించాయి. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణపైనే ప్రభుత్వం పూర్తిగా దృష్టి కేంద్రీకరించింది, పేదలను, వెనుకబడిన వర్గాలను విస్మరించింది. ఇక తయారీ రంగంలో మాత్రమే దేశంలో భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు ప్రజలకు కొనసాగుతున్నాయి. ఈ రంగంలో కూడా వృద్ధి సంతృప్తికరంగా లేదు. తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభం ఏర్పడింది. ఆర్థిక మంత్రి కృత్రిమ మేధ నిబంధనలు ప్రకటించారు. దాని గురించి తన ప్రసంగంలో పదకొండుసార్లు ప్రస్తావించారు. కానీ ఎ ఐ విషయంలో ఒక నిర్మాణాత్మకమైన విధానాన్ని, పెట్టుబడులు, వ్యవస్థాగతమైన సామర్థ్యాన్ని నిర్మించడం గురించి చెప్పలేదు. బిజెపి ప్రభుత్వ నాయకత్వంలో ఎఐ ఒక పాలనాపరమైన జడత్వంగా మారింది, ఈ ప్రభుత్వానికి దిశానిర్దేశం లేదనడానికి ఒక చిహ్నంగా మారింది, నినాదాలు ఇవ్వడానికి ఉపయోగపడే పదాలుగా మారాయి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది.

**జీవనోపాధిని నిర్లక్ష్యం చేసిన కేంద్ర బడ్జెట్ : సందోష్ కుమార్**

కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజల జీవనోపాధిని నిర్లక్ష్యం చేసిందని, సమాఖ్య హక్కులను చిన్నచూపు చూసిందని రాజ్యసభలో సిపిఐ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ విమర్శించారు. అధికారాన్ని,వనరులను కొద్ది మంది చేతుల్లో ఉంచుతూ సామాన్య ప్రజల కష్టాలను ఎంతమాత్రం పట్టించుకోని ఆర్థికమంత్రి ప్రసంగం రాజకీయ అవసరాలను బహిర్గతం చేసిందని విమర్శించారు. నిజ ఆదాయాలు క్షీణించిపోయి సాధారణ పౌరులు జీవన పోరాటం చేస్తున్న తరుణంలో ప్రకటించిన ఈ బడ్జెట్ దేశంలో గిరాకీని, కొనుగోళ్ళను, వ్యాపారాల విస్తృతిని పెంచేందుకు చిత్తశుద్ధితో ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ ప్రజలకు వ్యతిరేకంగా ఉందని సిపిఐ ఉద్ఘాటిస్తోందని పేర్కొన్నారు. బిజెపి రాజకీయ ఎజెండాతో అంటకాగేందుకు తిరస్కరించిన కేరళ వంటి రాష్ట్రాలపట్ల బహిరంగంగా వివక్ష చూపించారని విమర్శించారు. పార్లమెంటు వెలుపలా, లోపలా కూడా తమ పార్టీ ఈ వివక్షను, ప్రజావ్యతిరేక సమస్యలను ప్రస్తావించి ప్రజలను చైతన్యం చేస్తూనే ఉంటుందని, సామాజిక న్యాయం, సమాఖ్య హక్కులు, ప్రజల జీవనోపాధి వంటి విషయాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడుతుందని సందోష్ కుమార్ పేర్కొన్నారు.




# చేనేత రంగానికి చేయూత

## మహాత్మాగాంధీ గ్రామ్ స్వరాజ్ పథకం



కేంద్ర బడ్జెట్‌లో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక ప్రకటనలు చేశారు. ప్రత్యేకించి టెక్స్‌టైల్స్, చేనేత, హస్తకళలు, ఖాదీ రంగాలకు శుభవార్తలు వినిపించారు. టెక్స్‌టైల్స్ రంగానికి ప్రభుత్వం తరఫున సాంకేతిక విలువను జోడించే లక్ష్యంతో మెగా టెక్స్‌టైల్ పార్క్‌లను ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. వీటివల్ల వస్త్రాల ఉత్పత్తి పెరగడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఖాదీ వస్త్రాల ఉత్పత్తిని పెంచేందుకు, వాటికి అంతర్జాతీయ మార్కెట్‌ను సృష్టించేందుకు మహాత్మాగాంధీ గ్రామ్ స్వరాజ్ కార్యక్రమాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. భారతదేశ వస్త్ర పరిశ్రమను బలోపేతం చేసేందుకు 5 పథకాలను నిర్మల ప్రకటించారు. నేషనల్ ఫైబర్ స్కీమ్, మ్యాన్ మేడ్ అండ్ న్యూ ఏజ్ ఫైబర్స్ స్కీమ్, నేషనల్ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫట్స్ ప్రోగ్రాం, టెక్స్ ఎకో ఇనీషియేటివ్, సమర్థ్ 2.0 ఫర్ మోడర్నైజ్డ్ స్కిల్లింగ్ అనే ఐదు పథకాలతో వస్త్ర పరిశ్రమను పురోగతి బాటలోకి తీసుకెళ్తామన్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు ఉపాధి అవకాశాల కోసం టెక్స్‌టైల్స్ పరిశ్రమపై ఆధారపడి ఉన్నందున ప్రస్తుత మార్కెట్ అవసరాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దాన్ని తీర్చిదిద్దుతామని ఆర్థికమంత్రి చెప్పారు. అన్ని విషయాల్లో ప్రపంచ మార్కెట్‌తో పోటీపడే స్థాయికి భారత వస్త్ర పరిశ్రమను తీసుకెళ్తామన్నారు. టెక్స్‌టైల్స్ పరిశ్రమకు ఖ్యాతి గడించిన దేశంలోని 200 పారిశ్రామిక క్లస్టర్ల పునరుద్ధరణ కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తామని నిర్మల తెలిపారు. వివిధ రంగాల్లో ఛాంపియన్స్‌గా నిలవగల స్మాల్ అండ్ మీడియా ఎంటర్‌ప్రైజెస్ (చిన్న, మధ్యతరహా వ్యాపారాలు) సృష్టి కోసం రూ.10వేల కోట్లను కేటాయిస్తామన్నారు.

# సంక్షేమం 'కోత'లే!


## 2025-26 బడ్జెట్ కేటాయింపులు గాలికి..



వివిధ సంక్షేప పథకాలకు ఘనమైన కేటాయింపులు జరిపినట్టు కేంద్రం ప్రకటించుకోవడం, అవి వాస్తవ రూపం దాల్చకపోవడం ప్రతి సంవత్సరం జరుగుతున్న ఒక తంతుగా మారింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌కు ఎలాంటి మినహాయింపు లేదు. ఇటీవలి బడ్జెట్ పత్రాలు బయటపెట్టిన వాస్తవాలు ఆందోళనకరంగా ఉన్నాయి. సామాజిక రంగానికి కేటాయించిన నిధుల విషయంలో ప్రకటించిన హామీలు, వాస్తవ ఖర్చుల మధ్య భారీ తేడా ఉందని అవి స్పష్టంగా చూపిస్తున్నాయి. ఉదాహరణకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అనేక సంక్షేమ పథకాల కోసం భారీ మొత్తాలు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ, ఆ నిధులు పూర్తిగా వినియోగించలేదన్న నిజాన్ని సవరించిన అంచనాలు వెల్లడించాయి. గ్రామీణ ప్రజల జీవితాలను మార్చే లక్ష్యంతో రూపొందించిన తాగునీటి పథకమే దీనికి ప్రధాన ఉదాహరణ. ఈ పథకానికి సుమారు రూ.67 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొనగా, వాస్తవానికి ఖర్చు రూ.17 వేల కోట్లకే పరిమితమైంది. శుద్ధమైన తాగునీరు లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు, ప్రాణనష్టాలు జరుగుతున్న పరిస్థితుల్లో ఈ తరహా ఖర్చుల లోపం తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. అలాగే గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణ పథకాల విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించిన నిధుల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు కాకుండా మిగిలిపోయాయి. పేదలు, నిరాశ్రయులకు గృహ భద్రత కల్పించాల్సిన పథకాల్లో ఈ నిర్లక్ష్యం సామాజిక అసమానతలను మరింత పెంచుతోంది. స్థూలంగా చూస్తే, ఇరవైకి పైగా సామాజిక పథకాలలో చాలా వాటికి ప్రకటించిన కేటాయింపులు వాస్తవ ఖర్చులుగా మారలేదు. కేవలం కొద్ది పథకాలలో మాత్రమే అంచనాలు, ఖర్చులు సమానంగా ఉన్నాయి. ఈ పరిస్థితి సామాజిక రంగానికి ప్రాధాన్యత తగ్గుతోందన్న ప్రతిపక్ష పార్టీల వాదనకు బలాన్నిస్తున్నది. సామాజిక సంక్షేమంపై ప్రభుత్వ ఖర్చులు మాటలకే పరిమితమై, అమలులో తగ్గిపోతే, పేదలు, బలహీన వర్గాలపై ప్రభావం అధికమవుతుంది. అందువల్ల బడ్జెట్ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా, వాస్తవ జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే ఖర్చుల అమలుపై మరింత బాధ్యత అవసరం. కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా కేంద్రం తన మాటకు, పార్లమెంటులో చేసిన ప్రకటనలకు కట్టుబడి ఉంటుందని ఆశిద్దాం.

## కేంద్ర బడ్జెట్

# రూ.53,47,315 కోట్లు







కేంద్ర బడ్జెట్
కీలక కేటాయింపులు

బడ్జెట్ అంచనాలు 2026-27 (రూ.కోట్లలో)

మొత్తం : 53,47,315

| | |
|---|---|
| వడ్డీలు | 14,03,972 |
| రవాణా | 5,98,520 |
| రక్షణ | 5,94,585 |
| సబ్సిడీలు | 4,10,495 |
| పెన్షన్ | 2,96,214 |
| గ్రామీణాభివృద్ధి | 2,73,108 |
| హోంశాఖ వ్యవహారాలు (కేంద్రపాలిత ప్రాంతాలు సహా) | 2,55,234 |
| వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలు | 1,62,671 |
| విద్య | 1,39,289 |
| విద్యుత్ | 1,09,029 |
| ఆరోగ్యం | 1,04,599 |
| పట్టణాభివృద్ధి | 85,522 |
| ఐటి మరియు టెలికాం | 74,560 |
| పరిశ్రమ మరియు వాణిజ్యం | 70,296 |
| సాంఘిక సంక్షేమం | 62,362 |
| శాస్త్రీయ విభాగాలు | 55,756 |
| పన్నుల నిర్వహణ | 45,500 |
| ఇతర వ్యవహారాలు | 22,119 |
| ఆర్థికం | 20,649 |
| ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి | 6,812 |
| ఇతరాలు | 5,56,021 |

**న్యూఢిల్లీ :** కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తంగా రూ.53,47,315 కోట్ల కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రెవెన్యూ వసూళ్లను రూ.రూ.35,33,150 కోట్లుగా అంచనా వేశారు. మూలధన వసూళ్లలో రూ.18,14,165 కోట్లుగా ఉండబోతున్నట్లు బడ్జెట్లో ప్రకటించారు.

### బడ్జెట్ సమగ్ర స్వరూపం

- రెవెన్యూ వసూళ్లు –రూ.35,33,150 కోట్లు
- పన్ను వసూళ్లు రూ.28,66,922 కోట్లు
- పన్నేతర వసూళ్లు రూ.6,66,228 కోట్లు
- మూలధన వసూళ్లు రూ.18,14,165 కోట్లు
- రుణాల రికవరీ రూ.38,397 కోట్లు
- ఇతర వసూళ్లు రూ.80,000 కోట్లు
- అప్పులు, ఇతర వసూళ్లు రూ.16,95,768 కోట్లు
- మొత్తం ఆదాయం రూ.53,47,315 కోట్లు
- మొత్తం వ్యయం రూ.53,47,315 కోట్లు
- రెవెన్యూ ఖాతా రూ.41,25,494 కోట్లు
- వడ్డీ చెల్లింపులు రూ.14,03,972 కోట్లు
- మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు రూ.4,92,702 కోట్లు
- మూలధన ఖాతా రూ.12,21,821 కోట్లు
- వాస్తవ మూలధన వ్యయం రూ.17,14,523 కోట్లు
- రెవెన్యూ లోటు రూ.5,92,344 కోట్లు
- నికర రెవెన్యూ లోటు రూ.99,642 కోట్లు
- ద్రవ్య లోటు రూ.16,95,768 కోట్లు
- ప్రాథమిక లోటు రూ.2,91,796 కోట్లు

### రంగాలవారీగా కేటాయింపులు

- రవాణా రంగం రూ.5,98,520 కోట్లు
- రక్షణ రంగం రూ.5,94,585 కోట్లు
- గ్రామీణాభివృద్ధి రంగం రూ.2,73,108 కోట్లు
- హోంశాఖ కార్యకలాపాలు – రూ.2,55,234 కోట్లు
- వ్యవసాయ అనుబంధ రంగాలు రూ.1,62,671 కోట్లు
- విద్యారంగం రూ.1,39,289 కోట్లు
- ఇంధన రంగం రూ.1,09,029 కోట్లు
- వైద్య, ఆరోగ్యం రూ.1,04,599 కోట్లు
- పట్టణాభివృద్ధి రూ.85,522 కోట్లు
- ఐటీ, టెలికాం రూ.74,560 కోట్లు
- వాణిజ్యం, పరిశ్రమలు రూ.70,296 కోట్లు
- సాంఘిక సంక్షేమం రూ.62,362 కోట్లు
- శాస్త్ర సాంకేతిక రంగాలకు రూ.55,756 కోట్లు
- పన్ను నిర్వహణ రూ.45,500 కోట్లు
- ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ రూ.22,119
- ఆర్థిక నిర్వహణ రూ.20,649 కోట్లు
- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి రూ.6,812 కోట్లు

# 'బయో ఫార్మా శక్తి' పథకం



దేశ ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో బయో– ఫార్మా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికను ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బయో– ఫార్మాస్యూటికల్ రంగానికి రూ.10,000 కోట్ల పెట్టుబడితో బయో ఫార్మా శక్తి కార్యక్రమాన్ని ప్రకటించారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ మాట్లాడుతూ, దేశంలో మధుమేహం, క్యాన్సర్ సహా పలు అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని గమనించామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు దీర్ఘాయువు, నాణ్యమైన జీవితం అందించడంలో జీవసంబంధిత ఔషధాలు (బయోలాజికల్ మెడిసిన్స్) కీలకమని పేర్కొన్నారు. అందుకే భారతదేశాన్ని ప్రపంచ స్థాయి బయో–ఫార్మా తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

## హైదరాబాద్ నుంచి పుణె, బెంగళూరు, చెన్నై వరకు

# ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లు

హైదరాబాద్‌సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ప్రస్తుతం ముంబయి–అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్, అనేక రాష్ట్రాలు, జిల్లాలను కలిపే తూర్పు, పశ్చిమ రవాణా కారిడార్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా బెంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య కొత్త రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అలాగే కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రానున్న ఐదు సంవత్సరాల్లో 20 జాతీయ జలమార్గాల కార్యాచరణను ప్రతిపాదించారు. 'పర్యావరణపరంగా సుస్థిర ప్రయాణికుల వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైలుకారిడార్లను అభివృద్ధి చేయబోతున్నాం. అవి నగరాల మధ్య గ్రోత్ కనెక్టర్లుగా ఉంటాయి. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుంది. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయి. ఇప్పుడు టైర్2, టైర్3 నగరాలపై దృష్టి సారిస్తాం. టెంపుల్ టౌన్లపై కూడా. వాటికి ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సదుపాయాల కల్పన, వాటి సామర్థ్యాన్ని పెంపునకు వచ్చే ఐదేళ్లలో రూ.5వేల కోట్లు వ్యయం చేసేందుకు ప్రతిపాదిస్తున్నాం. ఛాలెంజింగ్ పద్ధతిలో ఆ ప్రణాళికల అమలు కోసం సంస్కరణ, ఫలితాల ప్రాతిపదికన ఆర్థిక మెకనిజం ఏర్పాటు చేస్తున్నాం.' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

### ఏడు హైస్పీడ్ రైలు కారిడార్స్ ఇవే

ముంబయి–పుణె
పుణె –హైదరాబాద్
హైదరాబాద్–బెంగళూరు
హైదరాబాద్–చెన్నై
ఢిల్లీ–వారణాసి
వారణాశి – సిలిగుడి



# తగ్గేవీ... పెరిగేవీ...


ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తీసుకొన్న నిర్ణయాలతో కొన్ని రకాల పరికరాలు, ఔషధాల ధరలు తగ్గి అందుబాటులోకి రానున్నాయి.

### ధరలు తగ్గేవి ఇవే..



- **విదేశీ పర్యాటక ప్యాకేజీలు:** వీటిపై ట్యాక్స్ కలెక్ట్ ఎట్‌సోర్స్ (టిసిఎస్)ను 2% శాతానికి తగ్గించారు.
- **విదేశీ విద్య:** దీనిపై టిడిఎస్‌ను లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్ కింద విద్యా ఖర్చుల కోసం తగ్గించారు.)
- **ఆల్కాహాలిక్ తుక్కు, కొన్ని రకాల ఖనిజాలు:** వీటిపై కస్టమ్స్ డ్యూటీని 5% శాతం నుంచి 2% శాతానికి తగ్గించారు.
- **షూ అప్పర్ ఎగుమతులు:** ఇందుకోసం అవసరమైన మెటీరియల్ దిగుమతిని డ్యూటీ రహితంగా ప్రకటించారు.
- **సోలార్ ప్యానల్స్:** వీటికి సంబంధించిన కీలక మెటీరియల్‌పై బిసిడి (బేసిక్ కస్టమ్స్ డ్యూటీని)ని తొలగించారు.
- **ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలు:** వీటిపై బిసిడి తొలగింపు.
- క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్‌పై బిసిడి మినహాయింపు.
- వ్యక్తిగత వినియోగానికి వాడే పరికరాలపై బిసిడి 20% నుంచి 10% శాతానికి కుదింపు.
- క్యాన్సర్, అరుదైన వ్యాధులు, డయాబెటిక్ చికిత్సకు వాడే 17 రకాల ఔషధాలపై బిసిడి తొలగింపు.
- మన దేశ తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి పరిధి వరకు ఉన్న సముద్ర జలాల్లో మన జాలర్లు పట్టుకొన్న చేపలు.
- అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు.
- విద్యుత్తు వాహనాల్లో వాడే బ్యాటరీలు.
- భారత్‌లో తయారయ్యే స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్ లెట్లు.
- విమానాల విడిభాగాలు.

### ధరలు పెరిగేవి



- ఆదాయపు వివరాలు సరిగ్గా చూపని వారికి విధించే జరిమానా 100% పెంపు
- బహిర్గతం చేయని చరాస్థులపై ఇప్పుడు జరిమానా విధింపు
- ఫ్యూచర్స్ ఆప్షన్స్ ట్రేడింగ్
- విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, బిడిలు, పాన్ మసాల, గుట్కా
- కాఫీ రోస్టింగ్, బ్రూవింగ్, వెండింగ్ యంత్రాలు
- కొన్ని రకాల ఎరువులపై దిగుమతి ఫీజులను తొలగించారు. అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్ వంటి వాటి ధరలు పెరగొచ్చు.
- చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు ధరలు పెరిగే అవకాశం.



# దేశవ్యాప్తంగా జిల్లాకో బాలికల హాస్టల్

## ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు



దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్స్ కేంద్రాలకు సమీపంలో 5 విశ్వవిద్యాలయ టౌన్‌షిప్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. టౌన్‌షిప్‌లలో నివాస సౌకర్యాలు, పరిశోధన మౌలిక సదుపాయాలతో పాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎ క్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముం బయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. 'జిల్లాకో హాస్టల్ ఉన్నత విద్యను అభ్యసించే అమ్మాయిలకు, యువతులకు సురక్షితమైన, అందుబాటులో ఉండే వసతిని నిర్ధరించడంలో సహాయపడతాయి. తద్వారా అధునాతన శాస్త్రీయ విభాగాలలో విద్యార్థుల నమోదు మెరుగుపడుతుంది' అని అన్నారు.

### భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్ ఏర్పాటు

పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు రుణ సంబంధిత మూలధన సబ్సిడీ మద్దతు పథకాన్ని ఆమె ప్రకటించారు. గుజరాత్ జామ్‌నగర్‌లోని ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష ప్రయోగశాలలు, డబ్ల్యుహెచ్ఓ సంప్రదాయ వైద్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెయ్యి కంటే ఎక్కువ గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు. 'ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్ కారిడార్ల సమీపంలోని 5 విశ్వవిద్యాలయాల టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడంలో మా ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇస్తుంది. ఉన్నత విద్యకు సంబంధించి స్టెమ్ సంస్థలలో ఎక్కువ గంటలు అధ్యయనం చేయడం, ప్రయోగశాలల్లో పని చేయడం వల్ల విద్యార్థినులకు సవాళ్లు ఎదురవుతాయి. అందుకే వయబిలిటీ గ్యాప్ ఫండిం గ్, క్యాపిటల్ సపోర్ట్ ద్వారా ప్రతి జిల్లాలో ఒక బాలికల హాస్టల్ ఏర్పాటు చేయబడుతుంది' అని వెల్లడించారు.

# రక్షణ శాఖకు రూ.7.84 లక్షల కోట్లు




బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పెద్దపీట వేశారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.7.84 లక్షల కోట్లను రక్షణ రంగానికి కేటాయించారు. ఇది 2025–26 ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి కేటాయించిన బడ్జెట్‌తో పోలిస్తే చాలా ఎక్కువ. గతేడాది రక్షణ రంగానికి రూ.6.81 లక్షల కోట్లను కేటాయించారు. రక్షణ రం గానికి కేటాయించిన మొత్తం మూలధన వ్యయాన్ని రూ. 2,19,306 కోట్లుగా నిర్మలా సీతారామన్ నిర్ణయించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.5,53,668 కోట్లుగా ఉంచారు. ఇందులో రక్షణ రంగానికి చెందిన ఉద్యోగుల పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లు కే టాయించారు. మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.63,733 కోట్లు, నౌకాదళం కోసం రూ.25,023 కోట్లు కేటాయించారు. శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమైన విడిభాగాలు, భాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని విమానాల విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. నిర్మలమ్మ తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు డిఫెన్స్ ఏరోస్పేస్ పరిశ్రమకు మరింత ఊతమిస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్ లో పెద్దపీట వేశారు. 21.84 శాతం కేటాయింపులను పెంచారు. గతేడాది కేవ లం 1.8లక్షల కోట్లనే కేటాయించగా, ఈ సారి దానిని రూ. 2.19 లక్షల కోట్లకు పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే అత్యధికంగా రూ.255 కోట్లు ఇచ్చారు. గతేడాది రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. రక్షణ రంగంలో రహస్యమైనవిగా భావించే స్పెషల్ ప్రాజెక్టులకు కూడా రూ.1989.12 కోట్లను ఇచ్చారు.

# విబి–జి– రామ్ జి పథకానికి రూ.95,000 కోట్లకు పైగా కేటాయింపు

## రాష్ట్రాలపై రూ.38,276 కోట్ల భారం


దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నప్పటికీ నరేంద్ర మోదీ ప్రభుత్వం విబిజిరామ్ జి పథకాన్ని దూకుడుగా అమలు చేసేందుకే కంకణం కట్టుకుంది. తాజాగా సమర్పించిన లోక్‌సభ బడ్జెట్‌లో విబిజిరామ్ జి పథకానికి నిధుల కేటాయింపులు జరిపింది. ఈ పథకం కింద రాష్ట్రాలపై 40% వాటా నిధులను విధించి రూ.38,276 కోట్ల భారం మోపింది. ఈ పథకం అమలులోకి రానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విబిజిరామ్ జి పథకానికి రూ.95,692.31 కోట్ల నిధుల మొత్తాన్ని కేటాయించింది. అయితే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కూడా రూ.30,000 కోట్లను కేటాయించింది. ఏడాదికి 125 రోజుల పనిని హామీ ఇచ్చే వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (విబిజి రామ్ జి, రెండు దశాబ్దాల కాలం నాటి యుపిఎ కాలం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) 2005 చట్టం కింద గ్రామీణ ఉపాధి పథకాన్ని భర్తీచేస్తుంది. విబిజిరామ్ జి పథకం అమలు అయ్యే వరకూ పెండింగ్ పనులు పూర్తి అయ్యే వరకూ ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం కొనసాగుతుందని గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు తెలియజేశారు. బడ్జెట్ డాక్యుమెంట్ ప్రకారం గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ మొత్తం కేటాయింపులు గత ఆర్థిక సంవత్సరం కంటే సవరించిన అంచనాల ప్రకారం రూ.1,86,995.61 కోట్లు స్వల్ప అధికంగా ఉంది. 2026–2027 సంవత్సరానికి భూవనరుల శాఖకు కేటాయింపులురూ. 2,654.33కోట్లు కాగా, 2025–26లో రూ. 2,651 కోట్లుగా ఉంది. సవరించిన అంచనాల ప్రకారం వ్యయం రూ.1,757.4 కోట్లు గా ఉంది. 2025–26 నుండి సవరించిన అంచనాల ప్రకారం ఎంజిఎన్‌జిఆర్ఇజిఎ కార్యక్రమం కోసం రూ.88,000 కోట్లు కాగా, ప్రారంభంలో రూ.86,000 కోట్లు కేటాయించబడింది. 2026–27 కోసం పిఎంజిఎస్‌వై కేటాయింపులు రూ.19,000 కోట్లు కాగా, 2025–26 కాలంలో కూడా అదే మొత్తం కేటాయింపులు జరిగాయి.




కేంద్ర ఆదాయం మరియు వ్యయం

| రూపాయి రాక | |
|---|---|
| రుణాలు మరియు ఇతర అప్పులు | 24p |
| కార్పొరేషన్ పన్నులు | 18p |
| ఆదాయపు పన్ను | 21p |
| కస్టమ్స్ | 4p |
| కేంద్ర ఎక్సైజ్ డ్యూటీస్ | 6p |
| వస్తు సేవల పన్ను మరియు ఇతర పన్నులు | 15p |
| పన్నేతర రాబడి | 10p |
| రుణభారం లేని మూలధనం | 2p |

| రూపాయి పోక | |
|---|---|
| రాష్ట్రాల వారీగా పన్నులు | 22p |
| ఆర్థిక సంఘం మరియు ఇతర బదిలీలు | 7p |
| కేంద్ర పథకాలు | 8p |
| వడ్డీ చెల్లింపులు | 20p |
| రక్షణ | 11p |
| ప్రధాన రాయితీలు | 6p |
| ప్రభుత్వరంగ పథకాలు | 17p |
| పౌరుల పెన్షన్ | 2p |
| ఇతర ఖర్చులు | 7p |




## తెలంగాణను వంచించిన బడ్జెట్


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలకు కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయిపులు, ప్రకటన చేయలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని, తెలంగాణను వంచించిందని అన్నారు. కేంద్ర బడ్జెట్ మధ్య తరగతి పేదలకు ఉపశమన ఇవ్వకపోగా, కార్పొరేట్‌కు అనుకూలంగా ఉన్నదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలలోని స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌కు మెట్రో, రిజినల్ రింగ్ రోడ్‌ను విస్మరించిందని, తెలంగాణలోని ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్ట్‌కు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు ప్రకటనను బడ్జెట్‌లో విస్మరించిందని కూనంనేని సాంబశివ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్య నిరుద్యోగమని, ఆర్థిక అంతరాలకు సంబంధించి ఎలాంటి సమస్యలకు కూడా బడ్జెట్‌లో పరిష్కారాన్ని చూపలేదని మండిపడ్డారు. మూలిగే నక్కపై తాటి పండు పడినట్టు ఇప్పటికే రుణాలు, ఆర్థిక భారాలతో సతమతమవుతున్న రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం 'విబి జి రామ్ జి'గా పేరు మార్చి, రాష్ట్రాలపైన 40 శాతం భారాన్ని మోపిందని విమర్శించారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పన్నులల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటాను కేటాయించడాన్ని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పన్నులలో రాష్ట్రాలకు 50 శాతం వాటాను ఇవ్వాలని కూనంనేని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంపైన కేంద్రం వివక్ష చూపడం పట్ల రాష్ట్రం నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## ఇదొక డొల్ల బడ్జెట్

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక డొల్ల అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్ సమాఖ్య స్ఫూర్తిని మరింత దెబ్బ తీసిందన్నారు. కేంద్ర బడ్జెట్ ఏ వర్గాలనూ సంతృప్తి పర్చలేదన్నారు. ఇప్పటికే అమెరికా మోపిన టారిఫ్ భారంతో కుదేలవుతున్న తయారీ రంగంతో పాటు ఇతర రంగాలకు కేంద్ర బడ్జెట్ తోడ్పాటును అందించలేదని మండిపడ్డారు. ఉద్యోగాల కల్పనకు తీసుకునే చర్యలను తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాలపై తగిన చర్యలు తీసుకోకుండానే 'వికసిత్ భారత్ 2047' పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నదని పల్లా విమర్శించారు. గుప్పెడు మంది చేతిలో కేంద్రీకృతమైన సంపదను నియంత్రించేందుకు 'సంపద పన్ను'ను విధించాలనే డిమాండ్‌ను కేంద్రం పెడచెవిన పెట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ బ్యాంకులను విలీనం చేసి, బడాబాబులకు పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చే కుట్రలో భాగంగానే 'బ్యాంకింగ్ హై లెవల్ కమిటీ'ని ప్రతిపాదించారని పల్లా వెంకటరెడ్డి విమర్శించారు.

## రాష్ట్ర వాటాను తగ్గించారు

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర వాటాగా రావాల్సిన నిధులను కేంద్ర బడ్జెట్‌లో తగ్గించారని, తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. పన్నుల వాటాలో భాగంగా 2.11 శాతం ప్రకారం రూ.63 వేల కోట్లు రావాల్సిందని, కానీ గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగించే విధంగా బడ్జెట్ ఉన్నదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదని, హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులను రాబట్టడానికి కృషి చేయాలన్నారు.

## విద్యారంగానికి బడ్జెట్ అన్యాయం


### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్ విద్యా రంగానికి అన్యాయం చేసిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. 12 ఏళ్ల మోదీ పాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగిన మొత్తంలో జరగలేదని, కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 2.6 శాతం మాత్రమే (రూ.1, 39,289 కోట్లు) కేటాయించిందని, ఇది మొత్తం బడ్జెట్ శాతంలో పెరుగుదల లేదని వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ లో కనీసం 10 శాతం జిడిపిలో 6 శాతం నిధులను కేటాయించాలని అనేక సంవత్సరాలుగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని హామీల మేరకు విద్యాసంస్థలను, ప్రత్యేక నిధులను కేటాయించకుండా కేంద్రం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 8 మంది బిజెపి ఎంపిలు గెలిచినప్పటికీ తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కుల గురుంచి నోరుమెదపలేదని మండిపడ్డారు.

## పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని యువత, కార్మికులు, రైతులు,సాధారణ ప్రజల అత్యవసర అవసరాల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేంద్ర బడ్జెట్ ద్వారా మరోసారి స్పష్టమైందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగినప్పటికీ కేంద్రం ఉపాధి కల్పనకు బడ్జెట్‌లో ఎటువంటి స్పష్టమైన ప్రణాళికను ప్రతిపాదించలేదని వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆదాయాల క్షీణత వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించకుండా ఖాళీ హామీలు, అలంకార ప్రకటనలకే కేంద్రం పరిమితమైందని విమర్శించారు. విద్యా రుణాల భారంతో నలుగుతున్న పేద, మధ్య తరగతి యువతకు రుణ మాఫీ అంశాన్ని బడ్జెట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. యువతను నిర్లక్ష్యం చేస్తూ దేశ భవిష్యత్తును నిర్మించలేరన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసిస్తూ దేశ యువత గళమెత్తాలని, ఉపాధి, విద్య, గౌరవం కోసం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.

# బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడే ప్రయత్నం చేస్తుంటే సహకారం అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన రూ. 53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా 2047 నాటికి త్రీ మిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రోత్సాహం అందించాల్సిన కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌లో తెలంగాణకు అదేస్థాయిలో కేటాయింపుల ఉంటాయని ఆశించామని అయితే తీవ్ర నిరాశే మిలిగిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తనతో పాటు సహచర మంత్రులు, పార్లమెంటు సభ్యులు బృందాలుగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అనేక సార్లు కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. 'ప్రపంచానికి ఫార్మా రాజధాని హైదరాబాద్ కాగా బడ్జెట్‌లో బయో ఫార్మా కేటాయింపుల్లో తెలంగాణ పేరు లేకపోవడం విడ్డూరం' అని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్ రంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, ఈసిఐఎల్ వంటి దిగ్గజ సంస్థలున్న హైదరాబాద్‌కు ఒక్క పైసా ఇవ్వకపోవడం నిరాశపరిచిందన్నారు. 'హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్.. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్' అన్న నానుడిని కేంద్రం చెరిపివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. భవిష్యత్తు తరాలకు అత్యంత కీలకమైన ఆరెంజ్ ఎకానమీ (ఆడియో, వీడియో, గేమింగ్, కామిక్స్) రంగంలో హైదరాబాద్ ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని కలిగి ఉందని, అయితే కేంద్రం ఉద్దేశపూర్వకంగా దీనిని ముంబైకి మళ్లించిందని భట్టి నిలదీశారు. 'మెడికల్ టూరిజంలో దేశానికే తలమానికంగా ఉన్న తెలంగాణను విస్మరించి, ఇతర రాష్ట్రాలకు రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లు ఇవ్వడం ఏ చట్టం కిందికి వస్తుంది అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి కీలకమైన మూసీ పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్ నుంచి భారీగా నిధులు ఆశించామని, కానీ ఒక్క ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రధానిని కలిసినా ఫలితం లేకపోయిందన్నారు. పర్యాటక రంగంలోనూ తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యునెస్కో గుర్తించిన వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, మన్ననూరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు. కృష్ణగోదావరి తీరాలలోని ఎన్నో చారిత్రక ఆలయాలున్నా తెలంగాణకు కేంద్రం ప్రకటించిన టూరిజం ప్యాకేజీలో స్థానం కల్పించకపోవడం అన్యాయమని ధ్వజమెత్తారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ పేదల బతుకుదెరువును కేంద్రం దెబ్బతీస్తోందని భట్టి విమర్శించారు. ఎస్‌సి, ఎస్, మైనార్టీల సంక్షేమంపై బడ్జెట్ మౌనంగా ఉండటం సామాజిక న్యాయానికి విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఫిజికల్ డెఫిసిట్ (ద్రవ్య లోటు)ను 4.3 శాతంగా నిర్ణయించుకుందని. కానీ తెలంగాణ 4 శాతం కోరితే ఎందుకు నిరాకరించారన్నారు. కేంద్రానికి ఒక నీతి రాష్ట్రానికి మరో నీతి ఉంటుందా తెలంగాణ దేశంలో భాగం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఎంపీలందరూ ఏకమై ప్రధానిని, ఆర్థికమంత్రిని కలిసి ఒత్తిడి తీసుకురావాలని భట్టి కోరారు.

**కక్ష సాధింపులు లేవు**

తమ ప్రజా ప్రభుత్వం ఎవరిపైనా కక్ష సాధింపులకు పాల్పడదని, ఆ ఆలోచన కూడ చేయదని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ చట్టబద్ధంగా విచారణ కొనసాగిస్తోందన్నారు. దీనిపై ఇప్పుడు తను మాట్లాడడం విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందుకు తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన అందిస్తూ అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

## నీటి మూటలైన 'సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్'

### గ్రాంట్ల రూపంలో వచ్చింది 20 శాతం మాత్రమే: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రం తరచూ వల్లించే 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అనే నినాదం 'తెలంగాణ' విషయంలో కేవలం నీటి మూటలేనని మరోసారి ఈ బడ్జెట్‌లో స్పష్టం అయ్యిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యపడదని రాజ్యాంగం చెబితే, కేంద్రం మాత్రం ఈ బడ్జెట్‌లో ఆ మూలసూత్రాన్నే విస్మరించిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. దేశ జిడిపిలో 5 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న తెలంగాణ గురించి బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ఓ వైపు అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉంటుందని చెబుతూనే, మరోవైపు నిధుల కేటాయింపుల్లో 'తెలంగాణ' పట్ల రాజకీయ వివక్ష చూపడం రాజ్యాంగ నైతికత అనిపించుకోదని హితవు పలికారు. 'బడ్జెట్ అనేది ఆర్థిక హేతుబద్ధత ఆధారంగా రూపొందించాలి.

'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో తెలంగాణకు రూ.22,782 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 10 నెలలు గడుస్తున్నా అందింది కేవలం సుమారు రూ.4,000 కోట్లు మాత్రమే. అంటే రావాల్సిన దాంట్లో 20 శాతం కూడా అందలేదు. ఇది తెలంగాణ పట్ల కేంద్రం చూపుతున్న ఆర్థిక అణచివేతకు ఇది మరో సాక్ష్యం' అని వెల్లడించారు. 'రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ అనేది సమ న్యాయంగా జరగాలి. అయితే సహకార సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా 'తెలంగాణ' పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపూరిత సమాఖ్య ధోరణిని ప్రదర్శిస్తోందని తాజా బడ్జెట్ మరోసారి రుజువు చేసింది' అని అన్నారు. 'హై స్పీడ్ రైల్ కారిడార్స్'తో 'తెలంగాణ'కు మమ అనిపించిన కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిపై తెలంగాణ నుంచి బిజెపి తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపిలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు.

## తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ పూర్తిగా నిరాశజనకమని, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప, సామాన్య ప్రజలకు, రైతులకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదని, ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతామని సత్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశాల ఊసే లేదని, ఇది తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిలేమికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల పన్నుల రూపంలో వెళ్తున్నప్పటికీ, తిరిగి ఆ నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపిందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ ఆధారిత దేశంలో, రైతుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసిందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర చట్టంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. పోచంపల్లి, నారాయణపూర్, పుట్టపాక వంటి ప్రాంతాల్లోని చేనేత కార్మికులు ఎప్పటి నుండో కోరుతున్నట్టుగా చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టిని ఎత్తివేయకపోవడం శోచనీయమని, ముడి సరుకుల ధరలు పెరిగి చేనేత కార్మికులు ఇబ్బంది పడుతుంటే, బడ్జెట్‌లో వారికి ఎటువంటి ఊరట కల్పించలేదని తెలిపారు. నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల పునరావాసానికి లేదా ఫ్లోరోసిస్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం విచారకరమని సత్యం పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని సత్యం మండిపడ్డారు.

## వికసిత్ భారత్ లక్ష్యానికి దిశానిర్దేశం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ 'వికసిత్ భారత్' నిర్మాణ సంకల్పాన్ని ఆశయ స్థాయి నుంచి కార్యరూపంలోకి తీసుకొచ్చే దిశగా దేశాన్ని దృఢంగా ముందుకు నడిపిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ కారిడార్‌ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడనుందని తెలిపారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బడ్జెట్ ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో బడ్జెట్ ప్రత్యక్ష ప్రసారాన్ని రాంచందర్ రావు వీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్ అని అభివర్ణించిన ఆయన, ఆర్థిక బలం నుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణయాత్రకు ఈ బడ్జెట్ పునాది వేస్తోందని చెప్పారు. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా కీలక సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, ప్రజల కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్యా వైద్యసేవల విస్తరణకు ఈ బడ్జెట్ బలమైన పునాదిని వేస్తోందన్నారు. నిరంతర విధానాల ఫలితంగా భారతదేశం సుమారు 7 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతోందని చెప్పారు. పేదల సంక్షేమం, రైతుల సౌభా గ్యం, మహిళల సాధికారత, యువత ఆశయాలకు అంకితమైన ఈ ప్రజాకేంద్రిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధాని మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాంచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## పుష్కరకాలంగా రాష్ట్రానికి ఒక్క రూపాయీ కేటాయించలేదు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పుష్కరకాలంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపా యీ, ఒక్క ప్రాజెక్టును కూడా కేటాయించలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీల అమలు విషయంలో కేంద్రం వివక్షపూరిత వైఖరిని కొనసాగిస్తోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, సిఎం రేవంత్ రెడ్డి ఘోర వైఫల్యం వల్లనే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే అని, మొండి చెయ్యి మాత్రమేనన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని బిజెపి పెద్దల చుట్టూ చేసిన ప్రదక్షణల వల్ల తెలంగాణ రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాన్ని ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, దీనిపైన బిజెపి ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి పేరుకు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం పక్షాన కనీసం వారు గొంతెత్తి అడుగలేదని, అందుకే తెలంగాణకు చిల్లిగవ్వ కూడా కేంద్ర బడ్జెట్‌లో దక్కలేదని విమర్శించారు.

## ఇది కార్పొరేట్ వర్గాల బడ్జెట్

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి వర్గాలకు ఒరిగింది ఏమీ లేదని, ఇది కార్పొరేట్ వర్గాల అనుకూల బడ్జెట్ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస రావు విమర్శించారు. 'సబ్ కే సాత్, సబ్ కా వికాస్' అనేది మాటలకే పరిమితమై, 'కార్పొరేట్ కే సాత్ కార్పొరేట్ కా వికాస్' అనే చందంగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అరకొర నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేశారని, ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో ధరల నియంత్రణ అంశం కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, బలహీన వర్గాలకు ఉపశమనం కలిగించేలా బడ్జెట్‌లో నిర్మాణాత్మక సంస్కరణలు లేవని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపారని ఆరోపించారు. ములుగు గిరిజన విశ్వవిద్యాలయానికి అరకొర నిధులు కేటాయించారని, ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపర్చినట్టుగా రాష్ట్రంలోని వెనకబడ్డ జిల్లాలకు రావాల్సిన ప్రత్యేక నిధులు కేటాయింపులు చేయకుండా బిజెపి ప్రభుత్వం మొండి చేయి చూపిందని శ్రీనివాస రావు విమర్శించారు.

## వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు

### తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేవలం 13 శాతం నిధులను మాత్రమే కేటాయించారని, పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి ఇవ్వలేదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ విమర్శించారు. ఇది రైతు వ్యతిరేక కేంద్ర బడ్జెట్ అని, చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులను మరింతగా దెబ్బతీసే విధంగా ఉందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులు రైతుల అభివృద్ధికి ఏమాత్రం సరిపోదని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి ఎకరాకు రూ 18,000 కేటాయించాలని, రుణమాఫీ చట్టం చేయాలని, పంటల మద్దతు ధరలను సి 2+50 శాతం ప్రకారం నిర్ణయించాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, ఎరువుల సబ్సిడీ పెంచాలని, 15 కోట్ల మంది రైతులు పంటలను సాగు చేయడానికి అనుకూల పరిస్థితులను కల్పించాలని దేశ రైతాంగం నిరంతరంగా పోరాడుతుందని పశ్యపద్మ గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్‌లో వరి, గోధుమ, నూనె గింజలు, పప్పు దినుసులకు సంబంధించిన మద్దతు ధరపైన ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపైన అసలు స్పందనే లేదన్నారు. ఎఐ లాంటి నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు కార్పోరేట్ వ్యవసాయాన్ని కొనసాగించే వారికి మాత్రమే ఉపయోగకరమని, ఐసిఎఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు వ్యవసాయ పరిశోధనలకు సంబంధించి కేటాయించిన రూ.6,200 కోట్లు గత బడ్జెట్ కంటే తక్కువగా ఉందని తెలిపారు. చిన్న, సన్న కారు రైతుల ఆర్థిక స్తోమతను పెంచేందుకు బడ్జెట్‌లో నిధులను కేటాయించకుండానే వారి ఆర్థిక స్తోమత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పడం వారిని మోసం చేయడమేనని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసుకుంటూ, కేవలం రాజకీయ అధికారాన్ని కాపాడుకునేందుకు మాత్రమే పాలకుల విధానాలు ఉన్నాయని పశ్యపద్మ అన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర నిరాశ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 – 27 బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నిరాశ ఎదురైంది. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న దాదాపు లక్ష కోట్ల రూపాయలకు సంబంధించిన ప్రాజెక్టులు, అనుమతులలో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. అనుమతులు కూడా రాలేదు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో దాని ఊసే లేదు. సమ్మక్క – సారలమ్మ మహా జాతరకు జాతీయ పండుగగా గుర్తించాలని, రామప్ప దేవాలయానికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కోరినా కేంద్రం పట్టించుకోలేదు. తెలంగాణలోని హైదరాబాద్ లేదా మహబూబ్‌నగర్‌లో ఐఐఎంను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా కేంద్ర బడ్జెట్‌లో దాని ఊసు కూడా లేదు. మూసీ పునరుజ్జీవన పథకం, మెట్రో రైల్ విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్‌కు ఆర్థిక సహాయం కోసం అనేక సార్లు తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞాపన పత్రాలు సమర్పించినా ఫలితం శూన్యం. మౌలిక వసతులు, రవాణా, పరిశ్రమలు, విద్య, హౌజింగ్ వంటి కీలక రంగాల్లో సుమారు 12 విభాగాలకు సంబంధించిన 47 అంశాలలో దాదాపు లక్ష కోట్ల రూపాయలకు సంబంధించిన ప్రాజెక్టులు, అనుమతులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందు కోసం కేంద్ర సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ 2025 –2026 కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు ఆశించిన నిధులు, అనుమతులు కానీ రాలేదు.

హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కిలో మీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అనుమతులతో పాటు రూ.34,367 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు కలుపుతూ కొత్తగా 10 రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదలను సిఎం ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. వీటికి రూ.45,000 కోట్ల నిధుల మంజూరు కోరింది. హైదరాబాద్ మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో రైల్ ఫేజ్–2 ప్రాజెక్టు ఫేజ్ 2ఎ, ఫేజ్ 2బి లకు సంబంధించిన రూ.44,028 కోట్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా, దీనిపైన కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన కూడా చేయలేదు.




బడ్జెట్‌లో బయోఫార్మా గురించి ప్రస్తావించినా అందులో కూడా తెలంగాణకు కేటాయింపులు జరగలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎసిఐఎల్ లాంటి కంపనీ హైదరాబాద్‌లో ఏర్పా టు చేసింది. కెమికల్ పార్క్‌లు అంటే హైదరాబాద్ ఫార్మా హబ్‌గా ఉంది. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్ లేదు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ పొందుపర్చినప్పటికీ కేంద్ర ప్రకటించిన అఫర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ విభాగం లో కూడా తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండగా, దానిని కూడా ముంబాయికి తరలించారు. రీజినల్ మెడికల్ హబ్‌ను ప్రకటించిన కేంద్రం అందులో కూడా తెలంగాణకు ఏమీ కేటాయించలేదు.

అయితే తెలంగాణలో దాదాపు 32 పట్టణాలకు అమృత్ కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.200 కోట్ల ప్రోత్సాహక పథకం కొనసాగించనున్నట్లు కేంద్ర ప్రకటించింది. రైల్వే మార్గాల అనుసంధానం కోసం వికారాబాద్– కృష్ణ కొత్త రైలు మార్గం, కల్వకుర్తి – మాచర్ల రైలు లైన్, గద్వాల్–డోర్నకల్ రైలు మార్గం, కాచిగూడ – జగ్గయ్యపేట రైలు మార్గం, పటాన్‌చెరు– ఆదిలాబాద్ రైలు లైన్, బోధన్–లాతూర్ రోడ్ లైన్, అక్కన్నపేట బైపాస్ రైలు లైన్, పాండురంగాపురం–భద్రాచలం రోడ్ లైన్ తదితర 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపగా, హైద్రాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పూణె ల మధ్య హైస్పీడ్ రైళ్లు ప్రవేశ పెడుతున్నట్టు బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది.


## ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సామాజిక న్యాయానికి తూట్లు పొడిచినట్టేనని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్ మొత్తం చూస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాల కోసం ఉపాధి, విద్య, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి వంటి ముఖ్యమైన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వర్గాల భవిష్యత్తును పూర్తిగా విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులందరూ పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు వివిధ కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ అభివృద్ధి, సామాజిక సంక్షేమ అంశాలపై విన్నవించినా కేంద్రం మాత్రం మొండివైఖరితో వ్యవహరించడమే తప్ప రాష్ట్రానికి కనీస స్పందన కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టికు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లు, గురుకులాలు, ఉపాధి పథకాలు, ఆర్థిక సహాయ కార్యక్రమాలకు కేంద్రం నుంచి గట్టి మద్దతు లభిస్తుందని ఆశించామని, కానీ ఈ బడ్జెట్‌లో ఆ వర్గాల ఆశలన్నింటినీ నిరాశగా మార్చారని అన్నారు. రైజింగ్ తెలంగాణలో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసిసామాజిక సమానత్వం సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుంటే, అలాంటి ప్రయత్నాలకు కేంద్రం సహకరించకపోవడం సమాఖ్య స్ఫూర్తికి, ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమని అన్నారు.

# వాస్తవ సమస్యలకు దూరంగా


ఫోటో: ఎస్.ఎన్ సిన్హా న్యూఢిల్లీ

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశ రాజకీయ వేదికపై తీవ్ర చర్చ మొదలైంది. కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, దీర్ఘకాలిక ప్రణాళికలు, లక్ష్యాల పేరిట ఓటర్లను మాయ చేయడానికి బడ్జెట్‌ను కేంద్రం ఒక అవకాశంగా మార్చుకుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పక్షం ఈ బడ్జెట్‌ను అభివృద్ధి దిశగా ముందడుగుగా అభివర్ణించగా, ప్రతిపక్షాలు మాత్రం దీనిని దిశలేని, స్పష్టత లేని, ప్రజల వాస్తవ సమస్యలతో సంబంధం లేని బడ్జెట్‌గా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగం, పెరుగుతున్న అసమానతలు, వ్యవసాయ సంక్షోభం, సామాన్యుల జీవన వ్యయాలు వంటి అంశాలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు బలంగా వినిపించాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి, ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎగుమతుల మందగమనం, రూపాయి విలువ పతనం వంటి ఎన్నో అంశాలు భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో బడ్జెట్ దేశానికి స్పష్టమైన దిశానిర్దేశనం ఇవ్వాల్సి ఉండగా, అందుకు భిన్నంగా, ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలలో ఓట్లు పొందే రీతిలో హామీలకు, సాధారణ ప్రకటనలకే పరిమితమైందని ప్రతిపక్షాల విమర్శ. బడ్జెట్‌లో స్పష్టత లేకపోవడాన్ని పలువురు విపక్ష నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. అనేక సంక్షేమ పథకాల విషయంలో పథకానుసార ప్రధాన కేటాయింపులను వెల్లడించకుండా, మాటల గారడీని ప్రదర్శించి తప్పించుకోవడాన్ని నిలదీశారు. పెద్ద పెద్ద జాతీయ స్థాయి కార్యక్రమాల పేర్లు ప్రస్తావించినా, వాటికి ఎంత నిధులు కేటాయిస్తున్నామన్నది నిర్మల ఎక్కడా ప్రదస్తావించలేదు. అంతేకాదు, అవి ఏ విధంగా అమలవుతాయో బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా చెప్పలేదు. ప్రతి పక్ష పార్టీల నేతలు ఈ విషయాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఇది పార్లమెంట్‌ను, ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నమని పలు ప్రతిపక్షాలు అభిప్రాయపడ్డాయి. నిరుద్యోగం అంశం బడ్జెట్‌లో పూర్తిగా పక్కన పడిపోయిందనే విమర్శ అత్యంత తీవ్రమైనది. దేశంలో యువత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. విద్యావంతులైన నిరుద్యోగులు పెరుగుతున్నారు. తయారీ రంగం ఆశించిన స్థాయిలో ఉపాధిని సృష్టించలేకపోతోంది. స్టార్టప్‌లకు మద్దతు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు ప్రసంగంలో ప్రస్తావించినా, వాస్తవంగా ఎన్ని ఉద్యోగాలు సృష్టిస్తారు? అందుకు అనుసరించబోయే కార్యాచరణ ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానం లేదన్నది ప్రధాన విమర్శల్లో ఒకటి. 'యువత చేతుల్లో డిగ్రీలు ఉన్నాయి, కానీ చేతుల్లో పని లేదు' అనే వాస్తవాన్ని ఈ బడ్జెట్ పట్టించుకోలేదన్న భావన ప్రతిపక్ష వర్గాల మాటల్లో బలంగా వ్యక్తమైంది. ఆదాయ అసమానతల సమస్య కూడా బడ్జెట్‌లో ప్రతిఫలించలేదని విమర్శలున్నాయి. ఒక వైపు సంపన్న వర్గాల సంపద పెరుగుతుండగా, మరో వైపు సామాన్య ప్రజలు ధరలతో పోరాడుతున్నారు. ఫలితంగా పొదుపులు తగ్గిపోతున్నాయి. ధరలు పెరుగుతున్నా, ఆదాయాల్లో దాదాపు ఎలాంటి మార్పులు లేకపోవడంతో, మధ్యతరగతి, దిగువ మధ్య, పేద వర్గాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పన్ను ఉపశమనం లేదా సామాజిక భద్రతా చర్యలు బడ్జెట్‌లో స్పష్టంగా లేకపోవడం ప్రజలను నిరాశకు గురి చేస్తున్నదని ప్రతిపక్షాలు అభిప్రాయపడ్డాయి. సంపన్న వర్గాలకు వివిధ రకాల మినహాయింపులు లభిస్తున్నాయనే భావన, సామాన్యులకు మాత్రం ఎలాంటి ఊరట లేదనే అభిప్రాయం బలపడుతోందని పలువురు ప్రతిపక్ష నేతలు దుయ్యబట్టారు. వ్యవసాయ రంగంపై కూడా బడ్జెట్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలు వచ్చాయి. రైతుల ఆదాయ భద్రత, పంట ధరల స్థిరత్వం, ఎరువుల ధరలు, సాగునీటి సమస్యలు వంటి అంశాలపై స్పష్టమైన విధాన ప్రకటనలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడకుండా దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగదని నిపుణులు చెబుతుంటే, ఈ బడ్జెట్ మాత్రం రైతుల సమస్యలను ప్రస్తావించడానికే పరిమితమైందని వ్యాఖ్యానించారు. రైతు సంక్షోభం కేవలం మాటలతో పరిష్కారం కాదని, గట్టి నిధుల కేటాయింపులు అవసరమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. సామాజిక రంగ వ్యయం విషయంలో కూడా బడ్జెట్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రకటించిన అనేక సంక్షేమ పథకాల నిధులు పూర్తిగా ఖర్చు కాలేదన్న వాస్తవం ఇప్పటికే బయటపడింది. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో కూడా అదే ధోరణి కొనసాగుతుందేమోనన్న ఆందోళన వ్యక్తమైంది. సామాజిక భద్రత పథకాలు కేవలం అధికారికతకే పరిమితమై, పేదలు, కార్మికులు, చిన్న వ్యాపారులు వాటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ప్రతిపక్ష నేతలు విమర్శించారు.బడ్జెట్‌లోవిస్పష్టమైన ముందు చూపు లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పెద్దపెద్ద పదాలు వాడినా, ఆకర్షణీయమైన నినాదాలు వినిపించినా, అవి వాస్తవ విధానాలుగా మారే మార్గం స్పష్టంగా కనిపించడం లేదని ప్రతిపక్ష నేతలు పలువురు అన్నారు. సాంకేతికత, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలు ప్రస్తావించినా, వాటి ద్వారా సామాన్యుల జీవితాల్లో ఎలా మార్పు వస్తుందో చెప్పలేదని విమర్శించారు. మాటలు ఎక్కువ, దిశ తక్కువ అన్న భావన ఈ బడ్జెట్‌పై ఏర్పడిందని అభిప్రాయపడ్డారు.ప్రాంతీయ సమతుల్యత అంశం కూడా చర్చకు వచ్చింది. కొన్ని రాష్ట్రాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత లభించలేదన్న ఆరోపణలు వినిపించాయి. ప్రాంతాల మధ్య అభివృద్ధి వ్యత్యాసాలను తగ్గించే దిశగా బడ్జెట్‌లో స్పష్టమైన చర్యలు కనిపించలేదన్న విమర్శలున్నాయి. దేశ సమగ్ర అభివృద్ధి కోసం అన్ని ప్రాంతాలను సమానంగా చూడాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తుచేశాయి. బడ్జెట్‌పై వ్యక్తమవుతున్న అసంతృప్తిని, విమర్శలను గమనిస్తే, నాలుగు అంశాల్లో తీవ్రంగా విఫలమైందని స్పష్టమవుతుంది. మొదటిది, నిరుద్యోగం వంటి కీలక సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు లేకపోవడం. రెండవది, ఆదాయ అసమానతలు, సామాన్యుల ఆర్థిక కష్టాలను పట్టించుకోకపోవడం. మూడవది, సంక్షేమ పథకాల విషయంలో స్పష్టత, పారదర్శకత లేకపోవడం. నాలుగవది, దేశ భవిష్యత్తుకు స్పష్టమైన ఆర్థిక దృష్టి కోణం కనిపించకపోవడం. దేశ భవిష్యత్తుకు, పౌరుల ఆర్థిక భద్రతకు అవసరమైన అంశాలను విస్మరించిన బడ్జెట్ ఎందుకనే ప్రశ్న తలెత్తుతున్నది. ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను అభివృద్ధి, స్థిరత్వం, భవిష్యత్ లక్ష్యాల పేరుతో సమర్థించుకుంటున్నా, ప్రతిపక్షాల విమర్శలు దేశంలో ఒక పెద్ద వర్గం భావోద్వేగాలను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల రోజువారీ జీవితాల్లో ఎదురవుతున్న కష్టాలు, ఉద్యోగాల కొరత, పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న భద్రతా భావన వంటి అంశాలు బడ్జెట్‌లో ప్రతిఫలించలేదన్న భావన బలపడుతోంది. నిజానికి బడ్జెట్ అనేది కేవలం ఆదాయ-వ్యయాల పట్టిక కాదు. అది దేశ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే ముఖ్యమైన విధాన పత్రం. అలాంటి బడ్జెట్ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలంటే, స్పష్టత, పారదర్శకత, ప్రజల వాస్తవ సమస్యలపై గట్టి దృష్టి అవసరం. ప్రతిపక్షాల విమర్శలు రాజకీయ విమర్శలుగా మాత్రమే కాకుండా, ప్రజల ఆందోళనల ప్రతిధ్వనిగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విమర్శలను ఎంతవరకు పరిగణలోకి తీసుకుని భవిష్యత్ విధానాలను మార్చుకుంటారన్నదే ఈ బడ్జెట్ ప్రభావాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారనుంది. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాలను వాస్తవంగానే ఖర్చు చేస్తారా లేన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఓట్లు కొల్లగొట్టడానికి ఇచ్చిన నామమాత్రపు హామీలా అనేది త్వరలోనే స్పష్టమవుతుంది.

## రాష్ట్రాలకు అన్యాయం

### గ్రాంట్ల కింద రూ.1.4 లక్షల కోట్ల కేటాయింపులు
### బడ్జెట్‌లో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు

**న్యూఢిల్లీ :** ఈ (2026–27) ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు గ్రాంట్ల కింద రూ.1.4లక్షల కోట్లు కేటాయించింది కేంద్రం. ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, 16వ ఫినాన్స్ కమిషన్ సిఫార్సుల మేరకు వర్టికల్ విధానంలో 41శాతం నిధులను ప్రతిపాదించింది. 'నిధుల విభజన ప్రకారం 41 శాతం కేటాయించాలంటూ 16వ ఆర్థిక సంఘం చేసిన ప్రతిపాదనకు మా ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఫినాన్స్ కమిషన్ గ్రాంట్ల కింద రూ. 1.4లక్షల కోట్లు కేటాయించాం. ఇందులో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలతో పాటు విపత్తు నిర్వహణకు సంబంధించిన నిధులు ఉన్నాయి' అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి 16వ ఆర్థిక సంఘం ప్రతిపాదనలు అమల్లోకి రానున్నాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఇది మూడో ఆర్థిక సంఘం. అంతకుముందు 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42శాతం వాటాను పంపిణీ చేయాలని ప్రతిపాదించింది. ఆ తర్వాత 15వ ఆర్థిక సంఘం కూడా దాన్ని దాదాపుగా కొనసాగించింది. అయితే, 16వ ఆర్థిక సంఘం మాత్రం పన్నుల వాటా కేంద్రంరాష్ట్రాల మధ్య వర్టికల్ విధానంలో రాష్ట్రాలకు 41 శాతం కేటాయించింది. 1971 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకోవాలని మొదట నిర్ణయించగా, కొన్ని రాష్ట్రాలు దీనికి అభ్యంతరం తెలిపాయి. మెరుగైన పద్ధతుల ద్వారా జనాభా నియంత్రణకు చర్యలు చేపట్టిన రాష్ట్రాలకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఫలితంగా 2011 జనాభా లెక్కలను కూడా పరిగణనలోకి తీసుకొని కొంత వెయిటేజ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**బడ్జెట్‌లో రాష్ట్రాలకు కేంద్రం నుంచి వనరుల బదిలీ**

ఎన్‌డిఎంఎఫ్ నుంచి రాష్ట్రాలకు సహాయంరూ.2,874 కోట్లు
ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి రాష్ట్రాలకు సహాయంరూ.11,496 కోట్లు
విదేశీ సంస్థల ప్రాజెక్టులకు గ్రాంట్లురూ.15,745 కోట్లు
విదేశీ సంస్థల ప్రాజెక్టులకు రుణంరూ.47,753 కోట్లు
రాజ్యాంగంలోని ఆర్టికల్ 275(1) కింద గ్రాంట్లురూ.1242.01 కోట్లు
మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు రుణసహాయం
మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు రూ.1,85,000 కోట్ల రుణాలు
ప్రత్యేక డిమాండ్ కింద రాష్ట్రాలకురూ.15,000 కోట్లు

**ఆర్థిక సంఘం గ్రాంట్లు**

పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లుప్రాథమిక భాగంరూ. 37,272 కోట్లు
పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లుప్రత్యేక మౌలిక సదుపాయాల కోసంరూ. 6,000 కోట్లు
పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లుపట్టణీకరణ ప్రీమియం కోసం రూ.2,000 కోట్లు
గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లురూ. 55,909 కోట్లు
రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధికి గ్రాంట్లురూ.22,574.10 కోట్లు
రాష్ట్ర విపత్తు ఉపశమన నిధికి గ్రాంట్లురూ. 5,641.50 కోట్లు
రాష్ట్రాలకు ఇతర ఖాతాల నుంచి బదిలీ
కేంద్ర ప్రాయోజిత పథకాల రెవెన్యూరూ.5,20,333.39 కోట్లు
కేంద్ర ప్రభుత్వ రంగ పథకాల రెవెన్యూరూ.77,371 కోట్లు
ఇతర వ్యయ విభాగాల రెవెన్యూరూ.11,201.13 కోట్లు
మూలధన బదిలీలురూ.102.01 కోట్లు

## బడ్జెట్‌లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

### సేవారంగం విస్తరణతోనే వికసిత్ భారత్ సాధ్యం: నిర్మల



**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత వేగం ఇవ్వడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బడ్జెట్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దీర్ఘకాలిక అభివృద్ధికి నిర్మాణాత్మక సంస్కరణలు, టెక్నాలజీ వినియోగం, నగరాల అభివృద్ధి, స్వదేశీ తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. 'ఆర్థిక వృద్ధి నిలకడగా కొనసాగాలంటే పటిష్ఠమైన ఎకోసిస్టమ్ అవసరం. అందుకోసం నిర్మాణాత్మక సంస్కరణలు ఇప్పటికే ప్రారంభించాం. అవి నిరంతరం కొనసాగుతాయి. ఉత్పాదకత పెరగాలి, ఉపాధి అవకాశాలు విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది' అని ఆమె చెప్పారు. 21వ శతాబ్దం పూర్తిగా టెక్నాలజీ ఆధారితమైందని, ఆ టెక్నాలజీ ప్రయోజనాలు సామాన్యుడికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ప్రతి నగరానికి ఏటా సుమారు రూ.1,000 కోట్ల మద్దతు**

నగరాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు నగరాలే ఇంజిన్లను, ముఖ్యంగా టైర్2, టైర్3 నగరాలు, ఆలయ పట్టణాల్లో మౌలిక వసతులు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సిటీ ఎకనామిక్ రీజియన్స్ (సిఇఆర్) ఆధారంగా నగరాల అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ప్రతి ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్ల కేటాయింపు చేయనున్నట్లు వెల్లడించారు. 'ప్రతి నగరానికి సంవత్సరానికి సుమారు రూ.1,000 కోట్ల మద్దతు అందిస్తాం. రెండో, మూడో శ్రేణి నగరాలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది' అని వివరించారు.

ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాలపై కూడా ప్రభుత్వం భారీ దృష్టి సారించింది. సెమీకండక్టర్ మిషన్ ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెంపు, సాంకేతిక స్వావలంబన సాధన లక్ష్యమని చెప్పారు. ఎలక్ట్రానిక్ కంపోనెంట్ తయారీ కోసం రూ.40,000 కోట్ల ప్రత్యేక పథకం తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా దిగుమతులపై ఆధారపడకుండానే దేశీయ తయారీ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్) అవసరాలను దేశంలోనే తీర్చుకునేందుకు ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కారిడార్లు అభివృద్ధి చేస్తామని చెప్పారు. 'ఈ ఖనిజాల అన్వేషణ, ప్రాసెసింగ్ ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గిస్తాం. మ్యాగ్నెట్లు, ఇతర కీలక పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తాం' అని వివరించారు.

**సేవారంగ విస్తరణే దేశాభివృద్ధికి కీలకం**

పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని మంత్రి స్పష్టం చేశారు. బయో ఫార్మా రంగంలో పరిశోధనలకు ఊతమిస్తూ, ఆరోగ్య రంగంలో కొత్త అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా 21 జలమార్గాల అభివృద్ధి చేపట్టడంతో పాటు, ఆధునిక అగ్నిమాపక పరికరాలు, దేశీయ తయారీ టన్నెల్ బోరింగ్ యంత్రాలకు మద్దతు ఇస్తామని తెలిపారు. దిగుమతులకు తోడ్పడేలా మూడు కొత్త కెమికల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎంఎస్‌ఎంఈలకు రూ.10,000 కోట్ల ప్రత్యేక నిధి కేటాయించి చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక బలాన్నిస్తామని చెప్పారు. ఖాదీ, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం, యువతకు నైపుణ్య శిక్షణ, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల పెంపు ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. సేవారంగ విస్తరణే దేశాభివృద్ధికి కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.

బడ్జెట్ అంచనాల ప్రకారం 202627లో నాన్‌డెబ్ట్ రిసీట్స్ రూ.36.5 లక్షల కోట్లు, మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా ఉండనుంది. కేంద్రానికి నికర పన్ను ఆదాయం రూ.28.7 లక్షల కోట్లు అంచనా వేశారు. స్థూల మార్కెట్ అప్పులు రూ.17.2 లక్షల కోట్లు, నికర అప్పులు రూ.11.7 లక్షల కోట్లు ఉంటాయని తెలిపారు. ఆర్థిక లోటు జీడీపీలో 4.3 శాతంగా ఉండనుందని అంచనా వేయగా, అప్పు జీడీపీ నిష్పత్తి 55.6 శాతానికి తగ్గుతుందని పేర్కొన్నారు. మొత్తంగా బడ్జెట్ టెక్నాలజీ, స్వదేశీ తయారీ, నగరాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి సృష్టి వంటి అంశాలకు సమగ్ర ప్రాధాన్యం ఇచ్చిందని, దీని ద్వారా దేశం వికసిత్ భారత్ దిశగా వేగంగా ముందుకెళ్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

## మధ్యతరగతికి నిరాశ.. ఆదాయ పన్ను తగ్గింపు లేనట్టే..




**న్యూఢిల్లీ :** ఆదాయపు పన్ను తగ్గింపు కోసం ఆశగా ఎదురుచూసిన వేతన జీవులను ఈ బడ్జెట్ నిరాశపర్చింది. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్తగా పన్ను మినహాయింపులు ఏమీ ప్రతిపాదించలేదు. అయితే విధానపరమైన అంశాల్లో మాత్రం ఊరట లభించింది. ఐటిఆర్1, ఐటిఆర్2 ఫైలింగ్‌కు జూలై 31 వరకు గడువు ఇచ్చారు. అదేవిధంగా నాన్ ఆడిట్ బిజినెస్‌లు, ట్రస్ట్‌ల ఐటీ ఫైలింగ్‌కు ఆగస్టు 31 వరకు గడువు పెంచారు. రివైజ్డ్ ట్యాక్స్ రిటరన్స్‌ల దాఖలుకు గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31కి పొడిగించారు. ఇక 2025లో ప్రతిపాదించిన ఆదాయపుపన్ను చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి వాస్తవరూపం ధరించనున్నట్లు వెల్లడించారు. రికార్డ్ సమయంలో ఈ ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను పూర్తి చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఇందులో ఆదాయపు పన్ను నిబంధనలను మరింత సరళతరం చేసినట్లు చెప్పారు. కొత్త చట్టాన్ని త్వరలోనే నోటిఫై చేస్తామని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు, కొత్త చట్టాన్ని అర్థం చేసుకోని వారికి తగినంత సమయం ఇస్తామన్నారు. ఇక కొత్త, పాత పన్ను విధానాల్లోని స్లాబుల్లో ఎలాంటి మార్పులు లేవని ఆర్థిక మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టిటి) లో కీలక మార్పులు చేసింది. ఫ్యూచర్స్ మీద ఈ పన్నును 0.02 నుంచి 0.05 శాతానికి, ఇక ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.15 శాతానికి పెంచింది. షేర్ల బైబ్యాక్‌లను క్యాపిటల్ గెయిన్స్‌గా పరిగణించి పన్ను విధిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. విద్యార్థులు, టెక్ ప్రొఫెషనల్స్, రీ లొకేటెడ్ ఎన్నారైల వంటి చిన్న పన్ను చెల్లింపుదార్ల కోసం ఆరునెలలపాటు ఫారిన్ అసెట్స్ డిస్‌క్లోజర్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఎన్నారైల ఆస్తుల విక్రయంపై టిడిఎస్ కోసం కొత్త నిబంధన తీసుకొచ్చారు. స్థిరాస్తి విక్రయాలపై స్థానిక కొనుగోలుదారుల నుంచి టీడీఎస్ వసూలు చేస్తారు. విదేశీ టూర్ ప్యాకేజీలపై టిసిఎస్‌ను 5%, 20% నుంచి 2శాతానికి కుదించారు. మోటార్ యాక్సిడెంట్లలో వచ్చే క్లెయిమ్‌లపై ఆదాయపన్నును ఎత్తివేశారు.

## బ్యాంకింగ్ రంగంపై ఉన్నత స్థాయి కమిటీ

**న్యూఢిల్లీ :** వికసిత్ భారత్ విజన్‌లో భాగంగా బ్యాంకింగ్ రంగంపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ కమిటీ ద్వారా బ్యాంకుల విలీనం, ఈ రంగంలో కార్పొరేట్‌లు, విదేశీ పెట్టుబడుల అంశంపై పరిశీలించే అవకాశం ఉన్నటుల భావిస్తున్నారు. ఈ కమిటీ భారత బ్యాంకింగ్ రంగాన్ని సమగ్రంగా సమీక్షించడానికి, సంస్కరణల ఆధారిత వృద్ధి తదుపరి దశకు మార్గం సుగమం చేయడంపై అధ్యయనం చేస్తుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. భారత బ్యాంకింగ్ రంగం పటిష్టమైన బ్యాలెన్స్ షీట్లు, లాభదాయకతలో చారిత్రాత్మక గరిష్టాలు, మెరుగైన అస్సెట్ క్వాలిటీ( ఆస్తి నాణ్యత) 98 శాతం కంటే ఎక్కువ విస్తరణతో విలసిల్లుతోందని సీతారామన్ చెప్పారు. ఈ తరుణంలో బ్యాంకింగ్ సంస్కరణల ఆధారిత వృద్ధి మార్గంలో కొనసాగడానికి అవసరమైన చర్యలను భవిష్యత్ దృష్టితో మూల్యాంకనం చేయడానికి మనం సరైన స్థితిలో ఉన్నామన్నారు.

## సాగుకు 'ఎఐ' సాయం

### రైతుల కోసం 'భారత్ విస్తార్'




**న్యూఢిల్లీ :** 'భారత్ విస్తార్' పేరుతో ఎఐ బహుభాషా టూల్‌ను తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 'భారత్ విస్తార్' టూల్‌తో కేంద్ర ప్రభుత్వ అగ్రి స్టాక్ వెబ్‌సైట్లను, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) వ్యవసాయ మార్గదర్శకాలను, అధునాతన ఎఐ సిస్టమ్‌లను అనుసంధానిస్తారు. దేశ రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి 'భారత్ విస్తార్'లోని ఎఐ సమాచారం దోహదపడుతుందని మంత్రి తెలిపారు. పంటసాగు చేపట్టే క్రమంలో ముప్పును తగ్గించే విలువైన సలహాలను ఇది అందిస్తుందన్నారు. తద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులను ఎఐతో ఏకీకృతం చేయాలనే భారత సర్కారు విజన్ కూడా సాకారం అవుతుందన్నారు. రైతులు తమతమ ప్రాంతీయ భాషల్లోనే ఈ టూల్ ద్వారా వ్యవసాయ సూచనలను పొందొచ్చని ఆర్థిక మంత్రి చెప్పారు. పంటసాగు మెళకువలు, పంట ఉత్పాదకతను పెంచే సిఫారసులు, వాతావరణ సూచనలు, పంటల తాజా మార్కెట్ ధరలు వంటి సమాచారం మొత్తం 'భారత్ విస్తార్' టూల్‌లో ఉంటుందన్నారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం ప్రస్తుతం దేశంలో ఉన్న 46.1 శాతం మంది రైతులకు ఈ ఎఐ టూల్ ఉపయోగపడుతుందన్నారు.

**పశుపోషణ, ఫిషరీస్, డైరీ, పౌల్ట్రీ రంగాలకు వరాలు**

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.1,27,290 కోట్లు కేటాయించారు.రూ.10,466.39 కోట్లను వ్యవసాయ పరిశోధన, విద్యకు కేటాయించారు.ఫిషరీస్ (మత్స్యకార) రంగం కోసం 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్‌ల సమీకృత అభివృద్ధి. దేశంలోని సముద్ర తీర ప్రాంతాల మత్స్యకారులకు చేయూత. స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, రైతుల ద్వారా మత్స్యకారులకు మార్కెట్ లింకేజీ ఏర్పాట్లు.

పశుపోషణ, డైరీ, పౌల్ట్రీ రంగాల్లోని పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునికీకరణ కోసం 'క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకం' అమలు. సప్లై చైన్ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు డైరీ, పౌల్ట్రీ పరిశ్రమలకు చేయూత. తద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఏర్పాట్లు.

పలు రాష్ట్రాల్లో కొబ్బరి, చందనం (శాండల్ వుడ్, జీడిపప్పు, కొకోవా, అగార్ చెట్లు, బాదం, వాల్ నట్స్, పైన్ నట్స్ లాంటి పంటలను సాగు చేసే దిశగా రైతులకు ప్రోత్సాహం.జీడిపప్పు, కొకోవా ప్రాసెసింగ్‌లో భారత పరిశ్రమలు స్వయం సమృద్ధిని సాధించేలా ప్రోత్సాహం. ఈ విభాగంలో 2030 నాటికి భారతీయ బ్రాండ్ల ఆవిర్భావానికి చేయూత.


## 'ఆహారం, ఎరువులు, ఇంధన' కేటాయింపులపై కోత!



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి అత్యంత ప్రాధాన్యతా రంగాలైన ఆహారం, ఎరువులు, ఇంధన సబ్సిడీ కేటాయింపుల్లో కోత విధించింది. తాజాగా సమర్పించిన బడ్జెట్‌లో వీటిపై ప్రభుత్వ వార్షి సబ్సిడీ వ్యయం 4.47 శాతం తగ్గించిన కారణంగా రూ.4,10,495 కోట్ల మొత్తానికే చేరుకుందని అంచనా. 2026 కేంద్ర బడ్జెట్ ప్రకారం...2025 26 ఆర్థిక సంవత్సరానికి ఆహారం, ఎరువులు, ఇంధన సబ్సిడీ రూ.4,29,735 కోట్లకు అంచనా వేయబడింది. రాబోయే ఆర్థిక సంవత్సరం 2026 ఏప్రిల్ నుండి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ రూ.2,27, 629 కోట్లుగా అంచనా వేయబడింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనా కంటే తక్కువగా రూ.2,28, 154కోట్లుగా కేటాయింపు జరిగింది. ఆహార సబ్సిడీపై ప్రధాన వ్యయం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద ఉంది. కాగా ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.81 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఉచిత రేషన్ సప్లయ్ చేస్తోంది. రెండవ ప్రధాన వ్యయం ఎరువుల సబ్సిడీపై ఉంది. ఇది వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 1,70,805 కోట్ల కంటే తక్కువగా కుదించబడింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాగా రూ.1,86,460 కోట్లు. మొత్తం సబ్సిడీలో యూరియాపై రూ.1,16,805కోట్లు అంచనా వేయగా, యూరియా యేతర ఎరువులకు 2027 ఆర్థిక సంవత్సరం కాలంలో రూ.54,000 కోట్లుగా అంచనా వేయబడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం సవరించిన అంచనా రూ.15,121 కోట్లు ఉండగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి పెట్రోలియం సబ్సిడీ తక్కువగా రూ.12,085 కోట్లకు ఉంటుందని అంచనా వేయబడింది.

## కుప్పకూలిన సెన్సెక్స్

### స్టాక్ మార్కెట్స్‌పై 'పన్ను' ఎఫెక్ట్- 1500 పాయింట్లు పతనం




**ముంబయి:** దేశీయ మార్కెట్ సూచీలు భారీ న ష్టాల్లో ముగిశాయి. బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడంతో పాటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను (ఎస్‌టిటి)పెంచ డం మార్కెట్లను కుదిపేసింది. ఒక దశలో సెన్సెక్స్ 2000 పాయింట్లపైగా పతనమైంది. చివరకు సె న్సెక్స్ 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 495 పాయింట్లు నష్టపోయి 2 4,119 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ నేపథ్య ంలో ఆదివారం అయినప్పటికీ పని చేసిన మా ర్కెట్లు.. మదుపర్లకు నష్టాలను మిగిల్చాయి. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఫ్లాట్‌గా ట్రేడయిన సూచీలు.. ఎస్‌టిటి ప్రస్తావన తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి ఉండే సెక్యూరిటీలను కొనుగోలు, అమ్మకాలు చేసేటపుడు వ ర్తించే పన్ను ఎస్‌టిటి. దీనిని బడ్జెట్‌లో 0.02 శా తం నుంచి 0.05 శాతానికి పెంచారు. ఇక, ఆ ప్షన్స్ ప్రీమియంపై ఎస్‌టిటిని 0.15 శాతానికి పె ంచారు. ఆ బైబ్యాక్స్‌ను మూలధన లాభాలుగా ప రిగణిస్తూ పన్ను విధించారు. అక్రమ వినియోగానికి చెక్ పెట్టే ఉద్దేశంతో బైబ్యాక్ పన్నుల్లో ర్పును నిర్మలమ్మ ప్రతిపాదించారు. కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌లపై 22 శాతం, నాన్ కార్పొరేట్ ప్రమోట ర్ల బైబ్యాక్‌పై 30 శాతం పన్నులు విధించారు. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను భారీగా దెబ్బతీసింది.

**బ్రోకరేజీ స్టాక్స్ ఢమాల్**

సెక్యూరిటీస్ ట్రాన్జాక్షన్ ట్యాక్స్‌ను పెంచుతున్న ట్లు ప్రకటించడంతో బ్రోకరేజీ కంపెనీల షేర్లు అ మ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఉన్న ట్యాక్స్‌ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పె ంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో 18 శాతం వరకు ఆయా కంపెనీ ల షేర్లు పతనం అయ్యాయి. బిఎస్ఇలో మల్టీ క మొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసిఎక్స్) షేర్లు 18.08 శాతం పతనమై రూ.2,068కి చేరింది. గ్రో మాతృ స ంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ షేర్లు 13 శాతం పతనమై రూ.154కి చేరాయి. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం క్షీణించి రూ.296.10కి చేరింది. యాంజెల్ వన్ స్టాక్ కూడా 11.84 శాతం నష్టపోయి 2,237.95, ఆనంద్ రాఠీ అండ్ స్టాక్ బ్రోకర్స్ 8.5 శాతం క్షీణించి రూ.532.15కి చేరింది. ఆఖరికి బిఎస్ ఈ లిమిటెడ్ షేరు విలువ కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. ఎన్ఎస్ఇలో దీని విలువ 15శాతం కో ల్పోయి రూ.2,377కు చేరింది. నిఫ్టీ సూచీలో మ్యాక్స్ హెల్త్‌కేర్, విప్రో, టిసిఎస్, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్ షేర్లు లా భాల్లో ముగియగా.. హిందాల్కో, ఎ స్‌బి ఐ, ఓఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి.

# ప్రజల కోసం కలం పట్టిన 'వట్టికోట'

తెలంగాణ సాహితీ చరిత్రలో ప్రజాసాహిత్యానికి పునాదులు వేసి, దానికి స్పష్టమైన దిశనిచ్చిన అరుదైన రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. ఆయన ఒక రచయిత.. పాత్రికేయుడు.. ప్రచురణకర్త.. ఉద్యమకారుడు.. కమ్యూనిస్టు నేత... అన్నిటినీ మించి, ప్రజాజీవితంతో విడదీయరాని బంధం ఏర్పరచుకున్న అభ్యుదయవాది. సాహిత్యం అలంకారంగా కాక ప్రజల జీవితాన్ని ప్రతిబింబించే ఆయుధంగా ఉండాలన్న నమ్మకాన్ని తన జీవితం మొత్తంలో ఆచరణలో పెట్టిన ప్రజల మనిషి. ప్రజల కోసం కలం పట్టిన మానవతావాది వట్టికోట 1915 నవంబరు 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారం గ్రామంలో సింహాద్రమ్మ, రామచంద్రాచార్యులు దంపతులకు జన్మించాడు. చిన్ననాటి నుంచే కష్టాలను అనుభవించాడు. తండ్రి చిన్న వయసులోనే మరణించడంతో కుటుంబ భారం అతని భుజాలపై పడింది. హోటల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన వట్టికోట, పొట్టకూటి కోసం శ్రమిస్తూ కూడా చదువును వదల్లేదు. సీతారామారావు అనే ఉపాధ్యాయుడి వద్ద వంటపని చేస్తూ చదువు, సాహిత్యాభ్యాసం కొనసాగించాడు. ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు భాషలను స్వయంకృషితో నేర్చుకోవడం అతని జీవితంలో కీలక మలుపు. అదే స్వయంకృషి అతన్ని సామాన్య కార్మికుడి స్థాయి నుంచి ప్రజాసాహిత్య నాయకుడిగా ఎదగడానికి దోహదపడింది. భాషాపరిజ్ఞానం వట్టికోటకు పత్రికా రంగంలోకి ప్రవేశానికి మార్గం చూపింది. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన 'గోలకొండ' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పని చేస్తూ, సమకాలీన రాజకీయ–సామాజిక పరిణామాలను దగ్గరగా గమనించాడు. అక్కడే అతని ఆలోచనలు మరింత పదునెక్కాయి. రచయితగా మాత్రమే కాకుండా ప్రచురణకర్తగా మారి, ప్రజల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేశాడు. ప్రజలకు పుస్తకాలు అందుబాటులో ఉండాలి అన్న భావన అతని జీవిత ధ్యేయంగా మారింది. పుస్తకాలను ప్రచురించడం మాత్రమే కాదు, ఆ పుస్తకాలను ఊరూరా తిరిగి విక్రయించడం ద్వారా చదువును ప్రజల్లోకి తీసుకెళ్లారు. సురవరం ప్రతాపరెడ్డి 'హైందవ ధర్మవీరులు', కాళోజీ నారాయణరావు 'నా

> తెలంగాణ చైతన్యం కోసం వట్టికోట 'దేశోద్ధారక గ్రంథమాల'ను స్థాపించి 35 పుస్తకాలు ప్రచురించాడు. 'తెలంగాణ' పేరుతో సంపుటాలు వెలువరించి, ప్రాంతీయ చరిత్ర, సంస్కృతిని ప్రజల ముందుకు తీసుకొచ్చాడు. దురదృష్టవశాత్తూ ఇవన్నీ నేడు పూర్తిగా అందుబాటులో లేకుండా పోవడం మన సాహిత్య విపత్తే. గ్రంథాలయోద్యమంలో వట్టికోట పాత్ర మరపురానిది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు, సంచార గ్రంథాలయాలు స్థాపించి, తలమీద తట్టలో పుస్తకాలు పెట్టుకుని ఊరూరా తిరుగుతూ ప్రజలకు ఆధునిక సాహిత్యాన్ని చేరువ చేశాడు. అందుకే మిత్రులు అతన్ని 'సంచార గ్రంథాలయం' అని పిలిచేవారు.




గొడవ' వంటి రచనలు తొలిసారిగా వెలుగు చూసింది ఇక్కడే. వట్టికోట కొంతకాలం 'ధర్మరాజు' అనే కలంపేరుతో కూడా రచనలు చేశారు.

**'ప్రజల మనిషి' .. రాజకీయ నవలకు నాందీవాక్యం**

1955లో వెలువడిన 'ప్రజల మనిషి' వట్టికోటను తెలుగు సాహిత్యంలో శాశ్వతంగా నిలిపిన నవల. ఇది ఒక కథ. సమాజపు పరిణామ చరిత్ర. నిజాం పాలనలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య దోపిడీ ఎలా పనిచేసిందో, ఆ దోపిడీకి ఎదురుగా సామాన్యుడు ఎలా ఎదిగాడో ఈ నవల అత్యంత సహజంగా చూపిస్తుంది. కంఠీరవం అనే సాధారణ వ్యక్తి ప్రజల మనిషిగా మారే క్రమం నవలలో అద్భుతంగా చిత్రికరించాడు రచయిత. ఇక్కడ కంఠీరవం ఒక్కసారిగా నాయకుడిగా మారడు. అనుభవాల ద్వారా, అవమానాల ద్వారా, పోరాటాల ద్వారా అతని చైతన్యం పెరుగుతుంది. ఇదే వట్టికోట రచనల ప్రత్యేకత. నాయకులు ఆకాశం నుంచి దిగివచ్చినవారు కారు.. సమాజంలోనే రూపుదిద్దుకుంటారు. 'గంగు' నవలలో నాగభూషణం, అంతమ్మ, సూజాత, నీలవేణి వంటి పాత్రలు కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షితమయ్యే ప్రక్రియను వట్టికోట అత్యంత సహజంగా చూపించారు. సిద్ధాంతం బోధగా కాకుండా, జీవన అనుభవంగా మారే విధానాన్ని ఆయన కథన శైలిలో చూస్తాం. నిజాం పాలనలో ప్రజల పక్షాన నిలబడినందుకు వట్టికోట అనేకసార్లు జైలుపాలయ్యారు. ఆ జైలు జీవితం ఆయనకు మరో పాఠశాల. 'జైలు లోపల' కథల్లో నేరం – శిక్ష అనే భావనను ఆయన మానవీయంగా విశ్లేషించారు. నేరస్తులు సహజంగా చెడ్డవాళ్లు కాదని, సమాజపు పరిస్థితులే వారిని అలా మార్చుతాయని వట్టికోట నమ్మకం ఈ కథల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

వట్టికోట సాహిత్యాన్ని, ఉద్యమాలను వేరువేరుగా చూడలేం. ఆయన జీవితంలో రెంటికీ సమ ప్రాధాన్యం ఉంది. వట్టికోట జీవితం సాహిత్యం.. ఉద్యమం మధ్య ఉన్న లోతైన సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఆయన దృష్టిలో సాహిత్యం వినోదం కాదు, అలంకారం కాదు. అది పీడితుల పక్షాన నిలబడి ప్రశ్నించే శక్తి. అధికారానికి తలవంచని సాహిత్యమే నిజమైన సాహిత్యం అన్న భావనను ఆయన తన రచనల ద్వారా నిరూపించాడు. సాహిత్యం బాధలను వర్ణించడానికే పరిమితం కాకుండా, ఆ బాధలను ప్రశ్నలుగా మార్చి, ప్రశ్నలను ఉద్యమంగా మలచాలని ఆయన విశ్వసించాడు. అందుకే ఆయన రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయి. ఆంధ్ర మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఆయన ప్రజలను సంఘటితం చేశారు. కడివెండిలో దొడ్డి కొమరయ్య ఊరేగింపుపై జరిగిన కాల్పుల తర్వాత నిజనిర్ధారణకు పద్మజానాయుడును వెంట తీసుకుని వెళ్లడం ఆయన ధైర్యానికి ఉదాహరణ. నాటి తెలంగాణ సమాజం రెండు వైపుల నుంచి నలిగిపోతుంది. ఒకవైపు బ్రిటిష్ వలసవాదం, మరోవైపు భూస్వామ్య వ్యవస్థ. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అగ్రభాగంలో ఉన్న పిరమిడ్ నిర్మాణంలో అనేకస్థాయిల దోపిడీ పనిచేసింది. సారవంతమైన భూమి, రెండు ప్రధాన నదులు ఉన్నా, ఆధునిక నీటిపారుదల సౌకర్యాలు లేని పరిస్థితి. విద్య, వైద్యం, రవాణా అవకాశాలు లేని సమాజం. ఈ పరిస్థితుల్లో మానసిక, శారీరక శ్రమల మధ్య ఉన్న అసహజ విభజనను చెరిపివేయాల్సిన అవసరాన్ని వట్టికోట ముందుగానే గుర్తించారు. ఆయన దార్శనికతకు ఇదో ఉదాహరణ మాత్రమే. ఇరవయ్యవ శతాబ్దపు తొలి అర్ధభాగంలో, తెలంగాణ వంటి వెనుకబడిన ప్రాం తం నుంచి వట్టికోట వైతాళికుడిగా ఎదగడం సాధారణ విషయం కాదు. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టడం మినహా ఆయనకు ఎలాంటి వారసత్వ ప్రయోజనాలూ లేవు. ఉన్నత విద్య లేదు, ఆస్తి లేదు, అధికార సంబంధాలు లేవు. అనన్యసాధ్యమైన కృషి.. అంతులేని పట్టుదల మాత్రమే ఆయనకు ఉన్న నిధి. హోటల్ కార్మికుడిగా ప్రారంభమైన జీవితం రచయితగా, ప్రచురణకర్తగా, ఉద్యమకారుడిగా ఎదగడం తెలంగాణ సాహిత్య చరిత్రలో ఒక అపూర్వ ఉదాహరణ. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల వరకూ ఆయన చేసిన సేవలు విస్తృతమైనవి. 1961 ఫిబ్రవరి 5న కేవలం 46 ఏళ్ల వయసులో వట్టికోట ఆళ్వారుస్వామి మరణించారు. కానీ ఆయన కలం ఆగలేదు. తెలంగాణ ప్రజాసాహిత్యానికి ఆయన వేసిన పునాదులు ఈ రోజుకీ జీవిస్తూనే ఉన్నాయి. భూస్వామ్య, రాచరిక సమాజాల నిద్రను భంగం చేసిన వృత్తి వైతాళికుడు వట్టికోట. ప్రజల కోసం కలం పట్టిన ఈ మహానుభావుడు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాడు.

> వట్టికోట కేవలం నవలా రచయిత మాత్రమే కాదు. 'కనువిప్పు' నాటికతో పాటు పద్నాలుగు ఏకాంకికలు రాసి రంగస్థల సాహిత్యానికీ సేవ చేశాడు. 'అంతా ఏకమైతే', 'ఆలు కూలి', 'గాలి పటం', 'పరిసరాలు', 'పరిగె' వంటి కథలు తెలంగాణ ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే అద్దాల్లాంటివి. 1940ల నాటి రాజకీయ–సామాజిక ఉద్యమాల నేపథ్యంలో 'గంగు' నవల రాసి, ఆ కాలపు పోరాటాలను సాహిత్య చరిత్రలో నిలిపాడు.

– సత్యశ్రీ

## దాశరథి



## అగ్నిధారకు అర్హుడు

వట్టికోట జీవితం అనుభవాల పాఠశాల. పేదరికం, అణచివేత, కార్మికుల బాధలు, రైతుల కన్నీళ్లు.. ఇవన్నీ అతని రచనలకు ప్రాణం పోశాయి. ఈ అభ్యుదయ దృక్పథం నాటి నిజాం పాలనకు నచ్చలేదు. ప్రజల పక్షాన నిలబడి రాస్తున్నాడనే కారణంతో అతన్ని జైలుకు నెట్టారు. 1948లో దాశరథి కృష్ణమాచార్యతో కలిసి నిజామాబాద్ జైలులో మూడు నెలలు గడిపాడు. ఆ జైలు జీవితం ఇద్దరి మధ్య గాఢమైన మైత్రికి నాంది పలికింది. దాశరథి తన ప్రసిద్ధ కావ్యమైన 'అగ్నిధార'ను వట్టికోటకు అంకితం చేస్తూ, ఆయనను త్యాగమూర్తిగా, పేద జనులకు ఆత్మీయ మూర్తిగా ప్రశంసించాడు.

దాశరథి తన కవితలో, పన్నెండు మంది ఆళ్వార్లు ఉంటే, పదమూడో ఆళ్వార్‌గా వట్టికోటను అభివర్ణిస్తాడు.

**'దేవునిపై భక్తిలేకున్నా**
**జీవులపై భక్తి ఉన్నవాడు;**
**తాను తినకుండా**
**ఇతరులకు అన్నం పెట్టగలవాడు.**
**జైలు గోడల మధ్య**
**కేళీవిలాసంగా ఉండగలవాడు'** అంటూ వట్టికోటను మన కళ్ల ముందు ఉంచుతాడు.

**'అతని కలం వజ్రాయుధం,**
**అతనిది న్యాయపథం;**
**అతన్ని మృత్యువు ప్రేమించింది'** అంటూ బాధపడతాడు. అదే సమయంలో..

**'అయినా ఎంతదూరం పోతాడతడు?**
**మన హృదయాల మల్లెపందిళ్లకింద**
**దోహదక్రియ జరుపుతుంటాడు.**
**నీడలా వీడక మనవెంట వుండి**
**వేడివేడి ఆలోచనల పాయసం అందిస్తాడు.**
**ఎక్కడ దుఃఖం వున్నా, బుద్ధుడిలా**
**ఏగి, తోచిన సాయం చేస్తాడు.**
**అతడు ప్రజల మనిషి;**
**అతడంటే దుష్టులకు కసి**
**అబద్ధాసురుని పాలిటి తల్వార్ ఆళ్వార్'** అంటూ నివాళులర్పించారు.

**'అతనిదే సార్థకమైన జీవితం**
**అతనికి అగ్నిధార అంకితం'** అంటూ తన పుస్తకాన్ని ఎందుకు వట్టికోటకు అంకితమిచ్చాడో వివరిస్తాడు. వట్టికోటను ఇంత కంటే గొప్పగా ఎవరు ఆవిష్కరించగలుగుతారు? మహాకవి శ్రీశ్రీ తన 'మహా ప్రస్థానం' పుస్తకాన్ని కొంపెల్ల జనార్ధనరావుకు అంకితం ఇవ్వడంలో చూపిన విజ్ఞతను, వట్టికోటను ఎన్నుకోవడంలో దాశరథి కనబరిచాడు.

## చదవాల్సిన పుస్తకం

### అస్తిత్వపు ప్రతీక..




ఇప్పుడు కవిత్వం రాయాలంటే కవిపుత్రులు కావలసిన పని లేదు. వంద కవితా పుస్తకాలను, నిఘంటువులను వెతికి, చదవాల్సిన అవసరం లేదు. అతిలోక సుందరీ, వెన్నెలను తాగే చకోర పక్షుల వర్ణనలు అస్సలే అంటించుకునే ఆసక్తే లేదు. గొర్ల కాపర్లు, కుమ్మరులు, కమ్మరులు, మాదిగలు, మాలలు..... ఇలా పూర్వం చేసిన పనికి ప్రతిఫలాలు అందక పోగా, అవర్ణులుగా, కడజాతి వాళ్లుగా చూపించబడిన ఉత్పత్తి సమూహమే నేడు అక్షరాన్ని కంటుంది. మట్టిలో మునివేళ్లతో దిద్దిన అక్షరమే కవితాకాశంలో సింగిడై పూస్తుంది. నమ్మకాలకు కట్టు కథలల్లి మూఢనమ్మకాల వైపు ప్రజను నడిపించిన ఈ నేల మీద అస్తిత్వపు ప్రదర్శన చేయడానికి శ్రమ సంస్కృతి నుంచి పుట్టిన కవి సమయాలు కొత్త కవితా శిల్పాన్ని రూపు కడుతున్నవి. మూడు మూరల కర్రతో, ముప్పై గొర్రెల సోపతి గాడు అక్షరం నేర్చి కలం చేతబట్టి చరిత్రను రాసుకుంటున్నాడు. బిడ్డను కంటున్న గొర్రె తొలిచూలు ప్రేమ, గుండె గొంతుక అల్లుకున్న తొలి పాటనే కవిత్వం అయ్యింది. గాయపడిన వేల తరాల గుండెలలో పాడని పాటల పల్లవి కవిత్వంగా పరివ్యాప్తి చెందుతుంది. తన నాన్న కష్టం చేసి కొన్న పొలం, బ్యాచిలర్ జీవితం, అవినీతి కుంభకోణాలు, అమ్మ, నాన్న, ఆడిబిడ్డ, నాయినమ్మ, అమ్మమ్మ, అడ్డమీది కూలీలు, కట్టెల పొయ్యి, తన ఊరు, చెప్పులు, నల్లమలలో ప్రకృతి విధ్వంసం, నిరుద్యోగి తాపత్రయం, పంట కాలువలు, తెలంగాణ సచివాలయం, విమానం, సేవా దృక్పథం, కుల వివక్ష...... ఇలా కుటుంబంలో, పేదరికంలో, మానవ సంబంధాల్లో, ప్రకృతిలో, శ్రమలో, ఉత్పత్తిలో, ఉద్యోగంలో, రాజకీయాల్లో భాగమైన శూద్రుడు చేపట్టిన కవిత వస్తువులివి. వెంకటేష్ ఎత్తుకున్న మొదటి కవితనే అతని దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. **'ఆరోజు రాకముందే'** అనే శీర్షికతో మొదలుపెట్టాడు.

**'భూమి మీదికి రాకముందు**
**ఒకే శరీరంగా రెండు గుండెలుగా**
**తొమ్మిది నెలలు అమ్మలోనే నేను!'**

కవితా వస్తువును ఎన్నుకోవడంలో కవి వ్యక్తిత్వం దాగివుంది. తనకు భూమికనే అమ్మ, కాబట్టి తన తనువుకు ప్రాణం పోసిన తల్లి గర్భాన్ని గుర్తు చేసుకున్నాడు. వెంకటేష్ తనను కదిలించి వేదనకు గురిచేసిన విషయాన్ని మనందరి అనుభవంలోకి తెచ్చాడు. కవి ప్రతిభ ఇక్కడే వ్యక్తం అవుతుంది. వస్తువును నిర్వహించిన పద్ధతితో పాటు అందరినీ గతంలోకి తోసేసి, ఆశ్చర్యంతో ఆలోచింపజేసే తీరులో శిల్ప నైపుణ్యం ఉంది.

**'కొమ్ములు తిరిగిన**
**ముప్పై గొర్రె పిల్లలనమ్మి**
**నా చెవుల కమ్మలమ్మి తొలిచూరి మనవడవని ఆరివారంగ అమ్మమ్మ పెట్టిన**
**వెండి మొలతాడునమ్మి**
**కొన్న పొలం కొడుకా!**
**......**
**పొలం పోతే**
**పోయేది పట్టా బుక్కులో**
**నెంబర్ కాదురా**
**మీ నాయన అస్తిత్వం కూడా**

**'చెమట తీసి కొన్న పొలం కొడుకా'** అన్న కవితలో కవి తన మూలాన్ని చెప్పకనే చెబుతూ, భూమి ఎవరి చేతుల్లో ఉంటే వాళ్ల చేతుల్లోనే రాజ్యం ఉంటుంది. అలాగే సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో కూడా వాళ్లదే ఆధిపత్యం. ఈ బాధంతా ముఖ్యంగా ఈ మూడు వేల సంవత్సరాల మానవ ఆధిపత్య పరిణామ క్రమంలో 1970ల నుంచి ప్రపంచంలోని మెజారిటీ మానవులు తెలుసుకుంటున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో తమకు పాలక స్థానం కావాలంటే 'భూమి' ప్రధానం అని వెంకటేష్కు వాళ్ళ నాయన చెప్పాడు. వెంకటేష్ దాన్ని కవిత్వం చేశాడు. అంతేకాదు తన చదువుకు, అక్క పెళ్ళికి, సంసారం సాధనీకే, బుక్కెడు బువ్వకు, సమాజంలో గౌరవానికి, ఇలా అన్నింటికీ భూమి మొదటి మెట్టు. అందుకే నాయన తనకు కురుమకుల వారసత్వంగా వచ్చిన గొర్రెలను మేపుతూ గొర్రె పిల్లలను అమ్మి కూడా భూమినే కొన్నాడు. దీన్ని కవి ఈ దేశ సాహిత్యంలో అస్తిత్వంగా మలిచి చెప్పాడు.

**'మా ఊర్లలో**
**గుళ్ల ముందు బిచ్చగాళ్ళు ఉండరు కానీ**
**ప్రజల పన్నులతో బ్రతికే పది భవంతులున్నాయి**
**అక్కడ మాత్రం కొంతమంది బిచ్చగాళ్ళున్నారు**
**....................**
**నా దేశంలో**
**దేవుని గుళ్ల ముందు ఉండే బిచ్చగాళ్ల కంటే**
**రాజ్య భవంతుల్లో ఉండే బిచ్చగాళ్లే ఎక్కువ**
**వాళ్లేమో ఉన్న వాళ్ళ దగ్గర అడుక్కుంటుంటే**
**వీళ్లేమో లేని వాళ్ళ దగ్గరనే అడుక్కుంటారు.** అంటూ **'అవినీతిపరులకు మాత్రమే'** అనే కవితలో గల్లీ నుండి ఢిల్లీ దాకా ఈ దేశంలో పేరుకుపోయిన అవినీతిని, పేర్చిన రాజకీయ నాయకులను బిచ్చగాళ్ల కంటే తక్కువ చేసి విమర్శించాడు. ఇందులో కవి యొక్క తెగింపు కనిపిస్తుంది. వెంకటేష్ కవిత్వంలో వస్తు వైవిధ్యం ఉంది. కవిత్వంలో చేయితిరిగిన రచయితలకు ఉండే పరిపక్వత కవిలో, కవిత్వంలోని పాదాలలో వ్యక్తం అవుతుంది. ఇదంతా వైవిధ్యం వలననే సాధ్యమైంది. మనిషిలో, జీవితంలో, చదువులో, రచనలో వైవిధ్యం ఉంది. అందుకే అతని కవిత్వంలో కూడా సింగిడి తీరుగా వస్తు వైవిధ్యం '**వన్నెరుమాలు**' సిగలో ఒదిగిపోయింది.

– పులుమద్ది సత్యం
9441000537

## మునిమాణిక్యం.. మధ్యతరగతి జీవితానికి సాహిత్య స్వరం

తెలుగు సాహిత్య చరిత్రలో ఇరవయ్యవ శతాబ్దపు తొలి అర్ధభాగం ఒక కీలకమైన దశ. ఈ కాలంలోనే సామాజిక మార్పులు, మధ్యతరగతి విస్తరణ, ఆధునిక విద్య ప్రభావం, కుటుంబ వ్యవస్థలో మారుతున్న విలువలు కథాసాహిత్యానికి ప్రధాన అంశాలుగా మారాయి. ఈ పరిణామాలన్నిటినీ తన రచనల ద్వారా సహజంగా, హాస్యంతో కూడిన లోతైన మానవీయ దృష్టితో ప్రతిబింబించిన రచయితలలో మునిమాణిక్యం నరసింహారావు ప్రత్యేకంగా నిలుస్తారు. ఆయన కథలు చదివినప్పుడు నవ్వు పుట్టినా, ఆ నవ్వు వెనుక దాగి ఉన్న జీవన సత్యం పాఠకుడిని ఆలోచనలో ముంచుతుంది. అందుకే నరసింహారావు కేవలం హాస్య రచయితగా మాత్రమే నిలిచిపోరు.. మధ్యతరగతి జీవన తత్వాన్ని కథలుగా మలిచిన జీవన తత్త్వవేత్తగా కూడా అందరికీ చిరకాలం గుర్తుండిపోతారు. నరసింహారావు 1898 మార్చి 15న తెనాలి తాలూకా సంగం జాగర్లమూడిలో జన్మించారు. తల్లిదండ్రులు వెం కాయమ్మ, సూర్యనారాయణ. గ్రామీణ వాతావరణంలో పెరిగిన ఆయన జీవితంలో చిన్ననాటి నుంచే కష్టసుఖాల మిశ్రమం కనిపిస్తుంది. చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు ఆయన ముందడుగు వేయడాన్ని కొంతవరకు అడ్డుకున్నాయి. తెనాలిలో ఇంటర్మీడియెట్ వరకు చదివిన తర్వాత డిగ్రీ చదవడానికి తాహతు లేకపోయిన సమయంలో, కొండా వెంకటప్పయ్య వంటి మేధావి సహాయం అందడం ఆయన జీవితానికి మలుపు. ఆ సహకారంతో బిఎ పూర్తి చేయగలిగారు. ఈ సంఘటనే ఆయన రచనలలో తరచుగా కనిపించే సామాన్యుడి జీవితంలో ఒక చేయూత ఎంత కీలకం అనే భావనకు మూలంగా భావించవచ్చు. వృత్తిరీత్యా ఆయన బందరు హిందూ హైస్కూలులో ఉద్యోగం చేశారు. అనంతరం ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణిలో ఉద్యోగిగా పనిచేశారు. ఈ ఉద్యోగాలన్నీ ఆయనను సమాజానికి మరింత దగ్గర చేశాయి. విద్యార్థులు, శ్రోతలు, సహోద్యోగులు.. అలా ఎంతో మంది జీవితాలను దగ్గరగా గమనించే అవకాశం ఆయనకు లభించింది. ఈ అనుభవాలే ఆయన కథలకు జీవం పోశాయి. 'మునిమాణిక్యం కథలు' చదువుతుంటే అవి రచయిత కల్పనలా కాకుండా మన చుట్టూ ఉన్న మనుషుల జీవితం లాగానే అనిపిస్తాయి. అందుకు కారణం ఆయన పరిశీలన శక్తి, అనుభవాల పునాది. మునిమాణిక్యం సాహిత్య జీవితంలో ఒక మైలురాయి ఆయన రచించిన తొలి నవల 'టీకప్పులో తుఫాను'. ఈ నవలలోనే తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిన పాత్ర 'కాంతం' తొలిసారిగా ప్రవేశిస్తుంది. కాంతం అనేది కేవలం ఒక మహిళా పాత్ర కాదు... అది ఒక దాంపత్య జీవన ప్రతీక. పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన కాంతం పాత్రలోని చురుకుదనం, చమత్కారం, ప్రేమ, చిన్నచిన్న అలకలు వంటి లక్షణాలన్నీ తెలుగు పాఠకుల హృదయాలను గెలుచుకున్నాయి. కథలు ఇంత సహజంగా ఉండటానికి కారణం, అవి రచయిత ఊహలో పుట్టినవి కాకుండా, నిజ జీవిత దాంపత్య అనుభవాల నుంచి రూపుదిద్దుకున్నవే.



నరసింహారావు భార్య కాంతం ఆయన రచనలకు ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితంలోని చిన్న సంఘటనలు, మాటల తీర్లు, దాంపత్య జీవనంలోని సరదా క్షణాలన్నింటినీ ఆయన కథలుగా మలిచారు. అందుకే 'కాంతం కథలు' కాలాన్ని దాటినా పాతబడలేదు. ఈ కథల్లో పెద్ద సంఘటనలు ఉండవు; కానీ చిన్న సంఘటనల్లోనే జీవితపు సారాన్ని పట్టుకోవడమే మునిమాణిక్యం గొప్పతనం. భర్త–భార్యల మధ్య జరిగే సాధారణ సంభాషణ కూడా ఆయన చేతిలో కథగా మారుతుంది. ఆ కథలో హాస్యం ఉన్నా, దాంపత్య గౌరవం, పరస్పర అవగాహన అనే విలువలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆకాశవాణితో ఆయనకున్న అనుబంధం మరో ముఖ్యమైన అంశం. ఆయన కథలలో కొన్ని రేడియో నాటకాలుగా రూపాంతరం చెందాయి. ఒక సందర్భంలో ఆయన కాంతం కథను రేడియో నాటకంగా రాయగా, ఆయన కుమార్తె కాంతంగా పాత్రధారణ చేసి శ్రోతలను ఆకట్టుకుంది. ఇది మునిమాణిక్యం కుటుంబం, సాహిత్యం రెండూ ఒకటిగా మిళితమై ఉన్నాయనడానికి చక్కని ఉదాహరణ. ఆయన రచనలు కుటుంబ జీవితానికే కాకుండా, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ప్రజలకు చేరాయి.కాంతం మరణం నరసింహారావు జీవితంలో తీవ్రమైన విషాదాన్ని మిగిల్చింది. జీవితానికి ఆధారంగా నిలిచిన వ్యక్తిని కోల్పోవడం ఆయనను తీవ్రంగా కుంగదీసింది. ఆ విషాదంలోనే ఆయన పెద్ద కుమార్తె రుక్కుతల్లి మరణం కూడా సంభవించడం ఆయనకు తీరని దెబ్బ. ఈ దుఃఖాన్ని తట్టుకోవడానికి ఆయన మరింతగా రచనల్లో నిమగ్నమయ్యారని చెప్పవచ్చు. రచన ఆయనకు ఒక తాత్కాలిక ఆశ్రయంగా మారింది. అనంతరం ఆయన రాజ్యలక్ష్మి ని రెండవ భార్యగా చేసుకున్నారు. ఈ సంఘటనలు కూడా ఆయన రచనలలో మానవ జీవితంలోని అనిశ్చితిని, నష్టాన్ని, తట్టుకునే శక్తిని ప్రతిబింబిస్తాయి.

నరసింహారావు సాహిత్యానికి ప్రధాన లక్షణం హాస్యం. కానీ అది ఉపరితల హాస్యం కాదు. ఆయన హాస్యం జీవన హాస్యం. మధ్యతరగతి సంసారంలో ఉండే ఆర్థిక ఒత్తిళ్లు, బంధుత్వ సంబంధాలు, ఆడంబరాలపై వ్యంగ్యం... ఇవన్నీ ఆయన కథల్లో చిరునవ్వుగా వ్యక్తమవుతాయి. ఆయన రచనలలో మనం నవ్వుతాం; కానీ ఆ నవ్వు మనల్ని మనమే చూసుకునేలా చేస్తుంది. ఇది మునిమాణిక్యం హాస్య రచనల ప్రత్యేకత. తెలుగు హాస్య రచయితలలో నరసింహారావుకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఎక్కడైనా వినిపించిన చమత్కార వాక్యం, జీవితంలోని సరదా సంఘటన ఆయన మనసును ఆకర్షిస్తే, దానిని తన భాషలో మలిచి పాఠకులకు అందించేవారు. భాషను కొద్దిగా తమాషాగా మార్చి, పాత్రల నోటి మాటలుగా ప్రవహింపజేయడం ఆయనకు ప్రత్యేకమైన నైపుణ్యం. ఈ భాషా ప్రయోగాలే ఆయన కథలను సహజంగా, సజీవంగా నిలబెట్టాయి. 1973 ఫిబ్రవరి 4న నరసింహారావు కన్నుమూశారు. కానీ ఆయన సృష్టించిన కాంతం ఇంకా జీవిస్తోంది. తెలుగు పాఠకుల ఇళ్లలో, వారి దాంపత్య సంభాషణల్లో, చిన్న చిన్న చమత్కారాల్లో మునిమాణిక్యం ఆత్మ ఇంకా పలుకుతూనే ఉంది. కాలం మారినా, సమాజం మారినా, మధ్యతరగతి జీవనంలోని మౌలిక భావాలు పెద్దగా మారలేదు. అందుకే మునిమాణిక్యం కథలు నేటికీ సమకాలీనంగా అనిపిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, నరసింహారావు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక అధ్యాయం. ఆయన రచనలు పెద్ద సిద్ధాంతాలు చెప్పవు... చిన్న జీవిత సత్యాలను చిరునవ్వుతో మన ముందుంచుతాయి. అదే ఆయన సాహిత్య విజయం. మధ్యతరగతి జీవితం ఎంత సాధారణంగా కనిపించినా, అందులో ఎంత సాహిత్య సౌందర్యం దాగి ఉందో చూపించిన రచయితగా మునిమాణిక్యం నరసింహారావు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

ఈ వారం కవితలు

## పుస్తకం ఎందుకో చప్పబడింది..!

నా పుస్తకం కన్నీరు పెట్టుకుంది
ముఖపుస్తకం ముచ్చట్లతో కాలం
నా వైపు చూడలేదని బెంగపడింది
ఒకప్పుడు వెతుక్కుని వచ్చే స్నేహం
ముఖం చాటేసిందని ఏడ్చుకుంది
గారాబంగా నిమిరే చేతుల్లో
అద్దం ఆకర్షణై నిలిచిపోయాక
దుమ్ము నిండిన అరలో ఇమడలేక
నా పుస్తకం కుమిలి కుమిలి
ఏడ్చింది


పేరాలు లెక్కన చదివి హత్తుకుని
భావాన్ని పంచుకునే రోజులు
పోయి
అంటరానితనమే తనకు దిక్కైపో
యాక
నా పుస్తకం పొర్లి పొర్లి అంగలా
ర్చింది
సర్దుకునే మంచి రోజులు పోయాక
కేజీల లెక్కన అమ్ముకునే తీరు
తిష్ట వేసి కూర్చుందని బోరుమంది

ఇప్పుడు పుస్తకం కనుమరుగైంది
పాఠకలోకం వెలేసిన దుఃఖంతో
పాతాళంలో కూరుకుపోయింది
నా పుస్తకం సమాధి కాబడుతోంది
పుస్తక తరం మారిపోయిందని
తెలిసి
ఇప్పటికీ ఆదరిస్తున్న అతి కొద్దిమం
దికి
సాష్టాంగ నమస్కారం చేసుకుంది

– నరెద్దుల రాజారెడ్డి
9666016636

## సృష్టి ధర్మం

మొదటి నక్షత్రం పేరు తెలియకముందే
సృష్టికి వెనుక ఉన్న ఉద్దేశం జాగృతమై ఉంది
శబ్దం లేదు.. హడావుడి లేదు..
ఒక స్వచ్ఛమైన కోరికలా...
సహజమైన క్రమంలా..
నిశ్శబ్దంగా, ఖచ్చితంగా కొనసాగింది
విశ్వ సృష్టి అనేది అస్తవ్యస్తంగా ఉప్పొంగి పుట్టలేదు.
ప్రతి అంశం చాలా ఆలోచించి, కొలిచి దిద్దుకుంది
వెలుగు ప్రతి మలుపునూ జాగ్రత్తగా తీర్చినట్టు..
నిశ్శబ్దం మధ్య ఖాళీలను సంగీతంలా సర్దినట్టు..
ప్రతి సహజ నియమం... ఓ అనంతమైన సహనం
ఈ రూపకల్పనలో ఎక్కడా చీలికలు లేవు
మనకు తెలియని లోతులు మాత్రమే ఉన్నాయి.
విశ్వం మొత్తం వృత్తాలమయం...
అవి గుర్తులు... కాలానికి శాశ్వతమైన ప్రతిజ్ఞలు.
చైతన్యం వాటిని చదవగలిగే వరకు
ఎవరికి తోచిన అర్థం వారు చెప్పుకోవచ్చు..



ఎవరికి నచ్చిన సిద్ధాంతాన్ని ప్రకటించుకోవచ్చు..
కానీ, మనిషి మాదిరి..
ఈ విశ్వంలో ఏదీ దారి తప్పదు.
ఏ అణువూ తప్పిపోయి తిరగదు.
మనకు అస్తవ్యస్తంగా కనిపించేది
నిజానికి మన అంచనాల అంధత్వం వల్ల కనిపించే
అత్యంత ఖచ్చితమైన క్రమం.
అవకాశంలా అనిపించేది
మనకు ఇంకా అర్థం కాని సమన్వయం.

– విశ్వమిత్ర

## కందిల

కరెంట్ లేని కాలం
కన్నులు వెలిగిన కాలం
ప్రమిదల్లో నిండు తైలాలు
గోరంత దీపాల
కొండంత వెలుగులు
గాలికి అటు ఇటు కదిలే
కందిల వెన్నెల వెలుగులు
ఆకాశ మినుకు నక్షత్రాలు!
ఇల్లంతా వెండి వెలుగుల
అమర కాంతులు
కళ్ళకు అద్దాలు లేని
అమర చూపులు !
పది పదుల వయస్సు దర్జాగా
సూదిలో దారం పెట్టి
బట్టలు కుట్టింది
చావిడి, కచేరీలలో కందిలలే
షాండీలియర్‌లు
చదువు సంధ్యల, ఆటపాటలకు
ఆలంభన
కందీల అప్పటి టార్చిలైటు



కరెంట్ సౌకర్యాలు కల్పించి
కండ్లకు అద్దాలు తొడిగింది
కండ్లకు జిగేల్ వెలుగులు
అలవాటు చేసింది!
కరెంట్ వెలుగులకు
ఆకర్శితమైన కండ్లు ఇక
కందిల వెలుగుల్లో
చూస్తాయా
అద్దాలు తొడుగుకుంటున్నా
యి
కంటికి ఐనక్‌లు పెట్టిన
కండ్లు
కందిలను షోకేస్‌లో చూస్తు
న్నాయి!

– పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు.సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

## విస్తరిస్తున్న గుడుంబా... పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గోదావరి తీర ప్రాంతాల గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా చాలా గ్రామాలలో గుడుంబా రోజు రోజుకు విస్తరిస్తూ గుప్పుమంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.రహస్య ప్రాంతాల్లో నిత్యం గుడుంబాను తయారు చేస్తూ ద్విచక్ర వాహనాలపై గ్రామాలకు చేరవేస్తూ తమ దందాను విస్తరింపచేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా నిర్మల్ జిల్లాలోని కొన్ని గ్రామాలలో తయారుచేసిన గుడుంబాను ఏకంగా ఆర్టీసీ బస్సుల్లోనే మండలంలోని గోదావరి తీర ప్రాంతాల గ్రామాలకు చేరుస్తూ రహస్య ప్రాంతాలలో నిలువచేసి అమ్మకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్న అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం విస్తరిస్తున్న గుడుంబా మహమ్మారిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా గుడుంబావిక్రయాలు జరుగుతుండడంతో చిన్న పెద్ద తేడా లేకుండా మహమ్మారిని తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న సందర్భాలు రోజురోజుకి ఎక్కువవుతున్నాయి. తయారీదారులపై ,విక్రయదారులపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప గుడుంబా రవాణా, తయారీ ఆగదని బాధిత కుటుంబాల సభ్యులు లబోదిబోమంటున్నారు.

## యాసంగి పంటకు సాగునీళ్లు విడుదల చేయండి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** యాసంగి పంటలకు నీళ్లు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అధికారులు సాగునీటిని విడుదల చేయాలని వంగ రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలానికి చెందిన రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారనే విషయం వంగ రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొని రాగా వెంటనే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాట్లు వేసి నీళ్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నా స్థానిక నాయకత్వం రైతుల బాధను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల ఇబ్బందులను తెలుసుకొని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని,రంగనాయకసాగర్ నుండి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. అలాగే కాలువల్లో చెట్లు,పొదలు అధికంగా పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని,వెంటనే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు.గట్లమల్యాల,సిద్దన్నపేట తదితర గ్రామాలలో పేమెంట్లు రిలీజ్ అయినప్పటికీ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని,వెంటనే పనులు పూర్తి చేసి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని కోరానన్నారు. మిషనరీ లేదా ఇతర ఏమైనా వనరులు అవసరమైతే తాను సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నంగునూర్ మండల రైతులకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి హామీ ఇచ్చిన ఇరిగేషన్ అధికారులకు వంగ రాజేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రం రజిని ఫెర్టిలిటీ సెంటర్‌లో శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారి స్వామి, వారి సతీమణి రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్‌పర్సన్, సీనియర్ ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా.బంగారు రజినీ ప్రియదర్శినిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. గత 5 సంవత్సరాలుగా ఈ ఉచిత ఇన్ఫర్టిలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలుపుతూ ప్రతి యేటా శిబిరానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తోందని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా ఈ సమస్యను అధిగమించాలని కోరారు. ఈ వైద్య శిబిరం ఈ నెల 1 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నమోదు చేసుకున్న వారి నుంచి లక్కీ డ్రా ద్వారా పది మంది దంపతులను ఎంపిక చేసి వారికి ఉచితంగా ఐవిఎఫ్ చికిత్సను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉచిత కీలు మార్పిడి వైద్య శిబిరాన్ని వచ్చే ఏప్రిల్‌లో ఏర్పాటు చేస్తామని డా.బంగారి స్వామి తెలిపారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డా.సురేష్ కుమార్, ఎంబ్రియాలజిస్ట్ డా.రాజేందర్, స్త్రీల వైద్య నిపుణులు డా.ఫర్హానాజ్, డా.మౌనిక, డా.సాయిశ్రీ, డా.సౌఖ్య, హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయో మెడికల్ ఇంజనీర్ రతన్‌లతో పాటు హాస్పిటల్ సిబ్బంది, మొదటి రోజు శిబిరానికి వచ్చిన సుమారు 120 మంది పేషెంట్లు పాల్గొన్నారు.

## ముత్తారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా విజయ్ గౌడ్

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోలా విజయ్ గౌడ్ అలాగే జనరల్ సెక్రెటరీగా మల్యాల రాజయ్య ఎన్నికయ్యారు. ముత్తారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్ లో ఆదివారంఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,యువజన నాయకులు రాష్ట్ర టీపీసీసీ జనరల్ సెక్రెటరీ శ్రీ దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు కోల విజయ్ గౌడ్ ని ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా విజయ్ గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొప్పరి సదానందం, సర్పంచులకు,కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల్లో లబ్ధి కోసమే బీఆర్ఎస్ డ్రామాలు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే సెంటిమెంట్ ను రగిలించి ఓట్లు దండుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మంత్రి మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలిస్తే బీఆర్ఎస్ శాంతియాత్రల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధిపొందదానికి కేటీఆర్, హరీష్‌రావులు ఈ డ్రామాకు తెరలేపారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ అనేది దుర్మార్గమైన చర్యగా మంత్రి పేర్కొన్నారు. ట్యాపింగ్ చేసి వ్యాపారుల భూములు రాయించుకుని పెద్దమొత్తంలో డబ్బువసూలుకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్,లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణం ఇలా ఒక్కొక్కటిగా వెలుగులోకి రాగా జనం ఆశ్చర్యపోతున్నారని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని తప్పు చేసిన వ్యక్తులు ఎంతటివారైనా శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. కేసీఆర్ కు వ్యక్తిగతంగా బాధ కల్గితే రాష్ట్ర ప్రజలు ఆందోళనలో ఉన్నట్లు బీఆర్ఎస్ మాజీ మంత్రులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిట్ ఎలాంటి ఆధారాలు లేకుండా నోటీసులు ఇవ్వదని మంత్రి పేర్కొన్నారు. విచారణ లోనే దోషా నిర్దోషా అన్నది తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు తీసుకోవాలని అనుకుంటే బీఆర్ఎస్ నేతలు ఒక్కరు కూడా రోడ్డుమీద తిరగలేరని అడ్లూరి చెప్పారు. ప్రజాస్వామ్యంలో అధికార ప్రతిపక్షాలు ఉండాలని తమ పార్టీ కోరుకుంటుందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ తోపాటు రేపు కాళేశ్వరం విషయంలో సీబీఐ సైతం వస్తుందని, అధికారం అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా దోపిడీ చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ప్రజల ముందు దోషులుగా తేలనున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, వేముల రాజేష్, ఐ.రామయ్య, కుంట సుధాకర్, సింహరాజు ప్రసాద్, నరేందర్, రవి పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ యాప్ సేవలు రైతులు వినియోగించుకోవాలి

ప్రతి షాప్ వద్ద హెల్ప్ డెస్క్,
ఒక సహాయకుడు సేవలు అందిస్తారు.
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైతులు ఎరువుల కోసం పడే ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సేవలు రేపటి నుంచి (సోమవారం ఫిబ్రవరి 2వ తేదీ) అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ రైతులు డౌన్ లోడ్ చేసుకోవాలని, దాని ద్వారానే ఎరువులు బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఫెర్టిలైజర్ షాప్ లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద వద్ద రైతులకు సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్, ఒక సహాయకుడు ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ యాప్ లో యూరియా బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు.

## వేములవాడలో కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,
జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది, వేములవాడ లో ఎమ్మెల్యే గా నేను ఉన్నాను. పట్టణంలో, రాజన్న ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి. అభివృద్ధి నీ అడ్డుకునే వారిని గెలిపిస్తారా. అభివృద్ధి చేసే మేము నిలబెట్టే అభ్యర్థులను గెలిపిస్తారా ఒక్క సారి ఆలోచన చేయండి.గతంలో బీజేపీ,బీఆర్ ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారు,అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలి. గతంలో పట్టణ అభివృద్ధిని కేవలం రంగు రంగుల బ్రోచర్లలో మాత్రమే చూపించారు. కేసీఆర్ నా లగ్గం ఇక్కడే అయ్యింది వేములవాడ రాజన్న అభివృద్ధి చేస్తాం అని మోసం చేశారు. రాజన్న ఆలయాన్ని 4 ఎకరాల విస్తరణలో అభివృద్ధి చేస్తున్నాం. ఒక కన్ను రాజన్న ఆలయం ఇంకో కన్ను పట్టణ అభివృద్ధిగా ముందుకు పోతున్నాం.వెయ్యి సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పది సంవత్సరాలలో గాలికి వదిలేసిన పనులను గాడిలో పెడుతున్నాం.70 ఏళ్లలో చేయలేని అప్పు కెసిఆర్ పది సంవత్సరాలలో చేశారు.రాష్ట్రాన్ని దోపిడీ చేసి విధ్వంసం సృష్టించారు. పట్టణ ప్రజలు మీకు విజ్ఞప్తి చేస్తున్నాను, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి, మీ వార్డు అభివృద్ధి చేసే బాధ్యత నాది. మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీకి వేయాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. వేములవాడ ఎమ్మెల్యే గా నేను మీకు అండగా ఉన్నాను, నాకు చెయ్యి తిరిగే విధానంగా అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించండి.

కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని

## ప్రచారంలో 'ఆల్ఫోర్స్' నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఆదివారం ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో వాకర్స్ ను కలిసి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్ విజయం తధ్యమని, తెలంగాణ రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో అఖండ విజయం నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంక్ మెట్ల పనులపై స్పందించిన అధికారులు

## పునఃనిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/ముత్తారం :** నాణ్యత లోపంతో కూలుతున్న వాటర్ ట్యాంక్ మెట్లు అనే వార్త కథనం ప్రజాపక్షం దినపత్రికలో కొద్దిరోజుల క్రితమే ప్రచురించగా వార్త కథనానికి అధికారులు స్పందించారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత లేక మెట్లు కూలిపోవడంతో ఈ విషయాన్ని ప్రజాపక్షం దినపత్రిక అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వాటర్ ట్యాంక్ కూలితే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన కథనాలకు సంబంధించి అధికారులు స్పందించి విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో వెంటనే ఆదివారం వాటర్ ట్యాంక్ మెట్ల పునర్మాన పనులు చేపట్టడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యాన్ని అలాగే ముత్తారం మండల పత్రిక విలేకరిని అభినందించారు.


## క్రీడల్లో గెలుపోటములు సహజం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గత నెల రోజుల నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట గ్రామంలో వొల్లాల నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో వొల్లాల చందు గౌడ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ముగింపు సంధర్భంగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు విన్నర్, రన్నర్ కప్పులతో పాటు నగదు బహుమతులను అందించారు. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. క్రీడాకారులకు మెడల్స్ ప్రధానం చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌లు సాధించిన క్రీడాకారులకు మెమెంటోలు బహుకరించారు. మ్యాచ్ విన్నర్‌కు రూ.25 వేల నగదు, మ్యాచ్ రన్నర్‌కు రూ.15 వేల నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్తపెల్లి మండలం మాజీ ఎంపిపి పిల్లి శ్రీలత మహేష్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ ఎంపిటిసి కమల మనోహర్, బావుపేట ఉపసర్పంచ్ భూస కరుణాకర్, ఖాజీపూర్ ఉపసర్పంచ్ పంజాల రమేష్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సురేష్ శేఖర్, టోర్నమెంట్ నిర్వాహకులు వొల్లాల నాగరాజు గౌడ్, జొన్నల మహేందర్, దొగ్గలి నరేష్, బోయిని శ్రీనివాస్, నాయకులు సుధాకర్, తిరుపతి తదితరులున్నారు.

## పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పోలీస్ బంధోబస్తు మధ్య ప్రశాంతంగా నిర్వహించేలా తగిన చర్యలు తీస్కోవడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణ లో భాగంగా నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రెసిడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రెసిడింగ్ ఆఫీసర్లకు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు సంపత్, అమరేంధర్ లు 11వ తేదిన జరగబోయే పోలింగ్ ప్రక్రియలో పోలింగ్ ముందు రోజు పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధుల పట్ల కూలంకషంగా వివరించారు. పిఓ, ఏపిఓలు, పోలింగ్ స్టేషన్ సిబ్బంది చేయాల్సిన పనుల పై సూచనలు చేస్తూ, వారి సందేహాలను తీర్చారు. పిఓ, ఏపిఓలు పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పోలింగ్ స్టేషన్ వారిగా మెటిరియల్ స్వీకరణ, బ్యాలెట్ పేపర్ల చెకింగ్, నాలుగు సెట్ల ఎలక్ట్రోరల్ జాబితా,తదితర విషయాలను వివరించారు. పోలింగ్ రోజు పోలింగ్ సరలికి అనుకూలంగా మైక్రో అబ్జర్వర్ ఏజేంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ సీలింగ్, పోలింగ్ సరలి పూర్తైన తర్వాత బ్యాలెట్ బాక్స్ సిలింగ్ ఎలా చేయాలి. ఓటర్లను ఎలా గుర్తించాలి. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్ అకౌంట్ ఏ విధంగా పూర్తి చేయాలి. పోలింగ్ అధికారులు ఎన్నికల నిబంధనల డాక్యుమెంట్స్ ఏలా పూరించాలి. పిఓ డైరీలు, డిక్లరేషన్ ఏవిధంగా పూరించాలి అనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ చేసి చూపించిన అనంతరమే బాక్స్ ను ప్రొసిజర్ ప్రకారం పోలింగ్ కు అనుకూలంగా సీల్ చేయాలన్నారు. పిఓలు నిబంధనల ప్రకారం ప్రతి డాక్యుమెంట్ ను తప్పక పూరించాలని సూచించారు. ఏజెట్ల అనుమతితోనే ఓటు వేయడానికి ఓటర్ ను అనుమతించాలన్నారు. ఓటర్ కు ఇంకు అప్లై చేసిన తర్వాతే బ్యాలెట్ పేపర్ ను ప్రొసిజర్ ప్రకారం మడిచి ఇచ్చి ఓటు వేయడానికి అనుమతించాలని సూచించారు. ఏ పోలింగ్ స్టేషన్ ఎక్కడ ఇబ్బందులు లు రాకుండ పివోలు ఏపిఓలు, పోలింగ్ సిబ్బంది తగిన జాగ్రత్త చర్యలు తీస్కోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిసీ ఖాధర్ మొహియుద్దీన్, అమరేంధర్, సంపత్ పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న..

## లెబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
కార్మిక సంఘాల జిల్లా సదస్సులో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్



**ప్రజపక్షం/సిద్దిపేట:** కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించి వాటి స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసే వరకు పోరాడాలని అందుకు ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. అదివారం కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సదస్సు ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, సిఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు పిండి అరవింద్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు మధు అధ్యతన జరిగిన జరిగిన సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, మచ్చ నర్సింహులు, ఏఐటీయూసి రాష్ట్ర కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం కలిగించేలా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని అన్నారు. లేబర్ కోడ్‌లు అమలుల్లోకి వస్తే కార్మిక సంఘాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని కార్మికుడు ప్రశ్నించే హక్కును కోల్పోతారని అన్నారు. అంతే కాకుండా పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత వంటివి ఏమి ఉండవని అడగాలంటే కార్మిక సంఘాలు లేకుండా చేయడానికి లేబర్‌కోడ్‌లో పొందుపరిచారని అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి రద్దు


కలెక్టర్ హరిత

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు 20 26కు సంబంధించి అధికారులు ఎ న్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోతీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రజావాణి తిరిగి నిర్వహించే తేదీని పత్రికా ప్రకటన ద్వారా వెల్లడిస్తామని వివరించారు.దరఖాస్తుదారులు గమనించి యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## 'పేట' మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### ఎన్నికల ప్రచారంలో మైనంపల్లి హన్మంతరావు



ప్రజాపక్షం/రామాయంపేట: బోయె మున్సిపాలిటీ ఎన్నికల్లో రామాయంపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 1,3,5,11,12 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గజవాడ లావణ్య నాగరాజు, లండాడి రవి, ఏసుగారి పుష్పాంజలి రమేష్‌రెడ్డి, డాకి శ్యామల స్వామి, పోచమ్మల నవనీత గణేష్‌లకు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేపట్టి పార్టీ అభ్యర్థులకు గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో రామాయంపేట అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలతో పాటు పట్టణ అభివృద్ధికి నిదులు తేవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌తో పాటు తాను కూడా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కొంతమందిని నమ్మి నిదులు మంజూరు చేస్తే వారి వార్డుకే పరిమితం చేశారని ఇకపై అలా కాకుండా అన్ని వార్డులకు సమానంగా నిదులు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సరాపు యాదగిరి, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, రమేష్‌రెడ్డి, రాజిరెడ్డి, బండారి మహేందర్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, డాకి స్వామి, డాకి నాగేందర్, మదునాల స్వామిగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ



ప్రజాపక్షం/భీమ్‌గల్ : తెలంగాణ ఉద్యమ సారథిగా, రాష్ట్ర సాధకుడిగా, 2 విడత రాష్ట్ర సిఎంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిని కేసీఆర్‌ను సిట్ విచారణ పేరిట వేధింపులకు గురి చేస్తున్న సందర్భంలో భీమ్‌గల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనను గాలికి వదిలేసి కక్ష్య రాజకీయాలతో కాలయాపన చేయటం దారుణమని ప్రజలకు ఎన్నో సమస్యలున్నాయని, పాలకులు పాలనను మెరుగుపర్చాల్సింది పోయి సంక్షేమం సమృద్ధి సాధనపై దృష్టి నిల్పాల్సింది పోయి పాలన చేతగాక ఈ తరహా కక్ష్య రాజకీయాలకు తెర లేపుతుందని విమర్శించారు.బైక్ ర్యాలీ అనంతరం సిఎం చిత్రపటంతో దిష్టిబొమ్మను తగలబెట్టే సమయంలో ఎస్సై తిరుపతి నర్సింహమూర్తితో వచ్చి అడ్డుకుని దిష్టిబొమ్మను అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దొన్కంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ మహేష్, మాజీ జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య, శర్మనాయక్, తుక్కాజినాయక్, మాజి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అండర్ -20 క్రికెట్ పోటీలకు జిల్లా యువతుల ఎంపిక



ప్రజాపక్షం/నిజామాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్ 20 క్రికెట్ అసోసియేషన్ పోటీలకు జిల్లా నుంచి సీనియర్ ఇంటర్, డిగ్రీ మహిళా విభాగంలో వివిధ కళాశాలల 19 మంది యువతులు ఎంపికయ్యారని అధ్యక్షులు చంద్రసేన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల క్రికెట్ క్రీడాకారులు 2 నుండి 7 వరకు వరంగల్‌లో జరిగే ఈ పోటీలో పాల్గొననున్నారు. ఈనెల 7 న ఫైనల్ జిల్లా క్రికెట్ జట్టు అర్హత సాధిస్తుందని ఎంపికైన యువతులు ఆటలు బాగా రాణించాలని క్రికెట్ టోర్నమెంట్ జిల్లా అధ్యక్షులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## సత్యనారాయణ స్వామి.. ఆలయంలో పౌర్ణమి సందడి

ప్రజాపక్షం / దండేపల్లి : తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.భక్తులు వేకువ జాము నుంచే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో నిత్యవిధి, ప్రాభోదికి ఆరగింపు, తీర్థప్రసాదగోష్ఠి, హవనము, నిత్య హోమములు, జయాదిహోమ, శాంతిహోమములు, మహా పూర్ణాహుతి, బలుహరణము వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## అధికార లాంఛనాలతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య అంత్యక్రియలు



ప్రజాపక్షం/బోధన్: విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి మృతి చెంది నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(24) అంత్యక్రియలను ఆదివారం ఆమె స్వస్థలమైన నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో జరిగాయి. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఖురేషి, డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ వారు సౌమ్య మృత దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా కల్పించారు. భవిష్యత్‌లోసంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. అంతకుముందు పోలీసు లాంఛనాలతో సౌమ్యకు తుది వీడ్కోలు పలికారు.

## వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రజాపక్షం / రెబ్బన : ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలంలోని గంగాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో ఏడుకొండల స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఏటా నిర్వహించే ఈ మహా జాతరలో భాగంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ, పోలీస్ శాఖ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరుపతికి వెళ్లలేని భక్తులు గంగాపూర్ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడం భాగ్యంగా భావిస్తారని, ఇక్కడి స్వామిని దర్శిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, క్యూలైన్లు వంటి సౌకర్యాలను ఆలయ నిర్వాహకులు కల్పించారు. గంగాపూర్ క్షేత్రం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/టేక్మాల్ : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్సీని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించి, డ్యూటీ డాక్టర్ వివరాలు, రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న సిబ్బంది సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే వైద్య సిబ్బంది సమయపాలన చాలా ముఖ్యమని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పీహెచ్సీల్లో అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ప్రజాపక్షం / బెల్లంపల్లి : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని బెల్లంపల్లి రీజియన్ సింగరేణి కార్మిక సంఘాల జెపిసి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బెల్లంపల్లిలోని టిఎన్‌టియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిబ్రవరి 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కేంద్రం హరిస్తోందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ, యాజమాన్యాలకు ఇష్టానుసారంగా వ్యవహరించే అధికారాన్ని ఈ కోడ్‌లు కల్పిస్తున్నాయని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి ప్రయోజనాలు అందకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కోడ్‌లకు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు. కేంద్రం తన పద్ధతి మార్చుకోకపోతే ఐక్య పోరాటాల ద్వారా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు ఎండి వజీర్, ఐఎఫ్‌టియు నాయకులు ఎండి చాంద్ పాషా, టిఎన్‌టియుసి నాయకులు మణిరాం సింగ్, టిబిజియుఎస్ నాయకులు నీరటి రాజన్న, ఎఐఎఫ్‌టియు నాయకులు మేకల పోచన్న, ఎస్‌జికెఎస్ నాయకులు అంబాల మహేందర్, టియుసిఐ నాయకులు గోగర్ల శంకర్, అంజయ్య, బొల్లు మల్లయ్య, రమణయ్య పాల్గొన్నారు.

## సిఎం కప్ విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మార్కెట్ గ్రౌండ్‌లో సిఎం కప్ క్రీడలకు ముగ్గింపు కార్యక్రమం నిర్వహించారు. ముగ్గింపు కార్యక్రమానికి మోర్తాడ్ మండల అభివృద్ధి అధికారిని తిరుమల అధ్యక్షత వహించగా, మోర్తాడ్ ఎస్ఐ రాము, మోర్తాడ్ గ్రామ సర్పంచి భోగా నిత్యానంద్, ఫిజికల్ డైరెక్టర్ శ్యామ్ పాల్గొని విజేతలకు బహుమతులను అందచేయడం జరిగింది. బాలికల విభాగంలో ఖోఖో మొదటి స్థానం మోర్తాడ్, ద్వితీయ స్థానం తిమ్మాపూర్, కబడ్డీ మొదటి స్థానం మోర్తాడ్, ద్వితీయ స్థానం తిమ్మాపూర్, వాలీబాల్ మొదటి స్థానం తిమ్మాపూర్, ద్వితీయ స్థానం మోర్తాడ్ బాలుర విభాగం కబడ్డీ సుంకెట్ ప్రథమ స్థానం పొందగా, వడియాట్ ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్ ధర్మోరా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా తిమ్మాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖోఖో మోర్తాడ్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, శెట్పల్లి ద్వితీయ స్థానంలో నిలిచింది. సర్పంచి అనిల్, డోన్‌పాల్ గ్రామ సర్పంచి ముత్యాల రాములు, వడ్డేట్ సర్పంచి ఎర్రం శ్రీనివాస్, మోర్తాడ్ గ్రామ ఉప సర్పంచి శ్రీనివాస్, వార్డు సభ్యులు మురళి, మోర్తాడ్ సెక్రెటరీ సైపోద్దీన్, సెక్రెటరీలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, సుమన్, శశి పాల్గొన్నారు.

## కెసిఆర్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : ఫోన్ ట్యాపింగ్ నెపంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను విచారణకు పిలవడం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యేనని ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవ లక్ష్మి, మున్సిపల్ జిల్లా ఇంచార్జి, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ కుమార్ ధ్వజమెత్తారు. కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. నల్ల జెండాలు చేతబూని రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. సిట్ నోటీసులు బూటకమని మండిపడుతూ వాటి ప్రతులను రోడ్డుపై బహిరంగంగా తగులబెట్టారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు అక్కడ నల్ల జెండాను ఆవిష్కరించారు.తెలంగాణ సాధకుడైన కెసిఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి విచారణల పేరుతో వేధింపులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ కోనేరు కోనప్ప, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజ్ఞయాగాదులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ నరసింహ స్వామి వారి మూర్తులను రథంపై ఉంచి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు భారీగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భజన పోటీలు కొనసాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ముత్యాల రమ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, ఉప సర్పంచి అగ్గు కృష్ణ, మాజీ ఎంపీటీసీ మంద సంజీవ్, మాజీ ఉప సర్పంచి విజయ్, మాజీ సర్పంచి దశరథ్, ఆలయ మాజీ చైర్మన్ లు విజయ్ గౌడ్, శ్రీనివాస్ నాయకులు రాధా కిషన్ గౌడ్, కిషోర్ గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తా

### సంఘం అధ్యక్షుడిగా గూడూరి ప్రవీణ్ ఎన్నిక


ప్రజాపక్షం/గజ్వేల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను అమలు చేయడమే లక్ష్యంగా సంఘాన్ని క్రమబద్ధంగా నడిపిస్తానని నూతన అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్ తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ సూచించిన చదువు, చైతన్యం, సంఘటనం మార్గమే అంబేద్కర్ సంఘానికి కార్యాచరణ కాగా, యువతలో అవగాహన పెంచి, హక్కుల సాధన కోసం సంఘటితంగా పనిచేస్తామని తెలిపారు. గ్రామంలో సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో అంబేద్కర్ సంఘం క్రియాశీల పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. సంఘ కార్యకలాపాలు క్రమబద్ధంగా కొనసాగుతూ గ్రామాభివృద్ధికి తోడ్పడేలా కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు.

## వైద్యపరీక్షలు,మందుల పంపిణీ

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండలంలోని జాగ్గిరాల్ గ్రామంలో సర్పంచ్ గడల ప్రసాద్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులు ఆధ్వర్యంలో అమర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆర్మూర్ సహకారంతో ప్రజలకు ఉచిత వైద్యం, టెస్టులు చేసి మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాబు, సృజన పాల్గొని ప్రజలకు వైద్యసేవలందించి మందులు అందజేశామన్నారు. అవసరమైన వారికి ఉన్నత వైద్యం కోసం రిఫర్ చేశామన్నారు. ఉపసర్పంచ్ రాజేశ్వర్, సభ్యులు సురేష్, రాజేశ్వర్, సంజీవ్, గంగాధర్, గంగారెడ్డి, సుదర్శన్, రాజమల్లు, లింబాద్రి, గంగాధర్ పాల్గొన్నారు.



## పరమేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



ప్రజాపక్షం/కొల్చారం: ఆది దేవుడు పరమేశ్వరుని కరుణా కటాక్షాలు ప్రజలందరికి కలగాలని స్వాములు (మాలధారులు) మాఘం మాసం పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన శివాలయం లో శివ స్వాములు గంగసాని వనిత రాజిరెడ్డి, కుమ్మరి జ్యోతి నాగరాజు దంపతులు శివలింగానికి బిల్వ దళాలు, విభూతి, పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. గురు స్వామి మనోహర్ గౌడ్ నేతృత్వంలో ఆలయ పూజారి మురళీధర్ మంత్రోత్సాహరణల మధ్య స్వామికి అభిషేకం చేశారు. గురుజ్ఞానంలో శివ మహాపురాణం రుద్రాభిషేకం: రుద్రనమకం, చమకం మంత్రాలతో అభిషేకం చే యడం.పంచామృత స్నానం పాలు, పెరుగు, నె య్యి, తేనె, పంచదారతో అభిషేకం. బిల్వాభిషే కం మారేడు దళాలతో పూజ. విభూతి అభిషేకం: పరమశివునికి ఇష్టమైన విభూతితో చేయడం. పాలు దీర్ఘాయువు కోసం తేనె అద్భుతమైన గాత్ర ం, విద్యాభివృద్ధి కోసం.పెరుగు ఆరోగ్య ప్రాప్తి, వంశాభివృద్ధి నెయ్యి తో స్వర్ణ సమానమైన ఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అభిషేకంలో గురుస్వామి సత్యం, అరవింద్, భూపాల్, ప్రతాప్ రెడ్డి, అనిల్, సంగమేశ్వర్, అశోక్ గౌడ్, చిన్న రాములు దశరథం రఘు ఉన్నారు.

## కౌడిపల్లిలో బిఆర్ఎస్ నాయకుల ధర్నా రాస్తారోకో

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రామా గౌడ్



ప్రజాపక్షం/కౌడిపల్లి: కెసిఆర్ సిట్ విచారణకు నిరసనగా కౌడిపల్లి మండల కేంద్రంలో ఆదివారం జాతీయ ప్రధాన రహదారిపై మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో భారీ నిరసన, ధర్నా రాస్తారోకో చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు రెండు గంటకు పైగా రాస్తారోకో చేయడంతో భారీగా వాహనాలు కిలోమీటర్ మేరా నిలిచిపోయాయి. దీంతో ఎస్సై అమర్ సిబ్బందితో బిఆర్ఎస్ నాయకులను ధర్నా విరమించేందుకు శతవిధాల ప్రయత్నించిన సాధ్యం కాలేదు కొంతమంది యువ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ కాల్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు దిష్టిబొమ్మను చాకచక్యంగా లాక్కొని వెళ్లిపోవడంతో బిఆర్ఎస్ శ్రేణులు పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు రామ గౌడ్ తో పాటు ముఖ్య నాయకులు లను పోలీసులు అదుపులోకి తీసుకోగా ధర్నా విరమించారు. అక్కడికి ఆగకుండా చివరగా కొంతమంది నాయకులు దిష్టిబొమ్మను కాల్చారు. పార్టీ అ ధ్యక్షుడు రామ గౌడ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే సీట్ విచారణకు నోటీసులు పంపుతున్నారని కెసిఆర్ జోలికొస్తే చూస్తూ ఊరుకోమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన మహానేతకు రేవంత్ రెడ్డి పరిపాలన చేతకాక కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నిలబెట్టుకోవాలని అన్నారు. రైతుబంధు , తులం బంగారం మహిళలకు నెలకి 2500, యువతకు ఉద్యోగాలు, పెంచిన పింఛన్లు ఇలా ఎన్నో ప్రజలకు ఎగనామం పెట్టి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు తొత్తుగా మారి ఇక్కడ పాలన కొనసాగిస్తున్నాడని మండిపడ్డారు కేసీఆర్ కుటుంబం జోలికొస్తే యావత్ తెలంగాణ రావణ కష్టమవుతుందని ఆయన హెచ్చరించారు. ఉప సర్పంచ్ బెస్త అనిల్ కుమార్, మంగలపర్తి సందీప్, బురిగారి వెంకన్న, సారా ప్రతాప్ గౌడ్, రవి సాగర్, బురుగడ్డ ఉప సర్పంచ్, తాటి ఆంజనేయులు, సంతోష్ గౌడ్, గౌరెడ్డి, గ్రామాల నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సౌమ్యకు సిపిఐ నివాళులు

ప్రజాపక్షం/నిజామాబాద్: విధి నిర్వహణలో అసమాన పోరాటం ప్ర దర్శించి గంజాయి స్మగ్లర్లను పట్టుకునే సమయంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమత్య మృతి పట్ల చింతిస్తూ ఆమెకు నివాళులర్పిస్తున్న కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌమ్య మృతికి కారణమైన గంజా యి స్మగ్లర్లపై, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత కొన్నేళ్లుగా ఖాకీ యూ ని ఫాం ఉద్యోగులపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని వ్యక్తం చేశారు. కొన్నేళ్ల కిందట ఫా రెస్ట్ అధికారి గంగారం, కొన్ని రో జుల కిందట పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్, ఇ ప్పుడు ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య విధి నిర్వహణలో ప్రాణాలు వదలడం ఆందోళనకరమన్నా రు. భవిష్యత్తులో పునరావత్తం కాకుండా ప్రభు త్వం, పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆసియా కప్ హీరో ఆగయా

ఆ ఇద్దరిలో బెంచ్‌పై ఉండేది ఎవరు..?



ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో దుమ్మురేపిన భారత జట్టుకు మరో గుడ్ న్యూస్. సర్జరీ కారణం గా న్యూజిలాండ్ సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ మళ్లీ జట్టుతో కలువబోతున్నాడు. నెలకు పైగా క్రికెట్ ఆడని అతడు వరల్డ్‌కప్ వామప్ మ్యాచ్‌ల్లో ఆడనున్నాడు. ఈ యంగ్‌స్టర్‌కు ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లియరెన్స్ ఇచ్చింది. దాంతో.. ముంబైలో జట్టుతో కలువనున్న అతడు వామప్ మ్యాచ్‌ల్లో ఆడేందుకు సిద్దమవుతున్నాడు. తిలక్ రాకతో టీమిండియా కూర్పు ఆసక్తికరంగా మార నుంది. విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మకు 'టెస్టిక్యులార్ సర్జరీ' తర్వాత విశ్రాంతి తీసుకున్నాడు. చిన్న ఆపరేషనే అయిన ప్పటికీ వైద్యుల సూచన మేరకు తిలక్‌ను న్యూజి లాండ్ టి–20 సిరీస్‌లో ఆడించలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్న అతడు.. ఫిట్‌నెస్ సాధిండం తో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో.. వర ల్డ్‌కప్‌కు సన్నద్ధతలో భాగంగా వామప్ మ్యాచ్ ఆడనున్నా డు. అంతకంటే ముందు డివై పాటిల్ స్టేడియంలో ఫిబ్రవరి 2న ఇండియా ఏ, యూఎస్ ఏ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగుతాడు. అనంతరం ఫిబ్ర వరి 4న దక్షిణాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ ఈ చిచ్చరపిడుగు ఆడే అవకాశముంది.

**ఇషాన్, శాంసన్.. ఇద్దరిలో ఎవరు?..** న్యూజిలాండ్‌తో ముగిసిన టి–20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తిలక్ వర్మ స్థానంలో క్రీజులోకి వచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్ మెరుపు ఇన్నింగ్స్‌తో కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. త్రివేండ్రంతో తన విధ్వంసం డోసు పెంచిన ఇషాన్ 42 బంతుల్లోనే శతకంతో రెచ్చిపోయాడు. మరోవైపు ఓపెనర్ సంజూ శాంసన్ 6 పరుగులతో నిరాశపరిచాడు. ఐదు మ్యాచ్‌ల్లో సంజూ టాప్ స్కోర్ 24 మాత్రమే. తిలక్ రాకతో ఇషాన్‌ను మూడో స్థానంలో ఆడిస్తారా? శాంసన్‌ను ఓపెనర్‌గా కొనసాగిస్తారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ తిలక్‌కు మూడో స్థానంలో అవకాశమిస్తే.. సన్నాహక సిరీస్‌లో అర్ధ శతకం(76), సెంచరీతో కదంతొక్కిన ఇషాన్‌ను అభిషేక్ శర్మకు జోడీగా పంపినా పంపొచ్చు. అప్పుడు శాంసన్ బెంచ్‌కే పరిమితమవ్వడం ఖాయం. వరల్డ్‌కప్ స్క్వాడ్‌లోని వాషింగ్టన్ సుందర్ మరి కొన్ని రోజుల్లో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరవ్వనున్నాడు. భుజం గాయం కారణంగా రియాన్ పరాగ్ సైతం ఈమధ్య మ్యాచ్‌ల్లో ఆడలేదు. పరాగ్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుని జట్టుతో కలుస్తాడని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

## ఢిల్లీ నాకౌట్‌కు చేరేనా?

మహిళల ప్రీమియర్ లీగ్‌లో చివరి ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే మ్యాచ్ మరికాసేపట్లో మొదలవ్వనుంది. ఆరు పాయింట్లతో రేసులో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఈ మ్యాచ్ గెలిస్తే నేరుగా నాకౌట్‌కు దూసుకెళ్తుంది. ఒకవేళ యూపీ




వారియర్స్ గెలిస్తే ముంబై, ఢిల్లీతో పాటు యూపీ ఖాతాలో ఆరు పాయింట్లు చేరుతాయి. అప్పుడు నెట్రన్ రేటు ఆధారంగా చివరి బెర్తును ఖరారు చేస్తారు. ఇరుజట్లకు కీలకమైన పోరులో టాస్ గెలిచిన ఢిల్లీ సారథి జెమీమా రోడ్రిగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఆరు విజయాలతో ఆర్సీబీ ఫైనల్ చేరగా.. గత పోరులో ముంబై ఇండియన్స్ను ఓడించిన గుజరాత్ జెయింట్స్ నాకౌట్ బెర్త్ సాధించింది. చివరి స్థానం కోసం ముంబై, ఢిల్లీ, యూపీ మధ్య పోటీ నెలకొంది. ఈ మ్యాచ్లో ఢిల్లీ గెలిచిందంటే 8 పాయింట్లతో దర్జాగా ప్లే ఆఫ్స్‌లో అడుగుపెడుతుంది. ఒకవేళ.. యూపీ విజయం సాధిస్తే అప్పుడు నెట్రన్‌రేటు కీలకమవుతుంది.

**ఢిల్లీ తుది జట్టు :** షఫాలీ వర్మ, లిజెల్లె లీ(వికెట్ కీపర్), లారా వొల్వార్ట్, జెమీమా రోడ్రిగ్స్(కెప్టెన్), మరిజానే కాప్, చినెల్లె హెన్రీ, నికీ ప్రసాద్, మిన్ను మణి, స్నేహ్ రానా, శ్రీ చరణి, నందిని శర్మ.

**యూపీ తుది జట్టు :** మేగ్ లానింగ్(కెప్టెన్), సిమ్రన్ షేక్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, షిప్రా గిరి(వికెట్ కీపర్), డియాండ్ర డాటిన్, చార్లీ నాట్, సోఫీ ఎకిల్‌స్టోన్, అశా శోభన, శిఖా పాండే, క్రాంతి గౌడ్.

## నాడా, ఖేలో ఇండియాకు భారీ కోతలు !



వార్షిక బడ్జెట్లో క్రీడా రంగానికి ఊతమిస్తూనే.. కీలకమైన వాటికి నిధులు తగ్గించింది కేంద్రం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెబుతూ క్రీడా పరికరాలు, వస్తువుల తయారీకి రూ.500 కోట్లు కేటాయించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి ఇంత భారీ మొత్తం నిధులు ఇవ్వాలని నిర్ణయించడం ఇదే మొదటిసారి. అయితే.. జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థకు మాత్రం రూ.3 కోట్లు, ఖేలో ఇండియా కార్యక్రమానికి సైతం రూ.36 కోట్లు కోత విధించారు. ఆదివారం మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో 2026–27 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. క్రీడలకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పిన నిర్మల పరికరాల తయారీకి రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. క్రీడా పరికరాలు, వస్తువుల తయారీకి ఊతమిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 'మేకిన్ ఇండియా ' ద్వారా క్రీడా వస్తువుల తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు ఉపకరించేలా నిధులు కేటాయించామని వెల్లడించారు. ఈసారి బడ్జెట్లో రూ. 4,479.88 కోట్లు కేటాయించారని, గత ఏడాదితో పోల్చితే రూ.1,133.34 కోట్ల కేటాయింపు అదనంగా జరిగిందని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి త్వ శాఖ పేర్కొంది. క్రీడా పరికరాల తయారీకి బడ్జెట్లో రూ.500 కేటాయించడం పట్ల క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. **సాయ్‌కు రూ. 917.38 కోట్లు..** ప్రతిభావంతులను గుర్తించి, సానబెట్టే భారత స్పోర్ట్స్ సమాఖ్యకు బడ్జెట్ రూ. 880 కోట్ల నుంచి రూ.917.38 కోట్లకు పెరిగింది. అదే సమయంలో జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థకు రూ.3 కోట్ల కోత విధిస్తూ.. రూ.20.30 కోట్లు ప్రకటించారు. గత ఏడాది నాడాకు కేటాయించే బడ్జెట్లో రూ.28.55 కోట్ల నుంచి రూ.24.30 కోట్లకు తగ్గించిన విషయం తెలిసిందే. ఇక ఖేలో ఇండియా కార్యక్రమానికి కూడా కోత తప్పలేదు. నిరుడు రూ. 1,000 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి రూ.924.35 కోట్లతో సరిపుచ్చింది. ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌ను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్లో రూ.50 కోట్లు ప్రకటించారు.

## ఆరోగ్యం



## ఆరోగ్య రంగం.. సంఖ్యల వెనుక దాగిన వాస్తవం

కేంద్ర బడ్జెట్ 2026–27లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు రూ.1,05,530.42 కోట్ల కేటాయించింది. ఇది గత ఆర్థిక సంవత్సరపు సవరించిన అంచనాలతో పోలిస్తే సుమారు 8.96 శాతం పెరుగుదలగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారిక ప్రకటనలు చెబుతున్నప్పటికీ, ఈ కేటాయింపులు భారతదేశంలోని వాస్తవిక అవసరాలకు సరిపోతున్నా యా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే, దేశంలో మెజారిటీ ప్రజలు ఇప్పటికీ చికిత్స ఖర్చులను భరించలేని పరిస్థితుల్లో జీవిస్తున్నారు. భారతదేశం ఆరోగ్య రంగంపై ఖర్చు చేసే మొత్తం జాతీయ ఆదాయంలో వాటా సుమారు 1.3 నుంచి 1.5 శాతానికే పరిమితమైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించే కనీస స్థాయి 3 నుంచి 5 శాతం కాగా, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ స్థాయిని మించి ఖర్చు చేస్తున్నాయి. క్యూబా వంటి దేశాలు పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందించడమేగాక, ఇతర దేశాల అవసరాల నిమిత్తంత తమ వైద్యనిపుణుల బృందాలను పంపుతున్నాయి. ఆ స్థాయిలో ప్రజారోగ్యానికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయకపోయినా, కనీస అవసరాలకు సరిపడా కేటాయింపులు కూడా లేకపోవడం దురదృష్టకరం. బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లకు పైగా కేటాయింపు ప్రకటించినా, అది దేశ ఆర్థిక పరిమాణంతో పోలిస్తే స్వల్పమేనని అర్థమవుతుంది. జనాభా విస్తీర్ణం, పేదరికం, ఆరోగ్య అసమానతలను పరిగణనలోకి తీసుకుంటే ఈ బడ్జెట్ కేటాయింపు ఏమాత్రం సరిపోదు. దేశంలో ఆరోగ్య వ్యయంలో ప్రధాన భారాన్ని ప్రజలే భరిస్తున్నారనే వాస్తవాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. చికిత్స కోసం జేబు నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి కోట్లాది కుటుంబాలను అప్పుల్లోకి నెట్టుతోంది. చిన్న అనారోగ్యమే పేద కుటుంబానికి ఆర్థిక విపత్తుగా మారుతోంది. 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాలు ఉన్నప్పటికీ, అవి అన్ని వ్యాధులను, అన్ని ఖర్చులను భరించడంలేదు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులు అధికంగా ఉండగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాల కొరత ప్రజలను ప్రైవేట్ రంగం వైపు నెట్టుతోంది. ఈ



పరిస్థితిలో ఆరోగ్య బడ్జెట్ పెరుగుదల ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించగలిగే స్థాయిలో లేదు.

నిజానికి ఆరోగ్యం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు.. అది ప్రతి పౌరుడి మౌలిక హక్కు. ఈ ఆలోచన పాలకుల బడ్జెట్ విధానంలో ప్రతిబింబించాలి. ప్రస్తుత కేటాయింపులు ప్రభుత్వ సంకల్పాన్ని చూపిస్తున్నట్లు ఉన్నప్పటికీ, దేశ జనాభా అవసరాలు, పేదరికం, వ్యాధుల భారాన్ని దృష్టిలో ఉంచుకుంటే అవి సరిపోవు. ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరగకుండా, ప్రజల జేబుపై భారాన్ని తగ్గించడం సాధ్యం కాదు.

కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి చేసిన కేటాయింపులు సంఖ్యల పరంగా ఆకర్షణీయంగానే ఉంది. కానీ, ఆ మొత్తాలు భారతదేశంలోని వాస్తవిక ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే స్థాయిలో లేవు. మెజారిటీ ప్రజలు చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న దేశంలో, ఆరోగ్యంపై ఖర్చుకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. లేకపోతే, 'సర్వజన ఆరోగ్య సంరక్షణ' అన్న నినాదం పత్రాలకే పరిమితమై, ప్రజల జీవితాల్లో మాత్రం మార్పు రాకుండా పోయే ప్రమాదం ఉంది.

**కేన్సర్ బాధితులకు ఊరట!**

కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కేన్సర్ రోగులకు ముఖ్యమైన ఉపశమనాన్ని ప్రకటించింది. కేన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 అత్యవసర మందులు మరియు ఔషధాలపై ఉన్న ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా తొలగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు.

### ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో లోపాలు..

జాతీయ ఆరోగ్య మిషన్‌కు కేటాయింపులు పెరిగినప్పటికీ, గ్రామీణ, పట్టణ పేద ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థితిగతులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది కొరత వంటి దీర్ఘకాల సమస్యలు ఇప్పటికీ వెంటాడుతునే ఉన్నాయి. అనేక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో లేవు. ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ బలపడకుండా, ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రులపై మాత్రమే దృష్టి కేంద్రీకరించడం వల్ల ఆరోగ్య అసమానతలు మరింత పెరుగుతున్నాయి. కొత్త ఆల్‌ఇండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కేంద్రాలు, మెడికల్ కాలేజీల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, అవి ఎక్కువగా పట్టణ కేంద్రాలకే పరిమితమవుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇవి ఇంకా అందుబాటులోకి రాలేదు. పెద్ద ఆసుపత్రుల నిర్మాణం మాత్రమే ఆరోగ్య సమస్యలకు పరిష్కారం కాదు.

### పరిశోధన, మానవ వనరుల పరిమితులు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్)కు కేటాయింపులు పెరిగినప్పటికీ, భారతదేశానికి అవసరమైన స్థాయిలో వైద్య పరిశోధన ఇంకా వెనుకబడే ఉంది. దేశీయ వ్యాధులకు, ప్రజారోగ్య సమస్యలకు సంబంధించిన పరిశోధనకు దీర్ఘకాలిక పెట్టుబడులు అవసరం. అలాగే వైద్య విద్య విస్తరణ పేరుతో సీట్లు పెరుగుతున్నా, నాణ్యత, శిక్షణ, పని పరిస్థితులపై తగిన శ్రద్ధ లేదు. వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతా ల్లో పనిచేయడానికి ప్రోత్సాహకాలు తక్కువగా ఉండటం వల్ల అసమతుల్యత కొనసాగుతోంది.

### నివారణ కంటే చికిత్సకే ప్రాధాన్యం

ఆరోగ్య బడ్జెట్‌లో ప్రధానంగా చికిత్సాపరమైన అంశాలు, సేవలకే ప్రాధాన్యత కనిపిస్తోంది. కానీ దేశంలో పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు, పోషకాహార లోపం, కాలుష్య ప్రభావాల నేపథ్యంలో నివారణాత్మక ఆరోగ్య సంరక్షణకు మరింత పెట్టుబడి అవసరం. శుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం, పోషణ, మానసిక ఆరోగ్యం వంటి అంశాలు ఆరోగ్యంతో నేరుగా ముడిపడి ఉన్నప్పటికీ, అవి విభాగాల మధ్య విభజనలో మరిచిపోతున్నాయి. ఆరోగ్య బడ్జెట్ సమగ్ర దృష్టితో ఉండాల్సిన అవసరం ఉంది.

'జన్ ఆరోగ్య యోజన'కు 9500 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా, ఆయుర్వేద ఔషధాలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమే అయినప్పటికీ, అల్లోపతి, యునానీ, హోమియోపతి తదితర వైద్య విధానాలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. ప్రజారోగ్యాన్ని కూడా సనాతన ధర్మం పేరుతో వేల సంవత్సరాల నాటి విధానాలను అమలు చేయాలనుకోవడం ఎంత వరకూ సత్ఫలితాలనిస్తుందనేది అనుమానమే.

## 'కార్పొరేషన్'లో కాంగ్రెస్‌కు మద్దతు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగిందని పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు, సిపిఐ నల్లగొండ పట్టణ కమిటీ సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ సత్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన నల్లగొండ కార్పొరేషన్‌కు ఈనెల 11న ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో సిపిఐకి కోఆప్షన్ పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. నల్లగొండ మరింత అభివృద్ధి చెందెందుకు అధికారపార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి, సహాయ కార్యదర్శి వి.లెనిన్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె మదర్, ముండ్ల ముత్యాలు, యూసుఫ్, వెంకట్‌రావు, రెవెల్లి యాదయ్య, ఐతరాజు శంకర్, దోటి పండరి, గుండె రవి, సుజాత, విజయ, ధనలక్ష్మి, చింత ధనలక్ష్మి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సహకారంతోనే గెలుపు సాధ్యం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్



**ప్రజాపక్షం/నస్పూర్ :** సింగరేణి కార్మిక క్షేత్రంలో సిపిఐ సహకారంతోనే విజయం సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ పొత్తుతోనే రాష్ట్రంలో అభివృద్ధికి నాంది పడిందని, మంచిర్యాల జిల్లా ప్రాంతాభివృద్ధికి కామ్రేడ్ల అవసరం ఎంతైనా ఉందని, కార్మిక కుటుంబాల సమస్యలపై అహర్నిశలు పోరాడే సిపిఐ భావజాలం అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల పొత్తుల విషయంలో కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పొత్తులపై కాంగ్రెస్ పునరాలోచించాలని శంకర్ సూచించారు. చెన్నూరు నియోజకవర్గంలో సిపిఐ, బిఆర్‌ఎస్ మధ్య పొత్తులు కుదిరాయని, ఇందులో భాగంగానే క్యాతనపల్లి, చెన్నూరు మున్సిపాలిటీలలో అవగాహనతో పోటీలో ఉన్నామని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో సైతం బిఆర్‌ఎస్ తో పొత్తుల విషయమై చర్చలు కొనసాగుతున్నాయని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తుల అంశం ఇంకా కొలిక్కి రాలేదని వెల్లడించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు బాజీ సైదా, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, లింగం రవి, మిర్యాల రాజేశ్వరరావు, కొట్టే కిష్టనావు, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, చిలక రామచందర్, నర్సింగారావు, సారయ్య, వేముల సంతోష్, రాకేష్ పాల్గొన్నారు.

## సామాన్యులను విస్మరించిన బడ్జెట్

సిపిఐ నేత బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులను పూర్తిగా విస్మరించారని; సంపన్నవర్గాలకు ఊతమిచ్చేవిధంగా కేటాయింపులు ఉన్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు బడ్జెట్‌లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదన్నారు. అత్యంత ప్రమాదకర స్థాయికి నిరుద్యోగ సమస్య చేరుకుందని దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతుందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలను ఎక్కడ ఈ బడ్జెట్‌లో ప్రస్థావించలేదన్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల గురించి బడ్జెట్‌లో ఎక్కడ ప్రస్థావన లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ పేదలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పేరును విబి జి రామ్ జీగా మార్చి పూర్తిగా తొలగించే ప్రయత్నాన్ని చేస్తుందని హేమంతరావు తెలిపారు. కేటాయింపులు చేసినప్పటికీ రాష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పటం ద్వారా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించిందని విద్య, వైద్యం లేని దేశం ఎలా పురోగమిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ దేశంలో ఇప్పటికీ మెజార్టీ ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారని కేటాయింపులు సరైన రీతిలో లేవని ఆయన తెలిపారు. బడ్జెట్ లెక్కల ప్రకారం రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పాటు దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తు ల ధరలు గణనీయంగా పడిపోయే అవకాశం ఉందని హేమంతరావు తెలిపారు. అంకెల్లో చూపడానికి తప్ప ఇది ఆచరణ సాధ్యమయ్యే బడ్జెట్ కాదన్నారు. కార్మిక వర్గాన్ని ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల ప్రస్థావనే లేదని ఇప్పటికే లేబర్ కోడ్స్‌తో స్వేచ్ఛను హరించిన ప్రభుత్వం ఇప్పుడు సంక్షేమాన్ని కార్మికులకు దూరం చేసిందన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర మంత్రి మరోసారి వివక్షను ప్రదర్శించారని ఆంధ్రప్రదేశ్‌తో పోల్చినప్పుడు కనీస కేటాయింపులు కూడా జరపలేదన్నారు. కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూల బడ్జెట్ తప్ప ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగేది ఏమి లేదని ఆయన తెలిపారు.

## ప్రజల అత్యవసరాలపై చిత్తశుద్ధిలేదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** యూనియన్ బడ్జెట్‌లో కార్మికులు, రైతులు, యువత, విద్యారంగాన్ని, సాధారణ ప్రజల అత్యవసరాలపట్ల ఎలాంటి చిత్తశుద్ధిలేదని మరోసారి రుజువైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. కోట్లాదిమంది నిరుద్యోగ యువత సమస్యల గురించి, విద్యారంగాన్ని అభివృద్ధిచేయాలని చిత్తశుద్ధిలేదని విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి కేంద్రం కేటాయించకపోవడం తెలంగాణపై బిజెపి వారికున్న ప్రేమను సూచిస్తుంద న్నారు. ఈబడ్జెట్ కార్పొరేట్‌కు వరాలుగా, కార్మికులకు, రైతులు, వ్యవసాయకూలీలు, సామాన్య ప్రజలకు శాపంగా ఉందనడంలో సందేహం లేదన్నారు.

## రాష్ట్రానికి అన్యాయం

సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్

**మహబూబ్ నగర్ :** కేంద్రబడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మండిపడ్డారు. ఈ బడ్జెట్ కేవలం త్వరలో జరిగే నాలుగు రాష్ట్రాల ఎన్నికల కోసమే ప్రవేశపెట్టినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు మొత్తం జడ్జెట్లో 70 శాతం కేటాయించాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు అత్యధిక జడ్జెట్ కేటాయిందన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి రైల్వేస్టేషన్ల సుందరీకరణకు, కేంద్రీయ విశ్వవిద్యాలయం, సైనిక పాఠశాలలు ఏర్పాటుకు బడ్జెట్లో కేటాయించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరు గారిచే దిశగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

## పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్రనిరాశే

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**కరీంనగర్ :** నిరుద్యోగ సమస్యతో కొట్టుమిట్టాడుతున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపించకుండా, పేదలకు ధనికులకు మధ్య అంతరాలను తొలగించడానికి మార్గం చూపకుండా కేంద్ర బడ్జెట్ ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. పార్లమెంటులో కేంద్ర మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తుంటే పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా ఎదగడానికి అవకాశాలు కల్పిస్తున్నట్లుగా ఉందని, బడ్జెట్ పేద మధ్యతరగతి ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందని అన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ఏమాత్రం చొరవచూపడం లేదని ఆ దిశగా బడ్జెట్ లేదని, కార్పోరేట్స్‌కే అనుకూలంగా ఉన్నదన్నారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపడం పట్ల రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేలా..

బడ్జెట్‌పై సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**నిజామాబాద్ :** కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచి పెట్టేలా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. కార్మిక కర్షక రంగాలను విస్మరించారన్నారు. విద్య, ప్రజారోగ్యం కోసం అవసరమైన కేటాయింపులు లేవన్నారు. ఉపాధిహామీ పథకానికి కేటాయింపులు తగ్గిస్తూ దాన్న ఎత్తివేసే కుట్ర చేస్తున్నారు. ఈసారైనా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీలో చేర్చి సామాన్యులకు ఉపశమనం కల్పిస్తారనుకుంటే కేంద్రం తన దోపిడీని కొనసాగిస్తుందన్నారు. నిజామాబాద్ జిల్లాకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బిజెపి నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపిలు ఉన్నా రాష్ట్రానికి బడ్జెట్‌లో ఓరిగిందేమి లేదన్నారు. పసుపు బోర్డుకు ప్రత్యేకంగా నిధుల ప్రస్తావన లేదన్నారు. కార్మిక వర్గానికి కనీస ఉపశమన చర్యలు లేదన్నారు. వారికి ఉద్యోగ, ఆరోగ్య భద్రతకు భరోసా లేదు, కనీస వేతనాల అమలుపై ఊసే లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గింపు లేదు. విద్యాసంస్థల స్థాపన ప్రస్తావన లేదు. స్థూలంగా దేశ ప్రజలను దోపిడి చేసే బడ్జెట్ ఇది.

## విద్య వైద్యం, వ్యవసాయంపై నిర్లక్ష్యం

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకే అనుకూలంగా ఉందని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం ఆరోపించారు. విద్య వైద్యం వ్యవసాయ రంగాలకు అరకొర నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేశారని ధనల నియంత్రణ బడ్జెట్లో ప్రస్తావన లేదన్నారు ఆదాయపు పన్ను తగ్గింపు పై ఆశగా ఎదురుచూసిన మధ్యతరగతి ఉద్యోగులకు నిరాశే ఎదురైందని ఉపాధ్యాయ అవకాశాలు కల్పించడానికి బలహీన వర్గాలకు ఉపశమనం కలిగించేలా బడ్జెట్లో నిర్మాణాత్మక సంస్కరణలు లేవని తెలిపారు అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి మరోసారి మండి చేయి చూపించారని పేర్కొన్నారు. కార్పొరేట్ పన్నులు పెంచి సంపద పునర్వినియోగం చేయాల్సిన బదులు, పరోక్ష పన్నుల రూపంలో పేదలపై, మధ్యతరగతిపై భారం మోపుతోందన్నారు. రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, అణగారిన వర్గాలు మరోసారి విస్మరించబడ్డాయన్నారు,

## తెలంగాణను వంచించిన కేంద్ర బడ్జెట్

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్



**సిద్దిపేట :** కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు మరోసారి మొండిచెయ్యి చూపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆరోపించారు. రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలకు ఏలాంటి కేటాయింపులు, ప్రకటనలు చేయకుండ కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పర్చిందన్నారు. బిజెపి విభజన హామీలు, స్టీల్ ప్యాక్టరీలు, హైదరాబాద్‌కు మెట్రో. రీజనల్ రింగ్‌రోడ్డు, ఒక సాగునీటి ప్రాజెక్టు. జాతీయ హోదాను బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్య నిరుద్యోగం. ఆర్థిక అంతరాలకు సంబంధించి ఏలాంటి పరిష్కారం చూపలేదన్నారు. ఈ బడ్జెట్ మధ్య తరగతి పేదలకు ఉపశమనం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపటం పట్ల రాష్ట్రం నుండి ఎన్నికైన కేంద్ర మంత్రులు బిజెపి ఎంపిలకు ప్రజలు సమాధానం చెప్పాలని మంద పవన్ డిమాండ్ చేశారు.

## కార్పొరేట్ల కోసం కార్మికుల బతుకులను ఆగం చేస్తున్న కేంద్రం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు ధ్వజం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడడం లక్ష్యంగా కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, దీంతో కార్మికులు పోరాడిసాధించుకున్న చట్టాలన్నీ నిర్వీర్యం అయిపోతాయని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ లక్ష్మిగార్డెన్‌లో ఈనెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె విజయవంతం కోసం నిర్వహించిన సన్నాహకంగా ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, కార్మిక సంఘాల రంగారెడ్డి జిల్లా స్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు కార్మిక సంఘాలు పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కవిత, ఐఎన్‌టియుసి జిల్లా నాయకుడు శివ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకురాలు సుజాత మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, జిల్లా ఉపప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, జిల్లా కార్యదర్శి చందు యాదవ్, వడ్ల సత్యనారాయణ, ఎస్.మల్లేష్ కన్యగారి నరసింహారెడ్డి, రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దు..

**ప్రజాపక్షం/ నర్సంపేట :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వాడొద్దని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట సిటిజన్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో పట్టణానికి చెందిన అంకాల దుర్గాప్రసాద్ కూతురి సారీ ఫంక్షన్‌కు విచ్చేసిన ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆశీర్వదించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత విస్తరాకు ప్లేట్స్‌లో విందును స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహితం గా విందును విస్తరాకు ప్లేట్స్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విందుకు విచ్చేసిన వారందరి ఆరోగ్యాన్ని రక్షించినవారయ్యారని వారిని అభినందించారు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్స్, కవర్‌లలో వేడివేడి ఆహారం తీసుకొని అనారోగ్య పాలు కావొద్దన్నారు. ఈకార్యక్రమంలో డఫోడీల్స్ స్కూల్ చైర్మన్ చింతల నరేందర్, నిరంజన్, పెండెం రామానంద్, లక్ష్మణ్, అంకాలసాంబయ్య, వేములసాంబయ్య తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావాలి అమలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పితెలిపారు.అలాగే భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఇతర వ్యక్తులు లేదా రాజకీయ పార్టీలను కించపరిచే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాలలో అటువంటి పోస్టులు పెట్టినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## టెన్ మినహాయింపు కోరుతూ 5న ఛలో ఢిల్లీ




**ప్రజాపక్షం/జనగామ టౌన్:** టెన్ మినహాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న నిర్వహించే ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, తదితర సమస్యల పరిష్కారంతో ఫిబ్రవరి 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో , రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాణి, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కుమారి, రాజు, రంజిత్ కుమార్, రవి ప్రసాద్ గౌడ్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ శ్రేణుల ధర్నా



**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణ మాజీముఖ్యమంత్రి కేసిఆర్‌కు సిట్ అధికారుల నోటీసులు ఇచ్చిన సంధర్భంగా మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం బిఆర్‌ఎస్ పార్టీ మండలఇంచార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు,సంధర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ మాజీముఖ్యమంత్రి కేసిఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని బిఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రేస్ పార్టీ ఓటమి భయముతోనే కక్షపూరితంగానే విచారణ చేపట్టడం జరుగుతోందని బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామకన్వీనర్ సూత్రపు సంపత్,గోవింద సురేష్,మాధవరెడ్డి,చాడ విజేందర్‌రెడ్డి,బుట్టి సురేష్‌యాదవ్,జానీ.జోడుముంతల కిరణ్,బత్తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కక్ష పూరిత రాజకీయాలు చేస్తే సహించం

**ప్రజాపక్షం/ చెన్నారావు పేట :** కక్ష రాజకీయాలు చేస్తే తెలంగాణ ప్రజలు సహించారని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. ఆదివారం చెన్నారావుపేట గ్రామంలో నెక్కొండ నర్సంపేట ప్రధాన రహదారిపై సీఎం డాం డాం అంటూ ర్యాలీ నిర్వహించి సిఎం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండ కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ పై అక్రమ కేసులు, సిట్ నోటీసులతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన నాయకుడిని లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమేనని ఆమె ఆరోపించారు.కక్ష రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ సహించరని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, బి ఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, టిఆర్ఎస్ మండల నాయకులు భూక్య శ్రీను నాయక్,భూక్య రవీందర్ నాయక్, కోర్ర మోహన్ లతోపాటు కార్యకర్తలు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## కెసిఆర్‌పై అక్రమ కేసులను ఎత్తివేయాలి

బిఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ బిఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళా అధ్యోఉరాలు కేదారి గీతాబాయి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ప్రధాన కూడలి,బొమ్మాపూర్ క్రాస్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేసారు.అనంతరం గీతాబాయి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాడిన తెలంగాణ మహాత్ముని కేసులతో ఇబ్బందులు పెట్టడం సరికాదని అన్నారు.పాలనపై దృష్టి పెట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు పెండ్యాల మనోహర్,నాగుల లోక్మ రెడ్డి,రాజశేఖర్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

వర్ధన్నపేట ఎమ్మెల్యే, కె.ఆర్. నాగరాజు

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్‌లో గల రహమత్ నగర్, జయశంకర్ కాలనీల్లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మహమ్మద్ ఆయూబ్ సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ రహమత్ నగర్, జయశంకర్ కాలనీల ప్రజలు ఎన్నేళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ముస్లిం కబ్రస్థాన్, హిందూ స్మశాన వాటిక స్థలాల మంజూరు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కరెంట్ స్తంభాల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ మే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఒక్క నిరుపేద కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో వర్ధన్నపేట నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వీటిలో దాదాపు 3,000 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఇంకా స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రాబోయే ఏప్రిల్ నెలలో రెండో విడతగా మరో 3,500 ఇళ్లను మంజూరు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.అదేవిధంగా మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, రాబోయే 2 నుంచి 3 నెలల లోపల అర్హులైన ప్రతి మైనారిటీ మహిళకు కుట్టు మిషన్ అందజేస్తామని తెలిపారు. చట్టం నందు ప్రతి ఒక్కరు సమానమే అని బిఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలను చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దయచేసి యావత్ తెలంగాణ ప్రజలందరూ గమనించాలని అన్నారు. చట్టం ముందు ఎవరు పెద్దవారు, చిన్నవారు కాదని, అందరికీ ఒకటే న్యాయం, ఒకటే ధర్మం ఉంటుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ నినాదం ఒక్కటేనని, నిరుపేదలకు కూడు, గుడ్డ, నీడ అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. అందుకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని ప్రజలను కోరారు.



**మదర్సా అరబయ్యా సిరాజుల్ ఉలూన్ పాఠశాల సందర్శన**

మదర్సా అరబయ్యా సిరాజుల్ ఉలూన్ పాఠశాల వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నాగరాజు మదర్సాను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, నిర్వాహకులు, మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మదర్సా అరబయ్యా సిరాజుల్ ఉలూన్ పాఠశాల ప్రధాన సమస్యగా ఉన్న కమ్యూనిటీ నిర్మాణం అవసరాన్ని యాజమాన్యం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని, మైనారిటీల విద్య, ఉపాధి, అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ చట్టానికి వ్యతిరేకంగా మీరు కూడా తీర్మానం చేసి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి పంపించి, ఉపాధి హామీ కూలీలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే నాగరాజు మదర్సా ప్రతినిధులను, ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, స్థానిక కార్పొరేటర్ ఈ దురు అరుణ – విక్టర్, మండల అధ్యక్షుడు వద్దేపల్లి ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు చింత ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, నక్క కొమ్మురెల్లి యాదవ్, రాజ కుమార్, అరుణ మైనారిటీ నాయకులు రఫీ, వెంకన్నతో పాటు కాలనీ వాసులు, మైనారిటీ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం..

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటే ఇదేనా.. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగేదేమీ లేదని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆదివారం లోకసభలో ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ చేనేతన్నలను పూర్తిగా నిరాశపరచిందని, దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కలిగించే చేనేత రంగం పై కోట్లాదిమంది ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వ మిల్లుల అనుకూల విధానాలతో చేనేత పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో ఉండగా దానిని ఆదుకునేందుకు బడ్జెట్లో కనీసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని చేనేత సంఘాలు డిమాండ్ చేస్తే పెడచెవిన పెట్టిన కేంద్ర ప్రభుత్వం రూ. 53,47,315 కోట్ల భారీ బడ్జెట్ లో చేనేత రంగానికి ముష్టి వేసినట్లు కేవలం రూ.200 కోట్లు మాత్రమే ప్రతిపాదించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మన దేశ చేనేత పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకునే బదులు గతంలో ఉన్న సంక్షేమ పథకాలను, ఆల్ ఇండియా హాండ్లూమ్ బోర్డును రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం చేనేత పై జిఎస్‌టి విధించి చేనేతను నిర్మూలించడానికి కంకణం కట్టుకోవడం దుర్మార్గమన్నారు. ఆగస్టు 7న సంవత్సరానికి ఒక రోజు చేనేత దినోత్సవం జరిపి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. చేనేత పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఉపాధి కోల్పోయి పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. మేడిపండు లాంటి ఈ బడ్జెట్ తో పేదలకు ఒరిగేదేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి బడ్జెట్ ను సవరించి చేనేతకునిధులను పెంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు .

## మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సిపిఐ నేతల భేటీ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మానుకోట ఆదివారం మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్ రాష్ట్ర రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమాతో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బిఅజయ్ సారథి రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో పొత్తులపై చర్చించారు. ఇటీవల హైదరాబాద్. అర్పణపల్లి, మహబూబాబాద్‌లో పలు దఫాలుగా ఎన్నికల పొత్తుపై చర్చించినట్లు ఆయన తెలిపారు. పొత్తులు చివరి దశకు వచ్చాయని మున్సిపాలిటీ ఎన్నికల్లో కలసి ముందుకు పోదామని ఇరు పార్టీల నేతలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సిపిఐ నేతలు బి విజయ సారథి బి అజయ్ సారధి రెడ్డిలతో సిపిఐ కాంగ్రెస్ ప్రతి ఎన్నికల్లో కలసి పనిచేస్తున్నామని వచ్చే మున్సిపాలిటీ ఎన్నికలు కూడా కలసి పనిచేసే మానుకోట మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని తెలిపారు. చర్చలు సఫలం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు గణపురపు అంజయ్య, నర్సింగ్ శ్రీను, పెరుగు కుమార్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపు చర్యనే

మాజీ చీఫ్ విప్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్* బిఆర్‌ఎస్ బైక్ ర్యాలీ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజల్లో కెసిఆర్‌ను పలచన చేసేందుకే కుంచిత మనసుతో ప్రభుత్వం నోటీసులు, కమిషన్లు , సిట్‌ల పేరిట వేధింపులకు గురి చేస్తోందని, ఎన్ని కేసులు, నోటీసులు, సిట్‌లు, ఎన్ని వేసినా ప్రజల తరపున కేసీఆర్ సైన్యంమైన తాము పోరాడుతామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు, బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి నక్కలగుట్ట అదాలత్ అంబేద్కర్ సర్కిల్ పబ్లిక్ గార్డెన్ హనుమకొండ చౌరస్తా ములుగు రోడ్ ఎంజిఎం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంజిఎం సర్కిల్‌లో ప్రభుత్వ, రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు.కాగా ధర్నాలో పోలీసులు బిఆర్ఎస్ శ్రేణుల మధ్య జరిగిన తోపులాటలో దాస్యం వినయ్ భాస్కర్ గారు గాయపడ్డారు.ధర్నా అనంతరం దాస్యం వినయ్ భాస్కర్‌ను, గులాబీ శ్రేణులను



అరెస్ట్ చేసి మట్టెవాడ పోలీసు స్టేషన్ కు తరలించి పోలీస్‌లు కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి కన్నీటి గోస తీర్చిన అపర భగీరథుడు కెసిఆర్ అనిఅన్నారు.గాంధీజీ, అంబేద్కర్ ఆశయాల బాటలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన పరిపాలనాధక్షుడు కెసిఆర్ అన్నారు. నోటీసులు, కమిషన్లు, కేసులు, కుట్రలు ఎన్ని చేసినా ఆయన చిటికెన వేలుకు ఉన్న వెంట్రుకతో సమానం అన్నారు. సిట్‌లు కేసులు, కమిషన్లు ఎదుర్కొంటాం, పోరాడుతాం, ప్రజల పక్షాన నిలబడతామని,మీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు కెసిఆర్ భయపడరుఅన్నారు. సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకమని, సుప్రీం కోర్టు తీర్పులను సీట్ అధికారులు తుంగలో తొక్కారని, సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీకి గ్రామ స్థాయిలో వచ్చిన ఆదరణ, పంచాయతీ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు చూపిన తెగువకు భయపడి మున్సిపల్ ఎన్నికల సమయంలో కావాలనే నోటీసులు ఇచ్చారన్నారు. సిఆర్‌పిసి 160 నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ కాంగ్రెస్ సర్కారు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు.కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజా క్షేత్రంలో తిప్పికొడతామని,రాష్ట్రంలోని మెజార్టీ మున్సిపాలిటీలు బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ,420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడం చేతకాక ప్రజల తరపున ప్రతిపక్ష పార్టీ నేతలను కేసుల పేరుతో విచారణ పేరుతో వేధిస్తోందన్నారు.

## చరిత్రాత్మక పరకాలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తా

పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజాపక్షం/పరకాల :** చారిత్రక పరకాల కు పూర్వ వైభవం తీసుకు వస్తానని, మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేద్దామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్ లో నిర్వహించిన పద్మశాలి కులస్తుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అంతకముందు భక్త మార్కండేయ, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల శాసనసభ్యుడిగా తనను గెలిపించడంలో పద్మశాలి కులస్తులది క్రియాశీలకమైన పాత్ర ఉందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఒక ప్రత్యేకమైన డి పి ఆర్ వ్యవస్థతో మంచినీటి వ్యవస్థ, సిసి రోడ్, డ్రైనేజ్ వ్యవస్థ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.పరకాలను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, టాస్క్, సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## హామీలను వదిలేసి, కుట్రలకు తెరలేపుతున్న ప్రభుత్వం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/తొర్రూరు :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వదిలేసి కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించగా ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించి దేశానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. ఎఫ్ఐఆర్ లేకుండానే విచారణ చేపట్టడం పనికిమాలిన చర్య అని అన్నారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమైన వ్యవహారమన్నారు. కాంగ్రెస్, బిజెపిరెండు పార్టీలు ఏకమై కేసీఆర్‌పై విషం కక్కుతున్నారని ఆరోపించారు. ప్రతీసారి ఎన్నికలు వచ్చిన సమయంలో కెసిఆర్‌పై ఇలాంటి ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. ఇది స్కీంల ప్రభుత్వం కాదని, స్కాంల ప్రభుత్వమని అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇటువంటి నోటీసులు జారీ చేస్తున్నారని స్పష్టం చేశారు. కొంతమంది అధికారులు ఆత్మాభిమానం చంపుకొని పాలకుల ఒత్తిళ్లకు లోబడి పని చేస్తున్నారని ఆరోపించారు. 65ఏళ్లు దాటిన వ్యక్తిని వారు కోరిన చోటే విచారించాలన్నది చట్టమని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే ఆగం చేసిందన్నారు. తొర్రూరులో వంద పడకల ఆసుపత్రి తీసుకొస్తే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం మూలన పడేసిందన్నారు. పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని పట్టణ ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో సరైన సమాధానం చెబుతారని అన్నారు.



**కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్‌ఎస్ పార్టీలో చేరికలు....**

మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ద్రసు తండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో పదమూడవ వార్డు ద్రసు తండాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి బీఆర్ఎస్ పార్టీ కండువాలను కప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ వార్డులు అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యమని, ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి చూసి ఆదరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఓటర్లను అభ్యర్థించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సీఆర్ నగర్, బాంబులగడ్డ లో ఉభయ కమ్యూనిస్టులు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఎర్రవెల్లి అరుణ్ రావు గెలుపు కొరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూపాలపల్లి మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ తదితరులు ఉన్నారు.

## బాలలు పనిలో కాదు.. బడిలో వుండాలి




వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** చిన్నారులు పనుల్లో కాకుండా బడి వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్XII కార్యక్రమంలో ద్వారా మొత్తం 179 మంది చిన్నారులకు చాకిరీ నుండి విముక్తి అయినట్లుగా వరంగల్ పోలీస్ కమీషనర్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 12వ విడత లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 31 రోజుల పాటు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఆధ్వర్యంలో తొమ్మిది డివిజన్ల చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాలకు చెందిన బాలల పరిరక్షణ విభాగం , చైల్డ్ హెల్ప్ లైన్, కార్మిక శాఖ కు చెందిన అధికారులు, సిబ్బంది అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థల సిబ్బందితో ఏర్పాటు చేసిన తొమ్మిది ప్రత్యేక బృందాలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పారిశ్రామిక ప్రాంతాలు, షాపులు, ఇటుక తయారీ కేంద్రాల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో తనిఖీ చేపట్టాగా, ఈ తనిఖీల్లో 179 బాల కార్మికులను గుర్తించడం జరిగింది. ఇందులో 150 మంది బాలురు, 29 బాలికలు అలాగే పోలీసులు రక్షించిన చిన్నారుల్లో మధ్యలో చదువు మానేసిన 14 మంది చిన్నారులు వున్నారు. వీరిలో బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్ మరియు అస్సాం రాష్ట్రాలకు చెందిన 87 మంది చిన్నారులు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు.అలాగే రక్షించబడిన చిన్నారులను ఆయా జిల్లాలకు చెందిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరు పరిచి, పిల్లలకు మరియు వారు తల్లి తండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి అప్పగించడమైంది. ప్రధానంగా చిన్నారులతో పనులు చేయించుకున్నందుకు యజమానులపై 51 కేసులు నమోదు కాగా, కార్మిక శాఖ చేత 53 ఐ. ఆర్ నమోదు అయ్యాయి. మరో 61 మంది చిన్నారులపై పోలీసులు దృష్టి పెట్టేందుకు స్థానిక పోలీస్ స్టేషన్లలో చిన్నారుల వివరాలను అందజేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చిన్నారుల బాల్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,చిన్నారుల హక్కులను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఎవరైనా బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే వారిపై ఖండించిన తప్పవని, బాల కార్మిక వ్యవస్థ రహితం కమిషనరేటే మనందరి లక్ష్యమని సిపితెలిపారు. ఆపరేషన్ స్మైల్ 12 విడత విజయవంతంగా పూర్తి చేయడంలో ప్రతిభగైన వచ్చినా అడిషనల్ డిసి,వరంగల్ కమిషనరేట్ స్పెషల్ జువైనైల్ పోలీస్ అధికారి ఎన్. రవి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఇన్స్ స్పెక్టర్ జె. శ్యామ్ సుందర్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా,శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ , లేబర్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లతో పాటు షేర్, స్కోప్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థలు,చైల్డ్ లైన్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందనలు తెలియజేసారు.

## బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్య క్యాంపులు



**ప్రజాపక్షం/బోనకల్ :** నిర్విరామంగా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్య క్యాంపుల సేవలు మండల ప్రజలకు అందుతున్నాయని ప్రముఖ జనరల్, బిపి, షుగర్ వైద్యు లు టి పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెలమొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్ 65వ క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్‌కుమార్ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం లను అదుపులో ఉంచుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి చాలా కీలకమని అన్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, కళ్లు మరియు నరాలపై తీవ్ర పడుతుందని అన్నారు. క్రమబద్ధమైన తనిఖీలు, సరైన మందులు, ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం ద్వారా ఈ వ్యాధులను అప్రమత్తంగా నియంత్రివచ్చని తెలిపారు. రక్తపోటు, బ్లడ్ షుగర్ స్థాయిలను తరుచుగా పరీక్షించుకొని రికార్డులను నిర్వహించాలని అన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు కనీసం 30 నిమిషాల వేగవంతమైన నడక లేదా వ్యాయామం చేయాలని అన్నారు. షుగర్ లేదా బిపి సాధారణంగా ఉన్నా, వైద్యులు సూచించిన మందులు ఆపకుండా వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, క్యాంపు సహాయకులు యంగల గిరి, బొమ్మ సతీష్‌కుమార్, గోపి, సిపిఎం నాయకులు షేక్ నజీరు, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థిక భరోసా కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మండల పరిధిలోని వేపకుంట్ల, చెరువుకొమ్ముతండా గ్రామాల్లో లద్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుకొమ్ము తండా సర్పంచ్ భూక్యా భాషా, నాయకులు రేమళ్ల రమేష్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో షూట్‌లో అవార్డు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా వాసి ఐ మార్క్ జగన్ ఆధ్వర్యంలో మోతుగూడెంలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పాట్ కాంపిటేషన్ నందు ఖమ్మం నగరానికి చెందిన అరుణ్ స్టూడియో అధినేత అరుణ్‌కు మోడ్రన్ ఫోటోగ్రఫీలో అవార్డు దక్కింది. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ బికె అగ్రావల్, ఖమ్మం నగర సీనియర్ ఫోటోగ్రాఫర్ సిఎన్‌సి శ్రీనివాసరావు, వర్క్‌షాప్ నిర్వాహకులు ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాలకు చెందిన 50 మంది ఫోటోగ్రాఫర్లు వర్క్‌షాపులో పలు అంశాలపై మేళకువలు నేర్చుకున్నారు. 15 మందికి మూడు విభాగాల్లో అవార్డులు అందించారు. భద్రాచలం సీనియర్ ఫోటోగ్రాఫర్ ఎస్‌కె షరీఫ్ జ్ఞాపకార్థం అవార్డును ప్రదానం చేశారు. ఖమ్మంజిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్, కోశాధికారి తిరుపతిరావు లు అవార్డులు గెలుపొందిన ఫోటోగ్రాఫర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో రవికుమార్, ప్రసాద్, పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## ఖైదీల ఉపాధికి అగరబత్తీల తయారీ

### స్టాల్ ప్రారంభించిన జైలర్ ఉపేందర్




**ప్రజాపక్షం/భద్రాచలం :** విచారణ ఖైదీల ఉపాధి కోసం స్థానిక సబ్ జైల్లో అగరబత్తీల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. వాడిపోయిన పువ్వులతో తయారు చేస్తున్న ఆగరబత్తీలు ఎంతో సువసను వెదజల్లుతున్నాయి. ఖైదు పూర్తయిన అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వారు దీనిని ఆసరగా చేసుకుని అగరబత్తీలు తయారీతో జీవనం సాగించేందుకు వీలుగా ఉంటుందని జైలర్ ఉపేందర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఖైదీల ప్రవర్తనలో మార్పు వస్తుందని, సమాజంలో మంచిపేరు తెచ్చుకుని జీవించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని జైలర్ అంటున్నారు. ఎలాంటి ఇతర నష్టాలు లేకుండా పూర్తి ఆరోగ్యకరమైన పదార్థాలతో, రామాలయంతో పాటు ఇతర దేవాలయాల నుండి సేకరించిన వాడిపోయిన పువ్వులతో అగరు బత్తీలను తయారు చేసి ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నారు. ఖైదీలు తయారు చేసిన ఆగరు బత్తీల స్టాల్‌ను రామాలయ పరిసరాల్లో విక్రయించేందుకు స్టాల్‌ను కూడా ఏర్పాటు చేశారు. వీటి విక్రయాల ద్వారా వచ్చిన ఆర్థికలాభాలు పూర్తిగా ఖైదీలకే అందుతాయని జైలర్ తెలిపారు.

## బిఆర్ఎస్ శ్రేణులు నిరసన

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసినందుకు నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండల వ్యాప్తంగా ఆదివారం అన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బిఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు ధోరణిని అవలంబిస్తుందని నాయకులు తెలిపారు. తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పిలవడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు మాధంశెట్టి హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మణ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు నున్నా శ్రీనివాసరావు, పొట్లపల్లి నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, చెరుకూరి భిక్షమయ్య, తొలపనూరి దానయ్య, కుతుంబాక నరేష్, భీమా, తేజావత్ రామోజీ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

### ప్రభుత్వ పథకాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లండి
### ఐక్యతతోనే విజయం సాధ్యం
### మంత్రి కొండా సురేఖ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మున్సిపల్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలాలని, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకొని ప్రతి ఇంటి గడపగడపను తట్టాలని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల క్షేత్రంలో పార్టీ జెండా రెపరెపలాడడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం పోటీ ఉండటం సహజమని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీలోని 32వార్డులకుగాను కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంపై ఆమె స్పందిస్తూ, మనలో మనమే కొట్లాడుకుంటే మూడో వ్యక్తి గెలిచే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నేతలు చొరవ తీసుకొని అభ్యర్థులందరినీ ఏకతాటిపైకి తేవడం అభినందనీయమని పేర్కొన్నారు. వార్డుకు ఒక్కరే అభ్యర్థి ఉండేలా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

**ప్రజాక్షేత్రంలో సంక్షేమ విజయాలు**

మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రతి కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చాయని ఆమె గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో పాలేరునియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఇదే ఊపుతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకొని ఆయనకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ప్రచార హోరుకు సర్వం సిద్ధం**

సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బిఫామ్‌లు అందజేస్తామని, అప్పటి నుంచే ముమ్మర ప్రచారం మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. వార్డుల్లో ఘన విజయం సాధిస్తేనే మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కుతుందని, ఐక్యతతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ మిత్రపక్షమే**

ఐక్యతతో ఉంటేనే అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని గత పంచాయతీ ఎన్నికల్లో మాదిరి మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో కూడా విజయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. ఒక ప్రశ్నకు సురేఖ సమాధానం ఇస్తూ సిపిఐ ఇప్పటికీ తమ మిత్రపక్షమేనని సీట్ల కేటాయింపుకు సంబంధించి స్థానిక నాయకుల అభిప్రాయాలు ప్రధానమని ఆమె తెలిపారు.

## విలువలతో కూడిన వారిని ఆదరించండి

### పాల్వంచ అభివృద్ధికి సహకరించాలి
### పాల్వంచకు ఎన్నికలు తెచ్చిన ఘనత ఎంఎల్‌ఎ కూనంనేనిదే



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం కార్పోరేషన్ పరిధి పాల్వంచ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థులు జోరుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణం మరింత అభివృద్ధికావాలంటే ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు మద్దతునివ్వాలంటూ కోరుతున్నారు. సుమారు 30 సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవటంతో పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్‌లోని కొన్ని గ్రామాలను కలిపి కొత్తగూడెం కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసి పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత కేవలం ఎంఎల్‌ఎ కూనంనేనిదే అన్నారు. దీనితో పా ల్వంచ అన్ని రంగాలలో మరింత అభివృద్ధి జరిగేందుకు పాటు పడిన కూనంనేని నాయకత్వాన్ని బలపరిచి సిపిఐ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామంటూ సిపిఐ బలపరిచిన 35వ డివిజన్ అభ్యర్థి నామా కీర్తి, 38వ, డివిజన్ చెరుకూరి శేఖర్, 44వ, డివిజన్ అభ్యర్థి వీసంశెట్టి విశ్వేశ్వరరావులు అన్నారు. ఆయా డివిజన్‌లలో ఆదివారం కార్యకర్తలు, అభిమానులతో కలిసి విస్తతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ ఓటేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా పాల్వంచ అభివృద్ధికి కూనంనేని చేస్తున్న కృషిని తెలిపారు. వివిధ గ్రాంట్ల నుండి కోట్ల నిధులను తెచ్చి అభివృద్ధి పనులను చేపట్టారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతామని హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్రణాళికను తయారు చేసి ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో పనులను చేస్తామన్నారు. లంచాలకు తావులేని పాలన కొనసాగిస్తామని, అవినీతికి ఆస్కారం లేని అభివృద్ధి పనులను పూర్తి చేసి పదికాలాల పాటు ప్రజలు గుర్తుంచుకొనే విధంగా డివిజన్‌లను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని స్పష్టం చేశారు.

**సిపిఐ అభ్యర్థులను గెలిపించండి ..**

వందేండ్ల చరిత్ర కలిగిన సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, అభివృద్ధి పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరారు. పాల్వంచ డివిజన్‌లోని పలు డివిజన్‌లలో సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్ల నిధులను తెచ్చి పాల్వంచ అభివృద్ధికి ఎంఎల్‌ఏకూనంనేని సాంబశివరావు పాటు పడుతున్నారని చెప్పారు. పాల్వంచ పట్టణ అభివృద్ధికి ఎంఎల్‌ఎ కూనంనేని ఓ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని అన్నారు. సమర్థవంతమైన ఎంఎల్‌ఎ కూనంనేని సారథ్యంలో పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవటానికి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సిపిఐ ప్రచార హోరు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ, 28వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రచార హోరు దద్దరిల్లింది. ఎర్రజెండాల రెపరెపలనడుమ, డప్పు శబ్దాలు, జై సిపిఐ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.ఈ సందర్భంగా సిపిఐ అభ్యర్థి దండి రంగారావు గడగడపకు వెళ్లి ఓటర్లను కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఓటు కోసం ఈరోజు మీ ముందుకు వచ్చిన వ్యక్తిని కాదని, నిత్యం మీ మధ్యలో ఉన్ననన్నారు. ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీగా సర్వీస్ అందిస్తూ ప్రజల తలలో నాలుకగా సేవలు అందించినట్టు తెలిపారు. మున్ముందు కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించడంతో పాటు ప్రజల కష్టసుఖల్లో ఉంటానని నిండుమనసుతో నా అభ్యర్థిత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారం సాంతం ప్రజల దీవెనలు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, చిన్నారుల సాక్షిగా ఉత్సాహభరితంగా సాగింది.

## అడ్మిషన్లు అడ్డుకున్న వామపక్ష విద్యార్థి సంఘాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫేక్ కన్సల్టెన్సీలు, ఫేక్ యూనివర్సిటీలతో విద్యా మహోత్సవం పేరుతో ఖమ్మంలో చేపట్టిన అడ్మిషన్లను వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇంజనీరింగ్, నీట్ అడ్మిషన్ల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర రాష్ట్రాల ఫేక్ యూనివర్సిటీలు, ఫేక్ కన్సల్టెన్సీలతో నిర్వహించిన విద్యా మహోత్సవాన్ని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పోలీసులకు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, చింతల రమేష్, గోకినేపల్లి మస్తాన్, అశోక్, సురేష్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగకముందే అడ్మిషన్ల పేరుతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఫేక్ యూనివర్సిటీలు, కన్సల్టెన్సీలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా ఇలా అడ్మిషన్ల కోసం విద్యా మహోత్సవం అంటూ ఈవెంట్లు నిర్వహించడం శోచనీయమన్నారు. మాయ మాటలతో ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, నీట్ అంటూ అడ్మిషన్లను విద్యార్థులను ఆకర్షిస్తూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి ఫేక్ యూనివర్సిటీలు, కన్సల్టెన్సీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాగులమీరా, పవన్, చైతన్య సాయి, గోపి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు శ్రీనాథ్, లోకేష్, శ్రీశాంత్, గోపి, రమణ, పిడిఎస్‌యు నాయకులు శ్రీకాంత్, రాము, యశ్వంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కూరపాటి ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కూరపాటి చిల్డ్రన్స్, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆదివారం నూతన ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో అత్యాధునీక సౌకర్యాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ విభాగంతో పాటు మల్టీస్పెషాలిటీ విభాగంలో అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.తక్కువ ఖర్చుతో ఆధునాతన వైద్యాన్ని ప్రజలకు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం. కోటేశ్వరరావు, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కూరపాటి ప్రీతి, టిఎస్ఎంసి మెంబర్ కె. రవికుమార్, టిడిపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య జీవితాన్ని మార్చే ఆయుధం

### - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** విద్య జీవితాన్ని మార్చే ఏకైక ఆయుధం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 16 వసతి గృహాల్లో 10వ తరగతి చదివే 212 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందేలా, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య జీవితాలను మార్చే ఏకైక ఆయుధం అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాల్లోకి ఎదగాలన్నారు. వీటన్నిటికి తొలిమెట్టు పదో తరగతి పాస్ కావడంతోనే ప్రారంభం అవుతుందని, విద్యార్థులు చదువులతో పాటు క్రమశిక్షణ, సమయ పాలన, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సి విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డెన్ల సూచనలు పాటిస్తూ నిరంతర కృషితో ముందుకు సాగాలన్నారు. అనంతరం నిపుణులు మాట్లాడుతూ పాఠ్యాంశాలపై ఎలా పట్టు సాధించాలి, చదివిన అంశాలను ఎలా జ్ఞాపకం పెట్టుకోవాలని, పరీక్షలు రాసేసమయంలో సమయ పాలన ఎలా పాటించాలని, మంచిమార్కులు సాధించేందుకు చేయాల్సిన కృషి వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి అభివృద్ధిశాఖ అధికారిణి శ్రీలత, సహాయ సంక్షేమ అధికారులు కొప్పుల హనుమంతరావు, సిహెచ్ అక్షయ్, జిల్లాలోని వసతి గృహల సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆర్‌విఆర్ ప్రసాద్, నర్సింహారావు, సాయి చరణ్, నాగలక్ష్మీ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులను విస్మరించిన కేంద్ర బడ్జెట్

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను పూర్తిగా విస్మరించారని సంపన్న వర్గాలను ప్రోత్సహించేలా ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదన్నారు. మోదీ ప్రభుత్వం కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూలమని ఈ బడ్జెట్‌తో మరోసారి రుజువైందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్థావించ లేదన్నారు.ఉపాధి హామీ పథకం పేరు మార్చి విబి జి రామ్ జీ పేరుతో నిధులు కేటాయించిన రా ష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పడం దుర్మార్గమన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలను విస్మరించారన్నారు. దేశంలో ఎక్కువ మంది ప్రజలు ఆధారపడి ఉన్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించి సరైన కేటాయింపులు జరపలేదన్నారు. అంకెల్లో బడ్జెట్‌ను రూ. 53 లక్షల కోట్లు చూపారు తప్ప ఆదాయ మార్గాలను చూపడంలో ప్రభు త్వం వైఫల్యం చెందిందన్నారు. కార్మిక వర్గాన్ని కూడా ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. తెలంగాణ పట్ల కేంద్రం మరోసారి వివక్ష ప్రదర్శించిందని బడ్జెట్‌లో సరైన రీతిలో కేటాయింపులు జరపలేదన్నారు. ఈ బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆయన తెలిపారు.

## ఇంటింటి ప్రచారంలో సిపిఐ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఐ అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట, ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో సిపిఐ అభ్యర్థులు బరిలో నిలిచారు. కొత్తగూడెం కార్పోరేషన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా లు విస్తృత ప్రచారం నిర్వహించారు. సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే నిరంతరం ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని సిపిఐ నాయకులు ప్రజలకు వివరించారు. ప్రజలను విస్మరించి నడుచుకునే కొందరు ఎన్నికల వేళ ప్రజల ముంగిటకు వచ్చి అలవికాని వాగ్దానాలను చేస్తుంటారని అటువంటి వారిని నమ్మవద్దన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే సిపిఐ అభ్యర్థులకే మున్సిపల్ ఎన్నికల్లో పట్టం కట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పాల్వంచ పట్టణంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల సత్యనారాయణ నేతృత్వంలో సిపిఐ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



## తప్పడు కేసులతో బిఆర్ఎస్‌ను అడ్డుకోలేరు

### మాజీ మంత్రి పువ్వాడ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తప్పుడు కేసులతో బిఆర్ఎస్‌ను అడ్డుకోలేరని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను విచారణకు పిలవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన తెలిపారు. ఆందోళనను ఉద్దేశించి అజయ్‌కుమార్ మాట్లాడుతూ చట్టప్రకారం 65 ఏళ్లు నిండిన వ్యక్తిని విచారించాలంటే ఆ వ్యక్తి ఉన్న చోటనే విచారణ చేపట్టాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అలా కాకుండా విచారణ పేరుతో నోటీసులు జారీ చేసి కేసిఆర్‌ను చిన్నబుచ్చాలని చూస్తుందని అజయ్‌కుమార్ ఆరోపించారు. విచారణకు సహకరిస్తానని చెప్పినా సిట్ అధికారులు ఈవిధంగా వ్యవహరించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది పోలీస్ అధికారులకు మాత్రమే సంబంధించిందని ఆయన స్పష్టం చేశారు.

## కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్

### సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంకెలు, మేడిపండు మాటలు, తేనె పూతతో ప్రజలను ఏమార్చి కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రాష్ట్రాలకు మొండి చేయి చూపించి పాత నిధులనే కేటాయించి ఫెడరల్ విధానాన్ని అపహాస్యం చేశారన్నారు. కార్పొరేట్ వర్గాల భవిష్యత్తు కర్తవ్యాలను నెరవేర్చే కృషిలో డేటా సెంటర్ల ఏర్పాటుకు భారీ పెట్టుబడులకు ప్రోత్సాహ మిచ్చారన్నారు. చిన్న పరిశ్రమలకు రూ. 10వేల కోట్లు కేటాయించి ఊసురుమనిపించారన్నారు. వ్యవసాయ రంగానికి, విద్య, వైద్య రంగాలకు అదనంగా కేటాయించింది ఏమి లేదన్నారు. మౌలిక వనరులంటూ సంక్షేమ కార్యక్రమాలకు కోత మొదలైందని, ఉద్యోగాల కల్పనకు కొత్త అవకాశాలు లేవన్నారు. తెలంగాణకు సాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏ మాత్రం ప్రయత్నించ లేదన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వసూలు చేసుకుంటూ రాష్ట్రాలకు మాత్రం అరకొరగా నిధులు ఇవ్వడం అన్యాయమన్నారు.

“ కమల హాసన్ సమర్పణలో లీడ్ ఆన్ గాంధీ అమరవీరుల దినోత్సవం నాడు, కమల్ హాసన్, గోపాల కృష్ణ గాంధీ సందేశాలతో రూపొందిన లీడ్ ఆన్ గాంధీ అనే పవర్ ఫుల్ డాక్యుమెంటరీ విడుదలైంది. భారతదేశ నైతికత, ప్రజాస్వామ్య విలువల నుంచి పుట్టిన గొంతులు ఇందులో వినిపిస్తాయి. ”

# రీల్



## ఫంకీ' నుంచి 'రట్టాటటావ్' పాట

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్‌లలో అడుగు పెట్టనున్న 'ఫంకీ' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, మొదటి గీతం 'ధీరే ధీరే'కు అద్భుతమైన స్పందన లభించింది. గాయకుడు రామ్ మిరియాల తన గాత్రంతో ఈ పాటకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. గీతావిష్కరణ కార్యక్రమంలో కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ నా మొదటి సినిమా నుంచే ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. వెళ్ళిపోమాకే, ఈ నగరానికి ఏమైంది, ఫలక్‌నామా దాస్, హిట్ ఇలా మంచి సినిమా చేసిన ప్రతిసారీ నన్ను సపోర్ట్ చేశారు. నా గత చిత్రాలు ఒకట్రెండు మిమ్మల్ని పూర్తిస్థాయిలో మెప్పించలేకపోయాయి. మీ అందరి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాను. 'ఫంకీ' సినిమాతో మళ్ళీ ఒకటి నుంచి మొదలుపెడుతున్నాను. ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అనుదీప్ ప్రత్యేకమైన వ్యక్తి. తనతో పని చేసిన తర్వాత నేను సినిమాని, జీవితాన్ని చూసే కోణం మారిపోయింది. అనుదీప్ రచన, హాస్యం భిన్నంగా ఉంటుంది. ఫంకీ మీ అందరికీ మంచి అనుభూతిని ఇస్తుంది. ఫిబ్రవరి 13న థియేటర్‌లకు వచ్చి ఈ సినిమాను ఆదరించండి. అన్నా రు. కథానాయిక కయాదు లోహర్ మాట్లాడుతూ.. 'రట్టాటటావ్ పాటకు మీ నుంచి వస్తున్న స్పందన సంతోషాన్ని కలిగిస్తోంది. ఇది నా అభిమాన గీతాల్లో ఒకటిగా మారిపోయింది. సినిమా కూడా ఇదే స్థాయిలో ఉంటుంది. ఆద్యంతం నవ్విస్తుంది. ఇంత మంచి సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. అందరం ఎంతో కష్టపడి పని చేశాం. ఈ చిత్రాన్ని మీ అందరికీ చూపించడం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనుదీప్ కె.వి పాల్గొన్నారు.

## ఓంకార్ నాయుడు క్యారెక్టర్ సంతృప్తినిచ్చింది



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా ఇటీవల విడుదలైన ఓం శాంతి శాంతి శాంతిః సినిమాకు ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ వచ్చింది. ఈ సందర్భంగా హీరో తరుణ్ భాస్కర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. సినిమాకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చూసిన ఆడియన్స్ ఒరిజినల్ గా ఫీల్ అవుతున్నారు. కనెక్ట్ అవుతున్నారు. రీమేక్ అని సింపుల్ గా అనేయడం చాలా ఈజీ. కాకపోతే మేము ఈ సినిమా కోసం చాలా వర్క్ చేసాం. మన తెలుగు నేటి వేటికి తగ్గట్టు గోదావరి ప్రాంతాలకు తగ్గట్టు చేసుకున్నాము. ఆడియన్స్ ఎంటర్టైన్ చేయడానికి ఒక మంచి కథ కావాలి. అలాంటి కథ ఇచ్చినప్పుడు ఆడియన్స్ కచ్చితంగా ఎంటర్టైన్ అవుతారని ఈ సినిమా మరోసారి నిరూపించింది.ఒక క్రియేటివ్ వర్క్ చేస్తున్నప్పుడు సలహాలు సూచనలు అవసరమే. కాకపోతే వాటిని ఎక్కడ కట్ చేయాలి అనేది మనకి తెలిసి ఉండాలి. డైరెక్షన్ చేస్తున్నపుడు ఎవరైనా సలహాలు సూచనలు ఇస్తే వింటాను. అవసరమనిపిస్తే తీసుకుంటాను. కానీ ఒక పరిధి దాటి అవి వచ్చాయంటే కచ్చితంగా మనలో ఒక సెల్ఫ్ డౌట్ క్రియేట్ అవుతుంది. ఒక నటుడిగా ప్రాజెక్టు ఒప్పుకున్న తర్వాత నేను కేవలం నటనకే పరిమితం అవుతాను. కొంతమంది నాకు సలహాలు సూచనలు అడిగినా సరే ఇవ్వడానికి పెద్దగా ఇష్టపడను. ఎందుకంటే ఒక దర్శకుడిగా నా యాక్టర్ ఎలా ఉండాలని నేను ఫీల్ అవుతానో, ఒక యాక్టర్ గా చేస్తున్నప్పుడు అలాగే ఉంటాను. నేను నటిస్తున్నప్పుడు మానిటర్ కూడా చూడను. డైరెక్టర్ ఏది చెప్తే అది చేసుకుంటూ వెళ్తాను. ఈ సినిమా క్రెడిట్ అంతా డైరెక్టర్ సజీవ్ దే. ఓంకార్ నాయుడు పాత్ర కోసం చాలా హోంవర్క్ చేశాను. యాస విషయంలో కానీ బాడీ లాంగ్వేజ్ లో కానీ అలాగే బిహేవియర్ లో కానీ ఇది నా పర్సనల్ లైఫ్ కి చాలా డిఫరెం ట్ గా ఉండే క్యారెక్టర్. ఓంకార్ నాయుడు పాత్ర చాలా భిన్నమైనది. తనకి చేపలువ్యాపారం ఉంటుంది. అలాగే తండ్రి చనిపోయిన త ర్వాత ఆ కుటుంబాన్నంతా తనే మోస్తున్న ఫీలింగ్ లో ఉంటాడు. ఆ క్యారెక్టర్ పట్టుకోవడానికి చాలా హోంవర్క్ చేశాను. ఆ ప్రాసెస్ లో చాలా ఎంజాయ్ చేశాను.ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో ఇది మోస్ట్ సాటిస్ఫయింగ్ అండ్ ఛాలెంజింగ్ క్యారెక్టర్. యాక్టింగ్ వృత్తి మీద నాకు చాలా గౌరవం పెరిగింది నేను పుట్టి పెరిగిందంతా తెలంగాణ. ఓంకార్ నాయుడు పాత్ర గోదావరి యాస మాట్లాడాలి. నేను చిన్నప్పటి నుంచి కలిసి పెరిగన వర్మ అనే స్నేహితుడు యాస విషయంలో నాకు మంచి రిఫరెన్స్ పాయింట్. అలాగే వినోద్ అనే లాంగ్వేజ్ కోచ్ వున్నారు. ఆయన అన్ని ఆడియో నోట్స్ పంపించారు. అలాగే ఇక్కడ ఉన్న వాతావరణం గురించి కూడా చాలా విషయాలు చెప్పారు. ఫుడ్ కల్చర్ కూడా పరిచయం చేశారు. ఒకటి రెండు రోజుల తర్వాత ఆ యాస కంప్లీట్ ఫ్లోలో వచ్చేసింది. ఈషాతో ఎప్పటినుంచో వర్క్ చేయాలి అనుకున్నాను. తను అద్భుతమైన నటి. ఎమోషనల్ గా చాలా సైలెంట్ క్యారెక్టర్. డైలాగ్ ద్వారా ఎమోషన్ చెప్పడం ఈజీ. డైలాగ్ లేకుండా ఎమోషన్ చూపించడం అనేది చాలా టఫ్. తను ఆ పాత్రను చాలా అద్భుతంగా చేసింది. తనకి మార్షల్ ఆరట్స్ కూడా తెలుసు. అది ఈ సినిమాకి మరింత కలిసి వచ్చింది. ఒక సీన్‌లో తనని నిజంగానే కొట్టాలి. డైరెక్టర్ కొడితేనే ఆ ఎఫెక్ట్ వస్తుంది అని చెప్పాడు. తనకి తెలియకుండానే నిజంగా కొట్టాను. పాపం తను ఏడ్చేసింది.

## మా ఇంట్లో కవలలు పుట్టారు

### మీడియాతో 'చిరంజీవి'

మా ఇంట్లో కవల పిల్లలు పుట్టారని చిరంజీవి ఆనందంతో మీడియాకు వెల్లడించారు. జూబిలీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన కవల పిల్లలకు జన్మనిచ్చింది. వీరిలో ఒకరు అబ్బాయి కాగా, మరొకరు అమ్మాయి జన్మించారు. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రికి వచ్చిన చిరంజీవి మీడియాతో మాట్లాడారు. ''మమ్ముల్ని అభిమానించే మీ ప్రతి ఒక్కరితో మా ఇంట్లో జరిగిన ఈ శుభ వార్తను మీతో పంచుకోవాలని. ఈ విషయం చెప్తున్నాను. చాలా చాలా సంతోషంగా ఉంది. ఇటు మా కొణిదెల ఫ్యామిలీ, అటు కామినేని ఫ్యామిలీ ఇద్దరు చాలా సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాము. ఉపాసన, రామ్ చరణ్ దంపతులకు కవల పి ల్లలు జన్మానించారు. ఉపాసనతో పాటు పిల్లలు కూడా చాలా ఆరోగ్యాంగా ఉన్నారు. మా ఇంట్లో ఈ శుభం , మంచి జరగాలని ఎప్పుడెక్కడి నుంచి నా అభిమానులు కోరుకున్నారు. భగవంతుడు హనుమాన్ దయవల్ల ఒక ఆడ బిడ్డ , ఒక మగ బిడ్డ జన్మించారు. ఇది మా అందరికి సంతోషాన్ని కలిగించే విషయం. అపోలో చెన్నై నుంచి వచ్చిన డాక్టర్ సుమన, క్లింకారను కూడా ఆమెనే దగ్గరుండి చూసుకున్నారు. డాక్టర్ రమా సిన్హా , పీడియాట్రిక్ డాక్టర్ లతా ఇక్కడ పని చేసే సిబ్బందికి అందరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను'' అని చిరంజీవి పేర్కొన్నారు.





విభిన్న ప్రయోగాలకు చిరునామాగా నిలిచిన లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడికి క్రియేటివ్ సహకారం అందించిన తర్వాత, ఇప్పుడు సింగీతం స్వయంగా దర్శకత్వ బాధ్యతలు తీసుకుంటూ ఎస్.ఎస్.ఆర్61ని తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ని పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సంగీతం క్రియేటివిటీ, ఆయన సినిమాలపై ఉన్న ప్రేమ, తరతరాల దర్శకులపై ఆయన ప్రభావాన్ని గుర్తు చేసే క్లిప్స్ ఆకట్టుకున్నాయి. పుష్పక విమానం, ఆదిత్య 369 లాంటి క్లాసిక్స్‌ను మరోసారి గుర్తు చేశాయి.ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతి మూవీస్

## నాగ్ అశ్విన్ నిర్మాతగా SSR 61

బ్యానర్ నాగ్ అశ్విన్ నిర్మిస్తున్నారు. అనుభవం, ఆధునిక ఆలోచనలు కలిసి వస్తున్న ఈ కాంబినేషన్ అంచనాలు భారీగా ఉన్నాయి. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం సినిమాకు మరింత ఎనర్జీని తీసుకురానుంది.వైజయంతి మూవీస్ ఈ చిత్రాన్ని సింగీతం కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా అభివర్ణించింది. త్వరలోనే టైటిల్‌తో పాటు మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్ ప్రారంభం



పుష్ప సినిమా విలన్ ఫహాద్ ఫాజిల్ తన మొదటి స్ట్రెయిట్ తెలుగు సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్‌ను ఆదివారం గ్రాండ్‌గా ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో హైదరాబాద్‌లో వేసిన సెట్‌కి ఆయన అభిమానులు భారీగా వచ్చారు. అభిమానుల కోలాహలం మధ్యే ఆయన తన షూటింగ్‌ను ప్రారంభించారు. షూటింగ్ నుంచి కాసేపు విరామం తీసుకుని ఫహాద్ ఫాజిల్ తన అభిమానుల్‌ను పలకరించారు. అభిమానుల ప్రేమ, ఉత్సాహాన్ని గుర్తించి అక్కడకు వచ్చిన వారిని హృదయపూర్వకంగా పలకరించాడు. సెట్‌లో సినిమా మొదటి రోజు ఓ పండుగ వైబ్ కనిపించినట్టు అయింది.'ప్రేమలు' సినిమాతో పంపిణీదారుగా ఎస్ ఎస్ కార్తికేయ భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక షోయింగ్ బిజినెస్ బ్యానర్ ద్వారా నిర్మాతగా మారారు. అర్కా మీడియార్స్ షోయింగ్ బిజినెస్ సంయుక్తంగా నిర్మిస్తోన్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రంతో నిర్మాతగా ఎస్ఎస్ కార్తికేయ ఎంట్రీ ఇవ్వబోతోన్నారు.

## 'విత్ లవ్' ఫీల్ గుడ్ సినిమా: రానా



అభిషన్ జీవింత్, అనస్వర రాజన్ ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'విత్ లవ్'. మదన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని సౌందర్య రజనీకాంత్‌తో పాటు నజరత్ పసిలియన్, మహేష్ రాజ్ పసిలియన్ ఎంఆర్పి ఎంటర్టైన్మెంట్ బ్యాన్స సంయుక్తంగా నిర్మించారు. 'విత్ లవ్' చిత్రం ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ సురేష్ ప్రొడక్షన్స్ నిర్వహిస్తోంది. తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో రానా దగ్గుబాటి మాట్లాడుతూ చెప్పలేని ప్రేమ గురించి ఇక్కడ అంతా చాలా బ్యూటిఫుల్‌గా మాట్లాడారు. ట్రైలర్ చూసిన అందరూ కూడా చాలా కనెక్ట్ అయ్యా రు. చూస్తున్నప్పుడు ఇది మన కథే అని పిస్తోంది. సౌందర్య తెలుగులో మ రిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో అభిష న్ జీవింత్ మాట్లాడుతూ టూరిస్ట్ ఫ్యా మిలీకి మీరందరూ గొప్ప ఆదరణ ఇ చ్చారు. విత్ లవ్ కూడా చాలా అద్భుతమైన ఎమోషన్ ఉన్న సినిమా. అం దరూ కూడా కనెక్ట్ అయ్యేలా ఉ ంటుంది. ఇది మీ అందరికీ ఫేవరెట్ సి నిమా అవుతుంది. రానా ఈ సినిమాని మ రింత గొప్ప స్థాయికి తీసుకువెళ్లారు. చాలా ఆనందంగా ఉం దని అన్నారు. ప్రొడ్యూసర్ సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ ఈ సినిమాని తెలుగులోకి తీసుకురావడం నాకు చాలా ఆనందంగా ఉంది. రానా నాకు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. తనతో నాకు ఎన్నో బాల్య జ్ఞాపకాలు ఉన్నాయి. తను డైరెక్ట్ గా మంచి సక్సెస్ ఇచ్చాడు. ఈ సినిమాలో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశాడు. అనస్వర తెలుగులో సినిమాలు చేస్తోంది. ఫిబ్రవరి 6న తప్పకుండా ఈ సినిమా మీరందరూ థియేటర్స్‌లో చూస్తారని కోరుకుంటున్నాను అని తెలిపారు.

# ఉపాధి, ఉద్యోగాలను విస్మరించిన శుష్కవాగ్దానాల కార్మిక వ్యతిరేక బడ్జెట్

### 12న జాతీయసమ్మె విజయవంతానికి ఎఐటియుసి పిలుపు



**న్యూఢిల్లీ:** ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సమర్పించిన 2026–27 కేంద్ర బడ్జెట్ ఉపాధి,ఉద్యోగాలను విస్మరించి,భవిష్యత్తుకు సంబంధించిన శుష్కవాగ్దానాలతో వాక్చాతుర్యాన్ని ప్రదర్శించిందని, సామాన్య జనబాహుళ్యానికి ఉపయోగపడే ఎలాంటి సారాంశంలేని బడ్జెట్ ప్రసంగం కార్మిక వర్గం ఆశలను నీరుగార్చిందని ఎఐటియుసి విమర్శించింది. కార్పొరేట్ పన్ను పెంచి, ప్రజావసరాల నిమిత్తం ధనాన్ని సేకరించేందుకు సంపద పన్ను,బహుమతి పన్నులను ప్రవేశపెట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే, సామాన్య ప్రజలపై పరోక్ష పన్నులు, సుంకాలు విధించి కొత్త భారాలు మోపడంతప్ప కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించింది. మొత్తం బడ్జెట్‌లో 22 శాతాన్ని రవాణా,సైనిక రంగాలకే కేటాయించారని, ఆరోగ్యం, విద్య,సామాజిక సంక్షేమాలకు కలిపి కేవలం ఆరూ శాతం కంటే తక్కువ కేటాయింపులుచేశారని పేర్కొంది. ఈనెల 12వ తేదీన కార్మికసంఘాలు తలపెట్టిన జాతీయస్థాయి సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం, రైతులు, యువకులు,విద్యార్థులు,సామాన్య ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి పిలుపు ఇచ్చింది. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ కేంద్ర బడ్జెట్‌పై ప్రాథమిక పరిశీలనలను ఈ మేరకు ఒక ప్రకటనగా విడుదల చేశారు.

వ్యాపార నియంత్రణల సంక్షిప్తీకరణ–ఉపశమనం పేరుతో కేంద్ర బడ్జెట్ కార్పొరేట్స్‌కు, వాణిజ్యవేత్తలకు అదేపనిగా రాయితీలను కొనసాగించే చర్యలకు పూనుకుందన్న విషయం బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైందని, రిఫామ్ ఎక్స్‌ప్రెస్ అనే పదాన్ని ఉపయోగించడం ద్వారా బడ్జెట్‌ను ఉన్నతవర్గాలకు అనుకూలంగా సంపూర్ణ సంస్కరణలను చేపట్టారని విమర్శించారు. వృద్ధి సాధించేందుకు కార్మికులను అణచివేసే లేబర్‌కోడ్‌లను, నియంత్రణల ఎత్తివేతను ఒక మంత్రంగా ఆర్థికమంత్రి పదే పదే ఉద్ఘాటించి చెప్పారన్నారు. మొత్తంగా చూస్తే బడ్జెట్ నిరుద్యోగం,ధరలు,ద్రవ్యోల్బణం పెంచేదిగా, ధనికుల,కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందన్నారు. బడ్జెట్‌లో అనేక ప్రతిపాదనలు వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టేవిగా లేవని, ఉన్నవన్నీ పునరుద్ఘాటనలు, గతంలో ఉన్న పథకాలకు ప్రతిరూపాలేనని విమర్శించారు.

సామాజిక, ఆర్థిక ఫలితాలు సాధించేందుకు ఒక బృహత్తర ప్రణాళికను ప్రకటించకపోగా ఈ దార్శనిక బడ్జెట్ పేరుతో సమర్పించిన పత్రం ఎక్కువగా ప్రకటనలతోనే నిండిపోయిందని విమర్శించారు. ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు ఆదాయాల సృష్టి, వినియోగ వ్యయాల పెరుగుదల,మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ రంగ వ్యవస్థలను పటిష్టం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సంరక్షించడం వంటి దీర్ఘకాలికమైన వ్యవస్థాగత దిశానిర్దేశమేదీ ఈ బడ్జెట్ ప్రసంగంలో లేదని పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షల ప్రాతిపదకపై అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గొంతు నులిమి ఆ స్థానంలో విబి–జి రామ్ జీ చట్టం–2025తోపాటు శాంతి చట్టం,విత్తనబిల్లు, విద్యుత్ సవరణ బిల్లు–2025 వంట ఇటీవల పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి భారతదేశాన్ని ఒక సంక్షేమరాజ్యంగా కొనగించాలనే ఉద్దేశం లేదని ఆమె విమర్శించారు. వికసిత్ భారత్‌కు అనుగుణంగా బ్యాంకుల సంస్కరణలకు ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు ఇచ్చిన స్పష్టమైన పిలుపు అని హెచ్చరించారు. కేవలం లాభాలకోసం మాత్రమే ప్రైవేటు బ్యాంకులు పనిచేస్తాయని, ప్రాధాన్యతారంగాలకోసం,గ్రామీణ పరపతి సమకూర్చడంకోసం, సమస్త జనులను ఆర్థిక వ్యవస్థలో సమ్మిళితం చేయడంకోసంప్రైవేటు బ్యాంకులు పనిచేయవని, కానీ ప్రభుత్వరంగ బ్యాంకులు మాత్రం దేశంలో చారిత్రకంగా స్థిరమైన పాత్ర నిర్వహిస్తున్నాయని, ఆర్థికమంత్రి గ్రామాలలో 98 శాతం బ్యాంకు బ్రాంచీల గురించి చెప్పారని, కానీ ఈ పని కేవలం జాతీయ బ్యాంకులవల్లే సాధ్యమవుతుందని అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు.

సెమీకండక్టర్ల తయారీ,బయో ఫార్మా క్లస్టర్స్, అరుదైన ఖనిజాల డిజైన్ల తయారీ వంటి పెట్టుబడి ప్రాధాన్యంగల రంగాలను కార్పొరేట్ శక్తులకే కేటాయించారుతప్ప వీటివల్ల సూక్ష్మ,చిన్న,మధ్యతరహా ఔత్సాహిక పరిశ్రమలకు ఎలాంటి ప్రయోజనం, ఉపాధిసృష్టి జరుగుతుందనే విషయాన్ని అనిశ్చితంగానే వదిలిపెట్టారని విమర్శించారు. ఆర్థికమంత్రి ప్రకటించిన భవిష్యత్ ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో కార్మిక సంఘాలను లేకుండా ప్రయత్నం చేస్తున్నారన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు రూ.720 కోట్లు విడుదల

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ పెండింగ్ మొత్తం ఒకే సారి క్లియర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్ ఛానల్ లో పెండింగ్ నిధులను నెలవారీగా విడుదల చేస్తూ వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.720 కోట్లు విడుదల చేసింది. జనవరి మాసానికి సంబంధించిన పెండింగ్ బిల్లుల విడుదలకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం రూ. 720 కోట్లు విడుదల చేశారు. గత ప్రభుత్వానికి ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలకు సంబంధించి ప్రతి నెల రూ.700 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది.

గత సంవత్సరం జూన్ నెలాఖరులో రూ.183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆ తర్వాత గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. తాజాగా విడుదల చేసిన నిధులలో 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్ చేసింది. వీటితోపాటు విడుదలైన బిల్లులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్‌లు, అడ్వాన్సులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ వస్తోందని డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది.

# ఎస్‌ఎల్‌బిసి నిర్మాణ పనులో జాప్యం ఉపేక్షించేది లేదు

### రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌ఎల్‌బిసి నిర్మాణ పనులలో జాప్యాన్ని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగ మార్గం పనులను నిరంతరం కొనసాగించి, త్వరిత గతిన పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని బ్యారేజ్‌ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు ఈ నెల 16వ తేదీ తర్వాత ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల కమిటీతో సమావేశం నిర్వహించాలని అధికారులను ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మెడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం బ్యారేజిల పునరుద్ధరణ పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం నీటి పారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్థాంతరంగా నిలిచిపోయిన ఎస్‌ఎల్‌బిసి పనుల పునరుద్ధరణకు చేపట్టిన హెలిబోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని, సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేసేందుకు అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ప్రతికూల పరిస్థితిలు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టడానికి సర్వే నివేదిక ఉపకరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్‌ను నియమించి, ఆయనకు సహకరించేందుకు స్వతంత్ర పర్యవేక్షణ కన్సల్టెంట్‌ను కూడా నియమించాలని ఉత్తమ్ సూచించారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు భద్రతా,నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు గాను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారన్నారు.సొరంగ మార్గంలో ఏర్పడుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు గాను ప్రత్యేక జియో టెక్నికల్,జియాలజికల్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**బ్యారేజ్‌ల పునరుద్ధరణలో సమన్వయంగా వ్యవహరించాలె**

కాళేశ్వరం బ్యారేజ్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక సంస్థలను,డిజైన్ కన్సల్టెంట్స్‌ల మధ్య సమన్వయ ఆవశ్యకత ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సెంట్రల్ వాటర్ , పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్,ప్రాజెక్ట్ డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమన్వయంగా వ్యవహరిస్తే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభమవుతుందని చెప్పారు. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు.

# ముగిసిన ముఖ్యమంత్రి విదేశీ పర్యటన

### హైదరాబాద్‌కు చెరుకున్న సిఎం రేవంత్ రెడ్డి
### నేటి ఉదయం మంత్రులు, ముఖ్య నేతలతో సమావేశం
### మధ్యాహ్నం అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమానికి సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగిసింది. విదేశీ పర్యటన ముగించుకున్న సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్విట్జర్లాండ్ నుంచి అమెరికా వెళ్ళి హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నరమెంట్‌లో '21వ శతాబ్దం లీడర్‌షిప్‌పై సర్టిఫికెట్ కోర్సు' పూర్తి చేశారు. అనంతరం రాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మంత్రులు, టిపిసిసి ముఖ్యనేతలతో సమావేశమై రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై చర్చించనున్నారు. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, ముఖ్య నేతల విచారణ, బొగ్గు గనుల వివాదం తదితర అంశాలపై సమాలోచనలు జరిపే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 4న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ముఖ్యమంత్రి మున్సిపల్ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ఈ నెల 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి, 7న వికారాబాద్ జిల్లా పరిగి, 8న భూపాలపల్లి, 9న మెదక్‌లో సిఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో పాల్గొంటారు.హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో సోమవారం మధ్యాహ్నం జరగనున్న 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి హాజరై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి అవార్డును ప్రదానం చేయనున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com